


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 121 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 13 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 121 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 13 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## హైదరాబాదు హాలీవుడ్ రాబోతోంది!

### నెట్ ఫ్లిక్స్ తో నా కల నిజం కాబోతుంది
### ఐలైన్ స్టూడియోస్ విస్తరణ కు సహకరిస్తం
### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** నెట్ ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ తనకు బాల్యం నుంచి సినిమాలు అంటే అమితమైన ఆసక్తి అని చెప్పారు. అప్పటి సినిమాలకు ఇప్పటికీ ఎన్నో మార్పులు వచ్చాయని వివరించారు. బాహుబలి,కల్కి .ఆర్ ఆర్ ఆర్,అరుంధతి వంటి అత్యనున్నత సాంకేతిక తో కూడిన సినిమాలు వచ్చాయ న్నారు. హైదరాబాద్ కు హాలీవుడ్ రాబో తోందని, నెట్ ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ తో నమ్మకం ఏర్పడిందన్నారు. నెట్ ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణ కు పూర్తి సహకారం అందిస్తామని సీఎం చెప్పారు. విస్తరణకు పెద్ద ఆఫీస్ నిర్మాణానికి కావాల్సిన భూమి ఫ్యూచర్ సిటీ లో ఇవ్వడానికి సిద్ధం గా ఉన్నా మని అన్నారు. నెట్ ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్ ను



ఫ్యూచర్ సిటీ కి తీసుకురావాలని కోరు తున్నట్టు రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రపంచం లో ఉన్న 500 పెద్ద కంపెనీలు తెలంగాణ కు తీసుకు రావడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. తెలంగాణ అంటే వ్యాపారమని, పెట్టుబడికి పూర్తి రక్షణ ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు.



## ఫరూక్ అబ్దుల్లాపై నాన్ బెయిలబుల్ వారెంట్

- జేకేసీఏ స్కామ్ కేసులో ఫరూక్ అబ్దుల్లాకు నాన్ బెయిలబుల్ వారెంట్
- వ్యక్తిగత హాజరు మినహాయింపు పిటిషన్‌ను తిరస్కరించిన శ్రీనగర్ కోర్టు
- క్రికెట్ నిధుల దుర్వినియోగంపై సీబీఐ గతంలోనే ఛార్జిషీట్ దాఖలు
- మార్చి 30కి తదుపరి విచారణను వాయిదా వేసిన న్యాయస్థానం

మిగతా 2లో




## గల్ఫ్‌లో అమెరికా సైనిక స్థావరాలు ఎత్తేయాల్సిందే..
## లేదంటే అటాక్ చేస్తూనే ఉంటాం
### ఇరాన్ సుప్రీం లీడర్ ఫస్ట్ రియాక్షన్

**హైదరాబాద్ పెన్ పవర్:**గల్ఫ్ లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు ఎత్తేయాల్సిందే.. లేదంటే అటాక్ చేస్తూనే ఉంటాం.. ఇది ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఫస్ట్ రియాక్షన్. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ మరణించిన తర్వాత కొత్తగా అపాయింట్ అయిన మొజ్తాబా ఖమేనీ.. చాలా రోజులుగా మౌనం వహిస్తూ.. గురువారం (మార్చి 12) తొలిసారిగా స్పందించారు. ఈ సందర్భంగా అమెరికా, ఇజ్రాయెల్ సహా వాటి

మిగతా 2లో

## తెలంగాణలో గ్యాస్ కొరత లేదు,
## వాణిజ్య సిలిండర్ల కొరత మాత్రం ఉంది

- గ్యాస్ కొరతపై చమురు రంగ కంపెనీలతో సమీక్ష జరుపుతామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా గ్యాస్ సరఫరా చేస్తామని హామీ
- డీలర్లు బ్లాక్ మార్కెటింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో డొమెస్టిక్ గ్యాస్ కొరత లేదని, కేవలం వాణిజ్య సిలిండర్ల కొరత మాత్రమే ఉందని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సూర్యాపేటలో 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గ్యాస్ కొరతపై శుక్రవారం చమురు రంగ కంపెనీలతో సమీక్షిస్తామని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా గ్యాస్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. గ్యాస్ సిలిండర్ల విషయంలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీలర్లు బ్లాక్ మార్కెటింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్యాస్ సరఫరాపై ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు.ప్రజలు గ్యాస్ కొరతతో ఇబ్బందిపడుతున్నా

మిగతా 2లో

## 10 మంది ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్..
## పార్టీ ఫిరాయింపు కేసును ముగించిన సుప్రీంకోర్టు

- తెలంగాణలో ఉత్కంఠ రేపిన పార్టీ ఫిరాయింపుల వ్యవహారం
- అన్ని పిటిషన్లను స్పీకర్ పరిష్కరించారన్న న్యాయవాది అభిషేక్ సింఘ్వీ
- స్పీకర్ నిర్ణయం నేపథ్యంలో విచారణ ముగిసిందని ప్రకటించిన సుప్రీంకోర్టు

మిగతా 2లో



## హోర్ముజ్ మీదుగా భారత్ వచ్చే నౌకల ప్రయాణంపై ఇరాన్‌తో చర్చించాం

- దేశ ఇంధన భద్రతపై చర్చించినట్లు రణధీర్ జైశ్వాల్ వెల్లడి
- డీజిల్ సరఫరా కోసం బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయని వెల్లడి
- ముందుగా మన దేశ అవసరాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందన్న భారత్

**పెన్ పవర్ డెస్క్:**హోర్ముజ్ జలసంధి మీదుగా భారత్‌కు వచ్చే నౌకల ప్రయాణం గురించి ఇరాన్‌తో చర్చిం చామని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు. దేశ ఇంధన భద్ర తపై ఆ దేశంతో చర్చించినట్లు తెలిపారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడు తూ, డీజిల్ సరఫరా కోసం బంగ్లాదేశ్ ప్రభు త్వం విజ్ఞప్తి చేసిందని అన్నారు. శ్రీలంక, మాల్దీవుల నుంచి కూడా ఇదే తరహా అభ్యర్థనలు వచ్చాయని కానీ ముందుగా మన దేశ అవసరాలను కేంద్రం

మిగతా 2లో





## కల్వకుంట్ల కవిత ఇంటికి వచ్చిన సీబీఐ అధికారులు

- ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం
- 16వ తేదీన విచారణకు హాజరు కావాలంటూ సమన్లు ఇచ్చిన సీబీఐ
- దీనిపై తన లీగల్ టీమ్‌తో చర్చిస్తున్నానన్న కవిత

**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలంగాణ

మిగతా 2లో




## ఇది ప్రారంభం మాత్రమే... గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది

- దేశానికి ఇంధన సంక్షోభం ముంచుకొస్తోందని రాహుల్ గాంధీ హెచ్చరిక
- గ్యాస్, పెట్రోల్, ఎల్పీజీ సరఫరాలో తీవ్ర సమస్యలు తప్పవని ఆందోళన
- ప్రభుత్వ తప్పుడు విదేశాంగ విధానాలే ఈ పరిస్థితికి కారణమని విమర్శ
- ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సూచన
- ఈ అంశంపై మాట్లాడేందుకు లోక్‌సభలో అనుమతి నిరాకరించారని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, దేశ ఇంధన భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తప్పుడు విదేశాంగ విధానాల కారణంగా దేశం త్వరలో గ్యాస్, పెట్రోల్ వంటి ఇంధనాల

మిగతా 2లో

## గ్యాస్ కొరతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి




- ఎల్పీజీ సిలిండర్ల కొరతపై కేంద్రానికి కేటీఆర్ లేఖ
- హోటళ్లు, హాస్టళ్లు మూతపడే ప్రమాదమని హెచ్చరిక
- చిన్న వ్యాపారులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచన
- బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- గ్యాస్ ఆధారిత శ్మశానవాటికలను అత్యవసర సేవలుగా గుర్తించాలని విజ్ఞప్తి

**హైదరాబాద్ పెన్ పవర్:**దేశంలో వాణిజ్య, గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల తీవ్ర కొరత ఏర్పడిందని, ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి ఒక లేఖ రాశారు.ఎల్పీజీ సరఫరాలో అంతరాయం కారణంగా హోటళ్లు, తినుబండారాలు,

మిగతా 2లో

## తెలంగాణలో ఒంటిపూట బడులు..
## ఈ నెల 15 నుంచి కొత్త వేళలు

- వేసవి తాపం దృష్ట్యా తెలంగాణలో ఒంటిపూట బడుల నిర్వహణ
- ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు మారిన పనివేళలు
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు తరగతులు
- పదో తరగతి ప్రత్యేక క్లాసులు యథాతథంగా కొనసాగింపు
- అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వర్తించనున్న నిబంధనలు

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# సాగుకు యుద్ధం సెగ

ప్రపంచ పరిణామాలు ఎంతదూరంలో జరిగినా, వాటి ప్రభావం సామాన్య వ్యక్తి జీవితంపైనే పడుతుంది. ముఖ్యంగా వ్యవసాయం వంటి సున్నితమైన రంగంపై అంతర్జాతీయ సంఘర్షణల ప్రభావం చాలా తీవ్రం. ప్రస్తుతం పశ్చిమాసియాలో విస్తరిస్తున్న యుద్ధ ఉద్రిక్తతలు, ఆర్థిక ఆంక్షలు, సరఫరా గొలుసుల్లో వచ్చిన అంతరాయాలు భారతీయ వ్యవసాయరంగాన్ని గణనీయంగా ప్రభావితం చేసే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. ఎరువుల ధరల పెరుగుదల, రవాణా వ్యయాలు, ఎగుమతి మార్కెట్లలో అస్థిరత.. ఇవన్నీ అన్నదాతలపై అదనపు భారంగా మారుతున్నాయి. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు; ఇది భారతదేశ ఆహార భద్రతకు, రైతు ఆత్మగౌరవానికి సంబంధించిన జాతీయ సవాలు. వ్యవసాయంలో ఎరువులు అనేవి రక్తం లాంటివి. ప్రపంచవ్యాప్తంగా యూరియా, ఫాస్ఫేట్, పొటాష్ తయారీ సహజ వాయువుపై ఆధారపడి ఉంది. పశ్చిమాసియాలో యుద్ధం మరింత తీవ్రమైతే సహజ వాయువు సరఫరా దెబ్బతినడం ఖాయం. దీని ప్రభావం నేరుగా ఎరువుల ఉత్పత్తి వ్యయంపైపడి, మార్కెట్ ధరలు ఆకాశాన్నంటాయి. ఇప్పటికే గత కొన్నేళ్లుగా ఎరువుల ధరలు రైతులను కష్టాల్లో ముంచేశాయి.

ఇప్పుడు యుద్ధం కలిసి వచ్చేస్తే వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటల సాగు ఖర్చు మరింత ఎగిసి, రైతు లాభాలు మట్టిలో కలిసిపోతాయి. సాగు వ్యయం పెరిగినా, మార్కెట్ ధరలు అదే స్థాయిలో పెరగకపోతే రైతు ఆర్థిక దశ మరింత దారుణంగా మారడం తప్పదు. ఇది కేవలం ఎరువులతో ఆగదు. పశ్చిమాసియా ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన సముద్ర మార్గాలు.. హార్మూజ్ జలసంధి, ఎర్ర సముద్రం.. ఉద్రిక్తతలతో కలకలమైతే నౌకాశ్రయ రవాణా, బీమా ఖర్చులు భారీగా పెరుగుతాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి బియ్యం, మిర్చి, రొయ్యలు పెద్ద ఎత్తున పశ్చిమాసియా దేశాలకు వెళ్తున్నాయి. ఇరాన్ లాంటి దేశాలు మన బియ్యం ముఖ్యమైన కొనుగోలుదారులు. యుద్ధం వల్ల ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలు బలహీనపడితే లేదా రవాణా మార్గాలు మూసుకుపోతే మన ఎగుమతులు నేలకూలతాయి. ఇది కేవలం వ్యాపార నష్టం కాదు; లక్షలాది రైతుల, మత్స్యకారుల జీవనోపాధి ప్రశ్నార్థకం అవుతుంది. మరో వైపు, వ్యవసాయం పూర్తిగా ఇంధనంపై ఆధారపడి ఉంది. ట్రాక్టర్లు, నీటి మోటార్లు, రవాణా వాహనాలు అన్నీ డీజిల్‌పై నడుస్తాయి. పశ్చిమాసియా యుద్ధం చమురు ధరలను ఎగరేస్తే భారత్‌లో డీజిల్ ధరలు పెరగడం ఖాయం. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, కార్మిక ఖర్చులు పెరిగిన తర్వాత ఇంధన ధరలు కూడా ఎగిస్తే రైతు తీవ్ర ఆర్థిక ఒత్తిడికి లోనవుతాడు. ఎరువుల కొరత వల్ల రైతులు తక్కువ ఎరువులు వాడితే పంటల దిగుబడులు తగ్గి, దేశీయ ఆహార ఉత్పత్తి తగ్గి, ఆహార భద్రతకు గండి పడే ప్రమాదం ఉంది. భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద బియ్యం ఉత్పత్తిదారు. దిగుబడులు తగ్గితే దేశీయ అవసరాలు తీర్చడమే సవాలుగా మారి, ఆహార ధరలు పెరిగి సాధారణ ప్రజలు కూడా ఇబ్బందిపడతారు. అయితే ప్రతి సంక్షోభంలో ఒక అవకాశం దాగి ఉంటుంది. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నప్పుడు కొన్ని దేశాలు ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కుంటాయి. అప్పుడు మన బియ్యం, మసాలా పంటలు, పప్పుధాన్యాలకు మంచి డిమాండ్, మంచి ధరలు లభించే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రపంచ రొయ్యల ఉత్పత్తిలో కీలకం. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటే ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ఏం చేయాలి? 'ఎరువుల సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు ప్రత్యామ్నాయ దిగుమతి మార్గాలను వెంటనే అన్వేషించాలి. 'రైతులకు డీజిల్, ఎరువులపై సబ్సిడీలను పెంచాలి.' ఎగుమతులకు కొత్త మార్కెట్లను అభివృద్ధి చేయాలి. 'నిల్వ వ్యవస్థలను బలోపేతం చేసి, సంక్షోభ సమయంలో కూడా ఆహార భద్రత కాపాడాలి. పశ్చిమాసియా యుద్ధం కేవలం రాజకీయ లేదా భౌగోళిక సమస్య కాదు. అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే శక్తివంతమైన ఆయుధం. ఆ దెబ్బ చివరికి భారతీయ రైతు పొలానికి, అతని కుటుంబానికి చేరుతుంది. కాబట్టి ఈ సంక్షోభాన్ని తాత్కాలిక సమస్యగా కాకుండా, దీర్ఘకాలిక వ్యూహంతో ఎదుర్కోవాలి. రైతులకు రక్షణ, వ్యవసాయానికి బలం, ఆహార భద్రతకు కాపలా.. ఇవే ప్రభుత్వాల ముందున్న అత్యవసర బాధ్యతలు.

# 10 మంది ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్..
# పార్టీ ఫిరాయింపు కేసును ముగించిన సుప్రీంకోర్టు

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇప్పటికే ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. ఫిరాయింపులపై దాఖలైన మొత్తం 10 పిటిషన్లను స్పీకర్ ఇప్పటికే పరిష్కరించారని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ధర్మాసనానికి వివరించారు. సదరు 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ తేల్చిచెప్పినట్లు ఆయన తెలిపారు. సింఘ్వీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను రెండు రోజుల్లోగా ఫిర్యాదుదారులకు అందజేయాలని ఆదేశించింది. స్పీకర్ తన నిర్ణయాన్ని వెలువరించిన నేపథ్యంలో, ఈ పిటిషన్లపై విచారణ ముగిసినట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది.

# గ్యాస్ కొరతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

- మొదటి పేజి తరువాయి

పీజీ హాస్టళ్లు, చిన్న ఆహార వ్యాపారాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని కేటీఆర్ తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. సరఫరాను వెంటనే పునరుద్ధరించకపోతే, వేలాది సంస్థలు మూతపడే ప్రమాదం ఉందని, వాటిపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేటీఆర్ కేంద్రానికి కొన్ని కీలక సూచనలు చేశారు. చిన్న వ్యాపారులకు ప్రాధాన్యతనిచ్చేలా ఎల్పీజీ కేటాయింపుల విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. జిల్లాల వారీగా సిలిండర్ల లభ్యతపై పారదర్శక సమాచారం కోసం రియల్-టైమ్ పబ్లిక్ డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షోభ సమయంలో చిన్న వ్యాపారులపై అదనపు భారం పడకుండా వాణిజ్య సిలిండర్ల ధరల పెరుగుదలను తాత్కాలికంగా నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

గృహ వినియోగ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు మళ్లించి, అధిక ధరలకు విక్రయించే బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఐటీ కారిడార్ ప్రాంతాల్లోని పీజీ హాస్టళ్లను ప్రత్యేక కేటగిరీగా గుర్తించి, అంతరాయం లేని సరఫరాను అందించాలని కోరారు. అలాగే, గ్యాస్ ఆధారిత శ్మశానవాటికలను అత్యవసర సేవలుగా వర్గీకరించి, వాటి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా చూడాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. ఇది లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేసే తీవ్రమైన సమస్య అని, వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# కల్వకుంట్ల కవిత ఇంటికి వచ్చిన సీబీఐ అధికారులు

- మొదటి పేజి తరువాయి

జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నివాసానికి ఈరోజు సీబీఐ అధికారులు వచ్చారు. మధ్యాహ్నం హైదరాబాద్‌లోని కవిత నివాసానికి వెళ్లిన సీబీఐ అధికారులు, ఈ నెల 16వ తేదీన విచారణకు హాజరు కావాలని కోరుతూ ఆమెకు సమన్లు అందజేశారు.ఫిబ్రవరి 27న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులో కవితతో పాటు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా సహా 23 మందిని డిశ్చార్జ్ చేస్తూ సంచలన తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. సీబీఐ మోపిన అభియోగాలు నిరాధారమని కోర్టు అప్పట్లో పేర్కొంది. ట్రయల్ కోర్టు ఇచ్చిన డిశ్చార్జ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు... ట్రయల్ కోర్టులో ఈడీ కేసు విచారణను వాయిదా వేయాలని ఆదేశించడంతో పాటు, ప్రతివాదులందరికీ

నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలోనే సీబీఐ అధికారులు కవితకు సమన్లు అందించారు.ఈ అంశంపై కవిత ఎక్స్ వేదికగా స్పందిస్తూ... "ఈరోజు మధ్యాహ్నం సీబీఐ అధికారులు నాకు నోటీసులు అందజేశారు. దీనిపై నా లీగల్ టీమ్‌తో చర్చిస్తున్నాను. చట్టంపై నాకు నమ్మకం ఉంది. విచారణకు సంపూర్ణంగా సహకరిస్తాను" అని పేర్కొన్నారు.

# తెలంగాణలో ఒంటిపూట బడులు..
# ఈ నెల 15 నుంచి కొత్త వేళలు

తెలంగాణలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పనివేళల్లో మార్పులు చేసింది. ఈ నెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఒంటిపూట బడులు (హాఫ్‌డే స్కూల్స్) నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఇవాళ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ ఆదేశాల ప్రకారం ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు ఒంటిపూట విధానంలోనే నడుస్తాయి. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్స్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మాత్రమే పనిచేస్తాయి. తరగతులు ముగిసిన వెంటనే మధ్యాహ్నం 12:30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారు.

అయితే, పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు యథావిధిగా కొనసాగుతాయని

ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే, పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా ఉన్న పాఠశాలలు పరీక్షలు జరిగే రోజుల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుంది. మిగతా రోజుల్లో ఈ కేంద్రాలు కూడా సాధారణ హాఫ్‌డే టైమింగ్స్‌ను పాటిస్తాయి.

# ఇది ప్రారంభం మాత్రమే...
# గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది

- మొదటి పేజి తరువాయి

విషయంలో తీవ్ర సవాళ్లు ఎదుర్కోబోతోందని హెచ్చరించారు. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది... ఇది ప్రారంభం మాత్రమే అని అన్నారు. ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే మేల్కొని, తగిన ఏర్పాట్లు చేయాలని గురువారం డిమాండ్ చేశారు.పార్లమెంట్ వెలుపల విలేకరులతో మాట్లాడిన రాహుల్ గాంధీ, దేశంలో నెలకొన్న గ్యాస్, ఎల్పీజీ పరిస్థితిపై సభలో మాట్లాడేందుకు తాను ప్రయత్నించగా, తనకు అనుమతి లభించలేదని తెలిపారు. "సాధారణంగా సభలో మాట్లాడటానికి ఒక పద్ధతి ఉంటుంది. కానీ ఇప్పుడు కొత్త విధానం మొదలైనట్లుంది. నేను మాట్లాడాలనుకున్న అంశంపై ముందు మంత్రి నిర్ణయిస్తారు, ఆ తర్వాతే నేను మాట్లాడాలి. మళ్ళీ ఆ తర్వాత మంత్రి స్పందిస్తారు. ఈ కొత్త పద్ధతి ఆశ్చర్యంగా ఉంది" అంటూ ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, "రాబోయే రోజుల్లో గ్యాస్, పెట్రోల్, అన్ని రకాల ఇంధనాలు పెద్ద సమస్యగా మారనున్నాయి. ఎందుకంటే మన ఇంధన భద్రత దెబ్బతింది. ప్రభుత్వ లోపభూయిష్ట విదేశాంగ విధానం ఈ సమస్యను సృష్టించింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రధాని మోదీ మేల్కొని సన్నాహాలు ప్రారంభించాలి. లేకపోతే కోట్లాది మంది ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతారు" అని స్పష్టం చేశారు.ఈ సమస్య కేవలం ఇరాన్ వంటి దేశాలు ఇంధన సరఫరాను అనుమతిస్తాయా లేదా అనేదాని కంటే చాలా పెద్దదని రాహుల్ అన్నారు. "మనం ఒక అస్థిరమైన కాలంలోకి అడుగుపెడుతున్నాం. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా మన ప్రజలు ఇబ్బంది పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని తెలిపారు.తాను చేస్తున్నది రాజకీయ విమర్శ కాదని, రాబోయే పెను ప్రమాదం గురించి కేవలం హెచ్చరిస్తున్నానని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. "ఇది రాజకీయ ప్రకటన కాదు. నా కళ్లకు ఓ పెద్ద సమస్య కనిపిస్తోంది. ప్రపంచం మారుతోంది, దాని నిర్మాణం కూడా మారుతోంది. కాబట్టి మనం కూడా మన ఆలోచనా ధోరణిని మార్చుకోవాలి. స్పష్టతతో పనిచేయకపోతే, మారుతున్న ప్రపంచంలో భారత్‌ను 'కేంద్రంగా' నిలపకపోతే సమస్యలు తప్పవు" అని ఆయన పేర్కొన్నారు.

# గల్ఫ్‌లో అమెరికా సైనిక స్థావరాలు ఎత్తేయాల్సిందే..

- మొదటి పేజి తరువాయి

మిత్ర దేశాలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

**ఖమేనీ స్టేట్‌మెంట్స్:**

హార్మూజ్ జలసంధి మేసే ఉంటుంది

మిత్ర దేశాలతో స్నేహం కొనసాగుతుంది

కానీ అమెరికాతో అంటకాగితే పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది

పశ్చిమాసియాలో ఉన్న అమెరికా ఆర్మీ బేస్ క్యాంపులను ఎత్తేయాలి

లేదంటే వాటిపైన మరింత తీవ్రంగా దాడి చేస్తాం

సైనిక స్థావరాలు మూసేవరకు టార్గెట్ చేస్తూనే ఉంటాం

హార్మూజ్ జలసంధిని బ్లాక్ చేసే ప్రాంతాన్ని వాడుకుంటూ యుద్ధంలో పైచేయి సాధిస్తాం

గల్ఫ్ దేశాలు అమెరికా మిలిటరీ బేస్ లను మూసివేయాలి

లేదంటే మా ఫస్ట్ టార్గెట్స్ అవే అవుతాయి

ఆయతొల్లా ఖమేనీపై జరిగిన దాడిలో ఆయన కుమారుడైన మొజ్తాబా ఖమేనీ గాయపడినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇన్నాళ్లుగా మౌనంగా ఉన్న ఆయన తొలిసారి ఇరాన్ ప్రజలను ఉద్దేశించి సందేశం పంపారు. అదే విధంగా అమెరికాతో పాటు దాని మిత్ర దేశాలు, పొరుగు దేశాలకు కూడా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఖమేనీ పంపిన సందేశాన్ని ఇరాన్ ప్రభుత్వ టీవీలో న్యూస్ ప్రజెంటర్ చదివి వినిపించారు.

## తెలంగాణలో గ్యాస్ కొరత లేదు, వాణిజ్య సిలిండర్ల కొరత మాత్రం ఉంది

- మొదటి పేజి తరువాయి

కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మరో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఇద్దరు కేంద్రమంత్రులు, ఎనిమిది మంది ఎంపీలు ఉన్నా మన రాష్ట్రానికి కావాల్సిన గ్యాస్‌ను తీసుకురావడం లేదని విమర్శించారు. మున్ముందు ఎరువుల కొరత కూడా ఏర్పడే అవకాశముందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ చర్యలు తీసుకుంటోందని అన్నారు.

# ఫరూక్ అబ్దుల్లాపై నాన్ బెయిలబుల్ వారెంట్

జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాకు శ్రీనగర్ కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ (జేకేసీఏ) నిధుల దుర్వినియోగం కేసులో ఆయనపై గురువారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. ఈ కేసు విచారణలో భాగంగా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఫరూక్ అబ్దుల్లా దాఖలు చేసిన పిటిషన్‌ను శ్రీనగర్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. తక్షణమే ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను మార్చి 30వ తేదీకి వాయిదా వేసింది. జేకేసీఏలో జరిగిన ఆర్థిక అవకతవకలకు సంబంధించిన ఈ కేసులో నిందితులపై అభియోగాల నమోదు ప్రక్రియ కోసం గురువారం కోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగానే న్యాయస్థానం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. జేకేసీఏ అధ్యక్షుడిగా ఫరూక్ అబ్దుల్లా ఉన్న సమయంలో క్రికెట్ అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను పక్కదారి పట్టించారని, భారీగా దుర్వినియోగం జరిగిందని ప్రధాన ఆరోపణగా ఉంది. ఈ కుంభకోణంపై ఇప్పటికే దర్యాప్తు చేపట్టిన కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఫరూక్ అబ్దుల్లాతో పాటు పలువురిపై రణబీర్ పీనల్ కోడ్ (ఆర్‌పీసీ)లోని సెక్షన్ 120-బి (కుట్ర), 406 (విశ్వాసఘాతుకం), 409 (ప్రభుత్వ ఉద్యోగిగా నిధుల దుర్వినియోగం) కింద ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది.

ఫరూక్ అబ్దుల్లాతో పాటు జేకేసీఏ మాజీ అధికారులు అహ్సాన్ అహ్మద్ మీర్జా, మహ్మద్ సలీం ఖాన్, బషీర్ అహ్మద్ మిస్గర్‌లను కూడా సీబీఐ నిందితులుగా చేర్చింది. కోట్లాది రూపాయల నిధులు పక్కదారి పట్టినట్టు దర్యాప్తులో తేలిందని సీబీఐ తన ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. చాలాకాలంగా కొనసాగుతున్న ఈ కేసులో, తాజా కోర్టు ఆదేశాలతో విచారణ ప్రక్రియ వేగవంతం కానుంది.

## హార్మూజ్ మీదుగా భారత్ వచ్చే నౌకల ప్రయాణంపై ఇరాన్‌తో చర్చించాం

- మొదటి పేజి తరువాయి

పరిగణ నలోకి తీసుకుంటోందని అన్నారు.ఇరాన్‌లో ప్రస్తుతం సుమారు 9 వేల మంది భారతీయులు ఉన్నారని ఆయన వెల్లడించారు. ఇందులో విద్యార్థులు, నౌక సిబ్బంది, వ్యాపారవేత్తలు, యాత్రికులు ఉన్నట్లు తెలిపారు. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం మొదలైనప్పటి నుంచి అక్కడి భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చెప్పారు. స్వదేశానికి తిరిగి రావాలనుకునే భారతీయులందరికీ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. మన రాయబార కార్యాలయం అన్ని సమయాల్లో అందుబాటులో ఉంటుందని అన్నారు.ఆఫ్ఘనిస్థాన్‌తో ఘర్షణకు భారత్ కారణమని పాకిస్థాన్ ఆరోపణలు చేయడంపై రణధీర్ జైస్వాల్ స్పందించారు. పాకిస్థాన్‌వి నిరాధార ఆరోపణలని అన్నారు. తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి భారత్‌పై నిందలు వేయడం పాకిస్థాన్‌కు అలవాటే అన్నారు. దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ పెంచి పోషిస్తోందని మండిపడ్డారు.

# వడగాలుల వల్ల ఒక్క మరణం కూడా జరగడానికి వీల్లేదు

ఈసారి వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. వడగాలుల కారణంగా రాష్ట్రంలో ఒక్క మరణం కూడా సంభవించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. అమరావతిలో రెండో రోజు కొనసాగుతున్న 6వ జిల్లాల కలెక్టర్ల సదస్సులో ఆయన వైద్యారోగ్యం, వేసవి ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఎండలో పనిచేసే ఉపాధి హామీ కూలీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెలను నిరంతరం నీటితో నింపాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలవుతున్న పశు బీమా పథకాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు.

వైద్యారోగ్య రంగంపైనా సీఎం పలు కీలక సూచనలు చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో వైద్య పరీక్షలు చేసే వ్యవస్థలను అందుబాటులోకి తేవడాన్ని అభినందించారు. తక్కువ ఖర్చుతో, సులభంగా తరలించగలిగే వైద్య పరికరాలను తయారు చేయాలని సూచించారు.

మారుమూల ప్రాంతాలకు సైతం 108 అంబులెన్సులు వేగంగా చేరుకునేలా రూట్ ఆప్టిమైజేషన్ చేయాలని ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ హబ్ (ఆర్టీఐహెచ్) ద్వారా మరిన్ని ఆవిష్కరణలు చేసి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణకు ఓ పథకాన్ని పరిశీలించండి

## ప్రభుత్వానికి సూచించిన హైకోర్టు



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంట్రాక్ట్, తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసే ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణకు ఓ పథకాన్ని తీసుకొచ్చే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. అంతేగాకుండా ఇలాంటి ఉద్యోగుల అభ్యర్థనలను పరిశీలించడానికి ఆయా శాఖల్లో కమిటీని ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించేలా సంబంధిత యంత్రాంగంతో చర్చించాలంటూ అడ్వొకేట్ జనరల్‌కు సూచించింది. కాంట్రాక్ట్ సర్వీసులో ఉన్న ఉద్యోగిని తొలగిస్తూ జేఎన్‌టీయూ

-4 లో

పెన్ పవర్

తెలంగాణ రౌండప్



గ్రామస్తులతో యువత ఆధ్వర్యంలో కార్తీక్ పుట్టిన రోజు వేడుకలు..

# ఘనంగా ఉప సర్పంచ్... కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలు..!





ఉప సర్పంచ్ కార్తీక్ రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న తుడుము స్వామి..

క్లాస్‌మేట్స్-గ్రామంలోని యువత- కాంగ్రెస్ నేత, కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు..



కార్తీక్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు చెపుతున్న క్లాస్‌మేట్స్..

**కామారెడ్డి, పెన్ పవర్, మార్చి 12:** కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం బస్వాపూర్ గ్రామంలో ఉప సర్పంచ్ కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల బస్వాపూర్ గ్రామ పంచాయతీకి ఉప సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత వచ్చిన మొదటి పుట్టిన రోజు కావడంతో గ్రామస్తులు, స్నేహితులు ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించారు.. ఈ సందర్భంగా బస్వాపూర్ సర్పంచ్ తుడుము పద్మ స్వామి ఉప సర్పంచ్ కార్తీక్ రెడ్డికి ఆర్థిక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు తుడుము స్వామి కార్తీక్ రెడ్డికి పూలమాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.. అలాగే కార్తీక్ రెడ్డి క్లాస్‌మేట్స్ బండారు భాస్కర్, దయాకర్, శ్రవణ్, రమేష్, రాజేష్, నగేష్, బ్రిజేష్, శ్రీనాథ్ తదితర మిత్రబృందంతో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.. అనంతరం బస్వాపూర్ యూత్ ఆధ్వర్యంలో కూడా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు..

ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ ఉప సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత వచ్చిన తన మొదటి పుట్టిన రోజును ఇంత ఘనంగా నిర్వహించిన స్నేహితులు, గ్రామ యువతకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు..

పెళ్లి బృందం వాహనం బోల్తాపడి ఇద్దరు మృతి..

# నిర్మల్ జిల్లాలో ఘోరం

- కొండాపూర్ బైపాస్ వద్ద పేలిన వాహనం టైర్
- తెల్లవారుజామున ప్రమాదం
- పెళ్లి బృందంలోని మరో 15 మందికి గాయాలు

-4 లో





భారాస ముక్కలైంది.. రాష్ట్రంలో

# భాజపాకు చోటు లేదు

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే శాసనసభ ఎన్నికల్లో వంద సీట్లు సాధించి తెలంగాణలో మరోసారి అధికారంలోకి వస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. భారాస నాలుగు ముక్కలైందని, రాష్ట్రంలో భాజపాకు చోటు లేదని వ్యాఖ్యానించారు.

-4 లో



శైలజా కిరణ్ చేతులమీదుగా ప్రశంసాపత్రం, అవార్డు అందుకున్న మనస్విత చికిలే..



# బేగంపేట్ మహిళా డిగ్రీ కళాశాలలో..!
# 55వ వార్షికోత్సవ వేడుకలు..!

- టాపర్లకు శైలజ కిరణ్ చేతుల మీదుగా బహుమతులు..
- 2024--25 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం..
- ముఖ్య అతిథిగా మార్గదర్శి, కళాంజలి గ్రూప్ ఎండీ శైలజ కిరణ్ పాల్గొన్నారు..
- గాజులరామారం విద్యార్థిని మనస్విత చికిలేకు ప్రత్యేక పురస్కారం..



**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 12:**
హైదరాబాద్ బేగంపేట్ ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాల 55వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా 2024--25 అకాడమిక్ సంవత్సరంలో ప్రతీ గ్రూప్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సత్కరించి, ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శైలజా కిరణ్ విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ వారికి బహుమతులు ప్రదానం చేశారు.. ఈ సందర్భంగా గాజులరామారం, శ్రీరామ్ నగర్‌కు చెందిన విద్యార్థిని మనస్విత చికిలే ప్రత్యేకంగా నిలిచింది.. బి.ఏ. పొలిటికల్ సైన్స్ (హానర్స్) కోర్సులో మూడు సంవత్సరాల పాటు ప్రథమ స్థానం సాధించడంతో పాటు ఇండియన్ గవర్నమెంట్ అండ్ పాలసీ సబ్జెక్టులో కూడా ప్రథమ స్థానం పొందింది. ఆమె ప్రతిభను గుర్తించిన ముఖ్య అతిథి శైలజ కిరణ్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంది.. విద్యార్థులు విద్యతో పాటు సమాజ సేవా భావంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా ముఖ్య అతిథి శైలజా కిరణ్ సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి చేతులమీదుగా ‘అల్లు సినిమాస్’ ప్రారంభం

- ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అల్లు రామలింగయ్య విగ్రహానికి నివాళులర్పించిన సీఎం
- అల్లు అరవింద్, అల్లు అర్జున్‌లతో కలిసి మల్టీప్లెక్స్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి
- ఈ నెల 19 నుంచి సినిమాల ప్రదర్శన



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అల్లు కుటుంబానికి చెందిన మల్టీప్లెక్స్ ‘అల్లు సినిమాస్’ను ప్రారంభించారు. దీనిని కోకాపేటలో ముఖ్యమంత్రి ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన దివంగత నటుడు అల్లు రామలింగయ్య విగ్రహానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం అల్లు అరవింద్, అల్లు అర్జున్ తదితరులతో కలిసి మల్టీప్లెక్స్‌ను పరిశీలించారు. అల్లు సినిమాస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధించిన కొన్ని విజువల్స్‌ను ప్రదర్శించారు. రేవంత్ రెడ్డికి ఒకవైపు అల్లు అర్జున్, మరోవైపు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కూర్చున్నారు. భట్టివిక్రమార్క పక్కన అల్లు అరవింద్ కూర్చుని ఈ విజువల్స్‌ను వీక్షించారు. ఈ విజువల్స్ ప్రదర్శిస్తుండగా అల్లు అరవింద్ ఏదో చెప్పగా ముఖ్యమంత్రి సరదాగా నవ్వేశారు. ఆసియాలోనే అతిపెద్ద డాల్బీ స్క్రీన్ కలిగిన మల్టీప్లెక్స్‌గా అల్లు సినిమాస్ రూపొందింది. ఈరోజు లాంఛనంగా

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
‘ ఐదు రోజులకు ’
‘4 సెం.మీ 4 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణకు ఓ పథకాన్ని పరిశీలించండి

-3 పేజి తరువాయి

జారీ చేసిన మెమోను సవాలు చేస్తూ ఎ.నరసింహ అనే ఉద్యోగి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి జీవో 212 ప్రకారం పిటిషనర్ సర్వీసును క్రమబద్ధీకరించాలని ఆదేశిస్తూ యూనివర్సిటీ మెమోను కొట్టివేశారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ జేఎన్‌టీయూ దాఖలు చేసిన అప్పీలుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. 'సుప్రీంకోర్టు 2006లో ఉమాదేవి కేసులో ఇచ్చిన తీర్పు ప్రకారం 10 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగుల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలి. ఝార్ఖండ్, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఇప్పటికే ఓ పథకాన్ని రూపొందించారు. ఉమ్మడి ఏపీలో, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో మాత్రం తీసుకురాలేదు. 1994లో జారీ చేసిన జీవో 212 మినహా మరో పథకం లేదు. ఉమాదేవి కేసు తరువాత కూడా సుప్రీంకోర్టు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. తాత్కాలిక, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌ల్లో పనులు చేయించుకునే విధానాన్ని దాదాపు అన్ని ప్రభుత్వాలు కొనసాగిస్తాయి. అయితే దశాబ్దాలుగా సర్వీసు చేయించుకునేవారి క్రమబద్ధీకరణకు ఓ పథకం అవసరం. తెలంగాణ ఏర్పాటు నుంచి నిర్దిష్ట కాలపరిమితి పెట్టుకుని ఈ పథకాన్ని రూపొందించాలి. ఇందులో భాగంగా ఆయా శాఖల్లో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తే పథకం పరిధిలోకి వస్తున్నారో లేదో పరిశీలించి నిర్ణయం తీసుకోవడానికి వీలుంటుంది. తద్వారా వీరంతా నేరుగా కోర్టును

ఆశ్రయించే అవసరం ఉండదు. ఓ కటాఫ్ తేదీని నిర్దేశించి ఆపైన పనిచేసినవారిని క్రమబద్ధీకరించడం లేదంటే వారిని సర్వీసును తొలగించడం వంటి నిర్ణయం తీసుకోవచ్చు. దీనిపై సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం చెప్పాలి' అని ఏజీ సుదర్శన్‌రెడ్డికి సూచిస్తూ విచారణను ధర్మాసనం ఏప్రిల్ 14కు వాయిదా వేసింది. ప్రస్తుత కేసులో అప్పటివరకు పిటిషనర్ సర్వీసును క్రమబద్ధీకరించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## పెళ్లి బృందం వాహనం బోల్తాపడి ఇద్దరు మృతి..

# నిర్మల్ జిల్లాలో ఘోరం

**హైదరాబాద్ పెన్ పవర్:** నిర్మల్ జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జిల్లాలోని రూరల్ మండలం కొండాపూర్ బైపాస్ వద్ద పెళ్లి బృందంతో వెళుతున్న వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో వాహనంలో మొత్తం 17 మంది ఉన్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ జిల్లా ఇచ్చోడ మండలం సోన్‌పల్లి గ్రామానికి చెందిన ఒక కుటుంబం బంధువులతో కలిసి నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరగనున్న వివాహ వేడుకకు హాజరయ్యేందుకు డీసీఎంలో బయలుదేరారు. వాహనం కొండాపూర్ బైపాస్ సమీపానికి చేరుకోగానే టైరు పేలిపోవడంతో స్టీరింగ్ పై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీనితో వాహనం రోడ్డుపై పల్టీలు కొట్టి పక్కకు పడిపోయింది.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న

పోలీసులు క్షతగాత్రులను వెంటనే నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

## భారాస ముక్కలైంది.. రాష్ట్రంలో భాజపాకు చోటు లేదు

-3 పేజి తరువాయి

గురువారం గాంధీభవన్‌లో పీసీసీ ఎస్సీ విభాగం ఛైర్మన్‌గా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్.. ఎమ్మెల్యేలు వేముల వీరేశం, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీకాంతరావు, మందుల సామేల్, మేడిపల్లి సత్యం, నాగరాజు, జి.వినోద్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతం, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మోత్కుపల్లి నర్సింహులు, జేబీ రాజు తదితరులతో కలిసి పాల్గొన్నారు.'దళితవాదంతో హస్తం పార్టీ పురుడు పోసుకుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్. వారికి సముచిత స్థానం కల్పిస్తాం. ఎస్సీ విభాగాన్ని బలోపేతం చేయాలని కవ్వంపల్లికి సూచిస్తున్నా' అని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మంత్రులు వివేక్, పొన్నం, అడ్లూరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని, కవ్వంపల్లి ఎస్సీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. బాధ్యతలు చేపట్టిన కవ్వంపల్లి మాట్లాడుతూ.. 59 కులాలకు చెందిన ఎస్సీలను ఏకతాటిపైకి తీసుకురాగలననే సీఎం రేవంత్‌రెడ్డి ఈ పదవి అప్పగించారన్నారు. అంతకుముందు ఆయన అంబేడ్కర్ విగ్రహానికి, గన్‌పార్కులో అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి కార్యకర్తలతో ర్యాలీగా గాంధీభవన్‌కు చేరుకున్నారు.

## రేవంత్ రెడ్డి చేతులమీదుగా 'అల్లు సినిమాస్' ప్రారంభం

-3 పేజి తరువాయి

ప్రారంభమైన ఈ మల్టీప్లెక్స్‌లో ఉగాది సందర్భంగా ఈ నెల 19 నుంచి సినిమాలు ప్రదర్శించనున్నారని తెలుస్తోంది.ఇందులో నాలుగు స్క్రీన్‌లు ఉండగా, స్క్రీన్ 1లో డాల్బీ విజన్ ఉంది. రేపటి నుంచి బుక్ మై షో ద్వారా ఆన్ లైన్ బుకింగ్స్ ఓపెన్ చేయనున్నట్లు అల్లు సినిమాస్ తెలిపింది. తొలుత ధురంధర్-2, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలు సందడి చేయనున్నాయి.

## నిజాం వారసుల ఆస్తులు 10వేల కోట్లు..

**హైదరాబాద్, మార్చి 12 పెన్ పవర్:** హైదరాబాద్‌ను ఏలిన ఆఖరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ వారసుల మధ్య దశాబ్దాలుగా సాగుతున్న ఆస్తుల యుద్ధం ఇప్పుడు ఒక కీలక మలుపు తిరిగింది. సుమారు 400 మందికి పైగా ఉన్న నిజాం వారసుల మధ్య గతంలో తీవ్రమైన విభేదాలు, కోర్టు కేసులు ఉన్నప్పటికీ, ఇటీవలి కాలంలో వారంతా ఒక ఉమ్మడి అవగాహనకు వచ్చారు. కోర్టు వారికి రూ. పది వేలకోట్ల ఆస్తులపై హక్కులు ఇచ్చింది. ఇప్పుడు వీరంతా ఈ ఆస్తుల్ని పంచుకోనున్నారు.నిజాం మరణం తర్వాత ఆయన అపారమైన సంపదపై హక్కుల కోసం వారసుల మధ్య సుదీర్ఘ పోరాటం సాగింది. అయితే, కాలక్రమేణా న్యాయపోరాటాల వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని గుర్తించిన వారసులు, ఒకే తాటిపైకి వచ్చి చర్చలు జరుపుతున్నారు. తమ వాటాల ప్రకారం ఆస్తిలో భాగం లేదా తగిన పరిహారం తీసుకునేలా ఒక ఫార్ములాను వారు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఫలక్‌నుమా, చౌమహల్లా వంటి రాజభవనాలు ఈ ఆస్తుల జాబితాలో ఉన్నాయి.నిజాం ఆస్తులు ఆయన వ్యక్తిగతం కావని కోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే కోర్టు నిజాం కుటుంబానికే చెందుతాయని స్పష్టం చేయడంతో, ఆస్తుల అమ్మకం, అభివృద్ధిపై ఉన్న చట్టపరమైన అడ్డంకులు తొలగిపోయాయి. ఈ తీర్పు ఆధారంగా వారసులందరికీ వారి వాటాలను పక్కాగా లెక్కగట్టే అవకాశం ఏర్పడింది. ముఖ్యంగా నిజాం ట్రస్టుల పరిధిలో ఉన్న భూములు, భవనాలను విక్రయించి వచ్చే ఆదాయాన్ని అందరికీ సమానంగా పంచే ప్రక్రియ ఇప్పుడు ఊపందుకోనుందిహైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఖరీదైన భూములు, చారిత్రక భవనాల విలువ నేడు వేల కోట్లకు చేరుకుంది. కేవలం ప్యాలెస్‌లు మాత్రమే కాకుండా, వివిధ ప్రాంతాల్లో ఉన్న నిజాం ఆస్తుల విక్రయం ద్వారా వచ్చే నిధులను 400 మందికి పైగా ఉన్న వారసులకు పంపిణీ చేయడం ఒక పెద్ద టాస్క్. అయితే, వారసులందరూ ఏకాభిప్రాయానికి రావడంతో, ఈ పంపిణీ ప్రక్రియలో గందరగోళం తగ్గే అవకాశం ఉంది. నిజాం వారసుల మధ్య కుదిరిన ఈ అవగాహన కేవలం ఆస్తుల పంపిణీకే పరిమితం కాకుండా, నిజాం వారసత్వాన్ని కాపాడటంపై కూడా దృష్టి సారిస్తోంది. చౌమహల్లా వంటి ప్యాలెస్‌లను పర్యాటక కేంద్రాలుగా కొనసాగిస్తూనే, ఇతర వాణిజ్య ఆస్తుల ద్వారా లబ్ధి పొందాలని వారు భావిస్తున్నారు.

## రుణమాఫీతోనే తెలంగాణలోనే అప్పుల తక్కువ

**హైదరాబాద్, మార్చి 12, పెన్ పవర్:** ఏపీ, తమిళనాడు, కర్ణాటకలతో పోలిస్తే తెలంగాణ రైతులకు తక్కువగా అప్పులు ఉన్నాయని కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించింది. 2025 డిసెంబరు నాటికి తెలంగాణ రైతుల అప్పు రూ.1.75 లక్షల కోట్లుగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన రూ.2 లక్షల రుణమాఫీ వల్లే ఈ లబ్ధి చేకూరిందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. మరోవైపు, బహిరంగ మార్కెట్ రుణాల సేకరణలో తెలంగాణ రూ.69,300 కోట్లతో దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది.ఏపీ, తమిళనాడు, కర్ణాటకలతో పోలిస్తే.. తెలంగాణలో రైతులకు రుణభారం తక్కువగా ఉందట. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి పార్లమెంట్‌లో వెల్లడించారు. వివిధ రాష్ట్రాల్లో రైతులకు ఉన్న అప్పుల మొత్తంపై తమిళనాడు ఎంపీ ఎ.రాజా లోక్‌సభలో ప్రశ్న అడిగారు. ఆ ప్రశ్నకు ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి మంగళవారం (మార్చి 10) లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2025 డిసెంబరు 31 నాటికి తమిళనాడు అన్నదాతలపై రూ.5,06,290.45 కోట్లు, ఏపీ రైతులపై రూ.3,75,254.59 కోట్లు, కర్ణాటక రైతులపై రూ.2,10,244.47కోట్ల అప్పుల భారం ఉందని వెల్లడించారు. ఇదే సమయంలో తెలంగాణ అన్నదాతలపై మాత్రం రూ.1,75,960.56 కోట్ల అప్పు మాత్రమే ఉందని స్పష్టం చేశారు.ఇక బహిరంగ మార్కెట్ నుంచి రుణాల సేకరణలో తెలంగాణ ప్రభుత్వం మూడో స్థానంలో నిలిచిందని కేంద్రం స్పష్టం చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి మూడు త్రైమాసికాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.69,300 కోట్ల అప్పు చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి వెల్లడించారు. రాష్ట్రాల రుణాలపై మంగళవారం రాజ్యసభలో వైసీపీ సభ్యుడు గొల్ల బాబురావు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. మహారాష్ట్ర రూ.99 వేల కోట్లు, తమిళనాడు రూ.95 వేల కోట్లు తర్వాత మార్కెట్ నుంచి అత్యధిక మొత్తం రుణాలు సేకరించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని అన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో రాజస్థాన్ రూ.60 వేల కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూ.56 వేల కోట్లు రుణాలు సేకరించినట్లు తెలిపారు.తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో పలు విడతల్లో రుణామాఫీ చేసింది. దాదాపు 25 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరేలా రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేశారు. అందుకు రూ.21 వేల కోట్లకుపైగా నిధులు విడుదల చేశారు. ఈ కారణంతోనే దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రైతులకు తక్కువ అప్పులున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని అంటున్నారు. అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెబుతున్నారు.

# 373 గ్రామాల్లో రీ-సర్వే

**ఖమ్మం, మార్చి 12, పెన్ పవర్:** మ్యాప్ లేని 373 గ్రామాలు గుర్తించామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు త్వరలోనే ఆయా గ్రామాల్లో రీ-సర్వే చేపట్టబోతున్నామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నట్లు చెప్పారు. అందుకు ప్రత్యేక పోర్టల్‌ను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఉపాధి-శిక్షణ, పంచాయతీరాజ్, పర్యాటక, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖలు పంపిన బడ్జెట్ ప్రతిపాదనలపై మంగళవారం (మార్చి 10) సెక్రటేరియట్‌లో ఆర్థిక మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టితో భేటీ అయిన పొంగులేటి భూముల రీ-సర్వే కోసం అత్యాధునిక రోవర్ల కొనుగోలుకు 2026-27 బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. భూముల సర్వేకు ప్రస్తుతం మండలానికొకటి చొప్పున 460 రోవర్లను కొనుగోలు చేశామని చెప్పారు. మరో 400 రోవర్ల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు.ఇక తెలంగాణలోని అన్ని గ్రామ పంచాయతీలకు రానున్న మూడేళ్లలో శాశ్వత భవనాలు నిర్మించేందుకు సర్కార్ సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క వెల్లడించారు. పంచాయతీరాజ్‌శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తే.. నిధులు కేటాయిస్తామన్నారు. స్థలాలు అందుబాటులో ఉన్నచోట ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాలను కలిపి నిర్మించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని దాంతో పాటుగా నాణ్యమైన బోధనా పద్ధతులతో చిన్నారులకు విద్యను అందించాలన్నారు. పట్టణాల్లో రహదారులపైన కొంతమంది చంటి బిడ్డలను పెట్టుకొని యాచక వృత్తి కొనసాగిస్తున్నారని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క గుర్తు చేశారు. అటువంటి చిన్నారులను శిశు విహార్‌కు పంపి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. శిశు విహార్‌లో ఆధునిక కిచెన్లు నిర్మించాలన్నారు.దీంతో పాటుగా.. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ఉపాధి కల్పించే కోర్సులను నిర్వహించాలని ఉపాధి శిక్షణ శాఖను డిప్యూటీ సీఎం భట్టి ఆదేశించారు. కోర్సుల విషయంలో గ్లోబల్ సమ్మిట్‌లో ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలను సంప్రదించాలన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ పాలసీకి అనుగుణంగా రాష్ట్రానికి రానున్న పరిశ్రమలనూ దృష్టిలో పెట్టుకుని కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలన్నారు. ఈ సెంటర్లను స్కిల్స్ యూనివర్సిటీతో అనుసంధానం చేసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ భేటీలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, గడ్డం వివేక్, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మెన్ కౌన్సిలర్ ల శిక్షణ ప్రారంభించిన కలెక్టర్

**ఎల్లారెడ్డి, మార్చి 12 పెన్ పవర్:** కామారెడ్డిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రారంభమైంది. 12 జూన్ 2026 వరకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సర్పంచ్ లు, మున్సిపల్ చైర్మెన్ లు, కౌన్సిలర్లకు అవగాహన కల్పిస్తున్నారు. గురువారం కళాభారతిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజేష్ చంద్ర, ఏఎస్పీ చైతన్య రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కాలభైరవ స్వామి ఆలయంలో భైరవ హోమం

**జుక్కల్, మార్చి 12 పెన్ పవర్:** రామారెడ్డి మండల కేంద్రంలోని శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో బహుళ అష్టమి సందర్భంగా గురువారం భైరవ హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ జంటలతో ఈ హోమ కార్యక్రమం చేయించారు. బహుళ అష్టమి రోజున భైరవ హోమం చేస్తే కోరికలు నెరవేరుతాయని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు.

## కొనసాగుతున్న నిజాంసాగర్ ప్రాజెక్టు సాగునీటీ విడుదల

**బాన్సువాడ, మార్చి 12 పెన్ పవర్:** కామారెడ్డి - నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల నిజాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీటి విడుదల కొనసాగుతోంది. గురువారం ప్రాజెక్టు ఏఈ సాకేత్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ప్రధాన కాల్వ ద్వారా 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు కాగా, ప్రస్తుతం 1400.66 అడుగుల నీరు నిల్వ ఉంది. ఇది 17.802 టీఎంసీలకు సమానం. విడుదలయ్యే 2000 క్యూసెక్కుల నీరు వృధా కాదని, రైతులతో పాటు దిగువన ఉన్న రెండు జిల్లాల ప్రజలకు తాగునీటి సరఫరా కూడా అవుతుందని తెలిపారు.

## ఇంటర్ పరీక్షకు వెళ్తూ ఇద్దరు విద్యార్థుల మృతి

**రాజేంద్రనగర్, మార్చి 12 పెన్ పవర్:** షాద్ నగర్ నియోజకవర్గం కొత్తూరు మండల కేంద్రానికి చెందిన ఇద్దరు విద్యార్థులు శంషాబాద్ లోని ప్రైవేట్ కాలేజీలో పరీక్ష రాయడానికి బైక్ పై వెళ్తుండగా, పెద్ద షాపూర్ వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టమ్ కోసం ఆస్పత్రికి తరలించారు.

## భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య

**సికింద్రాబాద్, మార్చి 12 పెన్ పవర్:** నేరేడ్మెట్ లక్ష్మీనగర్లో నివసించే ప్రైవేట్ ఉద్యోగి నగెల్లి శ్రీనివాస్(41) మంగళవారం రాత్రి భార్య వేధింపులు, కేసులతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య సట్లపల్లి జ్యోతి ఎక్సైజ్ సీఐగా ఉద్యోగం సాధించిన తర్వాత భర్తను దూరం పెడుతూ, వరకట్న వేధింపులు, విడాకుల కేసు పెట్టిందని శ్రీనివాస్ రాసిన సూసైడ్ నోటులో పేర్కొన్నాడు. సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు శ్రీనివాస్ భార్య జ్యోతితో పాటు మరో 10మందిపై కేసు నమోదు చేశారు.

## తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రులకు అప్పగింత




**కుత్బుల్లాపూర్, మార్చి 12 పెన్ పవర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ విలేజ్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ కనిపించిన రెండేళ్ల చిన్నారి రితీక్షను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పెట్రోలింగ్ పోలీసులు చిన్నారిని తమ సంరక్షణలోకి తీసుకుని, ఆమె ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. సోషల్ మీడియా సహాయంతో చిన్నారి తల్లిదండ్రులు శ్రీహరి, ఆమెను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ధృవీకరణ అనంతరం చిన్నారిని వారికి అప్పగించారు. చిన్నారి కుత్బుల్లాపూర్‌లోని బోలా షనేర్ నగర్, పాత శివాలయం సమీపంలో నివసిస్తున్నారు.

## ఘనంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

**కూకట్‌పల్లి, మార్చి 12 పెన్ పవర్:** కూకట్‌పల్లి బాలాజీ నగర్‌లో గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి ఘనంగా జరిగాయి. యర్రగొండపాలెం శాసనసభ్యులు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రకాశం జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షులు దొండేటి నాగేశ్వర రెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షులు దుద్యాల రామకృష్ణారెడ్డి, ఐదు మండలాల ఐటీ వింగ్ అధ్యక్షులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మాజీ జెడ్పిటిసి మోహన్ రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న అలీ షబ్బీర్



**కామారెడ్డి, మార్చి 12 పెన్ పవర్:** కామారెడ్డిలో రోడ్డు ప్రమాదంలో మరణించిన మాజీ జెడ్పిటిసి ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి అంతిమయాత్రలో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ గురువారం పాల్గొని, ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. షబ్బీర్ అలీ, మోహన్ రెడ్డి ముఖ్య అనుచరుడిగా ఆయన పడే మోశారు.?

# ఇంటర్నెట్ పై ట్యాక్స్...

**హైదరాబాద్, మార్చి 12, పెన్ పవర్:** స్మార్ట్‌ఫోన్ యూజర్లు, ఇంటర్నెట్ ప్రియులకు కేంద్ర ప్రభుత్వం పెద్ద షాక్ ఇచ్చేందుకు రెడీ అవుతోంది. ఇంటర్నెట్ డేటా వాడకంపై కొత్తగా ట్యాక్స్ వేసే ఆలోచనలో కేంద్ర సర్కార్ ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. జనవరి నెలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన టెలికాం రివ్యూ మీటింగ్‌లో ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు ప్రజల్లో స్క్రీన్ అడిక్షన్‌ను తగ్గించడానికి ఈ దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.ఒక అంచనా ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో 229 బిలియన్ జీబీల డేటాను జనాలు వాడేశారు. ఈ లెక్కన ప్రతి జీబీ వాడకంపై ఒక్క రూపాయి చొప్పున ట్యాక్స్ వేసినా.. ఏటా ప్రభుత్వ ఖజానాకు దాదాపు 22 వేల 900 కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. ప్రస్తుతం టెలికాం సేవలపై 18 శాతం +టా కడుతున్నాం.

ఈ కొత్త ట్యాక్స్ వస్తే అది సామాన్యుల జేబులకు అదనపు భారం కానుంది. ఒక నిర్దిష్ట డేటా లిమిట్ దాటిన తర్వాతే ఈ ట్యాక్స్ పడుతుందనే ప్రచారం జరుగుతున్నా..అలాంటి స్లాబ్ సిస్టమ్‌పై ఇంకా ఎలాంటి క్లారిటీ లేదు. అసలు ఈ ట్యాక్స్ అమలు ఎంతవరకు సాధ్యం అన్నదానిపై సాధ్యాసాధ్యాలను స్టడీ చేయాలని టెలికాం డిపార్ట్‌మెంట్‌ను కేంద్రం ఆదేశించింది. ఈ ట్యాక్స్ వసూలు విధానంపై సెప్టెంబర్ 2026 నాటికి టెలికాం శాఖ..ప్రభుత్వానికి పూర్తి స్థాయి రిపోర్ట్ ఇవ్వనుంది.




02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వనపర్తి ఆర్టీసీ డిపోకు 4 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయింపు

**నాగర్‌కర్నూల్, మార్చి 12 పెన్ పవర్:** పర్యావరణ పరిరక్షణ లక్ష్యంతో, వనపర్తి ఆర్టీసీ డిపోకు ప్రభుత్వం 4 ఎలక్ట్రిక్ బస్సులతో పాటు 3 కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను కేటాయించింది. డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం, ప్రస్తుతం డిపోలో మొత్తం 112 బస్సులు అందుబాటులో ఉన్నాయి. కాలుష్య నియంత్రణలో ఎలక్ట్రిక్ బస్సులు కీలక పాత్ర పోషిస్తాయని, ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## రోడ్డు ప్రమాదం... యువకుడు స్పాట్ డెడ్

**నారాయణపేట, మార్చి 12 పెన్ పవర్:** మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గం రాజాపూర్ మండల పరిధిలోని చెన్నవెల్లికి చెందిన చిలివేరి నరేశ్ (25) గురువారం ఉదయం రాజాపూర్ నుంచి షాద్ నగర్ వైపు బైక్‌పై వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. షాద్ నగర్ సమీపంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న నరేశ్ మృతితో చెన్నవెల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య కార్యక్రమం

**తుంగతుర్తి, మార్చి 12 పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ భూక్యా నగేష్ నాయక్, సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్ మాట్లాడుతూ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చని తెలిపారు.

## ఉక్కా అమ్మకాలపై పోలీసుల దాడులు

**సూర్యాపేట, మార్చి 12 పెన్ పవర్:** సూర్యాపేట పట్టణంలో ప్రజల ఆరోగ్యానికి హానికరమైన ఉక్కా అమ్మకాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. మెయిన్ రోడ్డులోని ఆర్. వి ఫ్యాషన్స్, ఎక్స్ట్రీమ్ ఫ్యాషన్స్ వస్త్ర దుకాణాల్లో తనిఖీలు చేసి, రూ. 15 వేల విలువైన ఉక్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఇలాంటి అమ్మకాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## సూర్యాపేటలో రోడ్డు మధ్యలో ఆగిపోయిన బస్సు

**కోదాడ, మార్చి 12 పెన్ పవర్:** సూర్యాపేట బస్టాండ్ వద్ద ఉదయం 8:00 గంటలకు ఎలక్ట్రిక్ బస్సు రోడ్డు మధ్యలో ఆగిపోవడంతో, ఉదయం డ్యూటీలకు వెళ్తున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్టాండ్ లోపలికి వెళ్లే మార్గంలో బస్సు ఆగిపోవడం వల్ల ఏర్పడిన అంతరాయాన్ని తొలగించి, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

## బార్ అసోసియేషన్ ఎన్నికల సందడి




**భువనగిరి, మార్చి 12 పెన్ పవర్:** జిల్లాలోని కోర్టుల బార్ అసోసియేషన్ ఎన్నికలకు తెలంగాణ బార్ కౌన్సిల్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ ఎన్నికల నుంచి బార్ అసోసియేషన్‌లో 30శాతం మహిళా న్యాయవాదులకు రిజర్వేషన్ అమలులోకి రానుంది. భువనగిరి కోర్టు ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి జిల్లా భాస్కర్‌రెడ్డి విడుదల చేశారు. మహిళలకు 30శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన భువనగిరి బార్ అసోసియేషన్‌లో మహిళా న్యాయవాదులకు ఉపాధ్యక్షురాలు, కోశాధికారి, సాంస్కృతిక కార్యదర్శి, మహిళా ప్రతినిధి, ఒక కార్యవర్గ సభ్యురాలి పదవిని కేటాయిస్తూ తీర్మానం చేశారు. ఈ నెల 11 నుంచి 13 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు, 16న పరిశీలన, 17న ఉపసంహరణ, 18న తుది జాబితా విడుదల చేస్తారు. 26న పోలింగ్, అదేరోజు ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుంది. ఏప్రిల్ 1న నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేస్తుంది.

## చెట్ల నరికివేతపై సర్పంచ్‌పై విచారణ

**ఆలేరు, మార్చి 12 పెన్ పవర్:** ఆలేరు నియోజకవర్గంలోని దత్తాయపల్లిలో, పెద్ద బావి చెరువు శిఖంలో కట్టెనమ్ముకున్నారని సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ పై ప్రజావాణిలో ఫిర్యాదు రావడంతో గురువారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్ నాయక్ బృందం విచారణ చేపట్టింది. కట్టెనుకోత మిషన్ తో తుమ్మ చెట్లను కోసి అమ్ముకున్నట్లు అధికారులు నిర్ధారించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విచారణలో ఫిర్యాదుదారుడు ధ్యాన సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి కొండం రఘురాములు, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ధ్యానబోయిన మల్లేశం, సొసైటీ అధ్యక్షులు వెంకటేశం, గాదె మల్లేశం, ధ్యానబోయిన రమేష్ పాల్గొన్నారు.

# స్పీకర్ నిర్ణయం పై గుర్రు.. గుర్రు...

**హైదరాబాద్, మార్చి 12 పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో నైతిక విలువలు ఇప్పుడు ఒక 'జోక్'గా మారిపోయాయి. ప్రజాస్వామ్యంలో ఓటరు తీర్పును గౌరవించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ ప్రలోభాలకో , వ్యక్తిగత ప్రయోజనాలకో తలొగ్గి పార్టీలు మారడం పరిపాటిగా మారింది. అయితే, ఈ ఫిరాయింపుల కంటే దారుణమైన విషయం ఏమిటంటే.. తాము పార్టీ మారలేదని, ఇంకా పాత పార్టీలోనే ఉన్నామని ఆయా నాయకులు బుకాయించడం. ప్రజల కళ్లకు స్పష్టంగా కనిపిస్తున్న వాస్తవాలను కప్పిపుచ్చుతూ ఆడుతున్న ఈ దేవతా వస్త్రాల నాటకం రాజకీయ పతనానికి పరాకాష్టగా నిలుస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. పదిమంది ఎమ్మెల్యేలు కండువా మార్చి కాంగ్రెస్‌లో చేరిన విషయం రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలుసు. వారు కాంగ్రెస్ వేదికలపై కనిపించారు, ప్రభుత్వ నిర్ణయాల్లో భాగస్వాములయ్యారు. రాజకీయంగా ఆ పార్టీ విజయం కోసం పని చేశారు. కానీ, సాంకేతిక అంశాలను సాకుగా చూపిస్తూ వారెవరూ పార్టీ మారలేదని స్పీకర్ కార్యాలయం ప్రకటించడం సామాన్య ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి గెలిచి, కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్ వంటి వారు కూడా పార్టీ మారలేదని చెప్పడం ప్రజాస్వామ్య స్ఫూర్తిని పరిహసించడమేనన్న అభిప్రాయం సహజంగానే వస్తోంది. చట్టంలోని లొసుగులను వాడుకుని అనర్హత వేటు నుంచి తప్పించుకోవచ్చు కానీ, ప్రజా కోర్టులో ఎలా సమర్థించుకుంటారన్న ప్రశ్న వస్తోంది. ఈ ఫిరాయింపుల పర్వంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వ్యవహారం మరో ఆసక్తికర మలుపు. కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, స్థానిక నాయకత్వం నుంచి ఎదురైన తీవ్ర వ్యతిరేకత, పార్టీలో ఇమడలేక పోవడం వంటి కారణాలతో ఆయన మళ్లీ వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఇది కేవలం ఒక్క ఎమ్మెల్యే సమస్య మాత్రమే కాదు, ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నప్పుడు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ , ఓటర్ల మనోభావాలను అధికార పార్టీ ఎంతలా విస్మరిస్తుందో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ. అనుకోవచ్చు. జగిత్యాలలోనూ సమస్య తీవ్రంగా ఉంది. ఫిరాయింపులు ఉన్న అన్ని చోట్లా ఇదే సమస్య. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ అనర్హత వేటు చట్టం ఉద్దేశం ఫిరాయింపులను అరికట్టడం. కానీ, నేటి రాజకీయాల్లో ఆ చట్టమే

ఫిరాయింపుదారులకు రక్షణ కవచంగా మారుతోంది. మేము పార్టీ మారలేదు, కేవలం ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాం అనే సాకులు నైతికంగా పతనమైన నాయకత్వానికి నిదర్శనం. ధైర్యంగా పార్టీ మారినట్లు చెప్పుకోలేని స్థితిలో ఉన్న ఈ ప్రజాప్రతినిధులు, రేపు ఎలా ప్రజల వద్దకు వెళ్లి

ఓట్లు అడుగుతారనేది పెద్ద ప్రశ్న. తమ ఓటును వస్తువుగా మార్చి, అంగడిలో సరుకులా పార్టీలను మారుతున్న నేతలను ప్రజలు ఎల్లకాలం సహిస్తారని అనుకోవడం భ్రమ. చట్టం ముందు గెలిచినా, ప్రజల మనసుల్లో వీరు 'అనర్హులు'గానే ముద్ర పడిపోతున్నారు. గతంలో ఫిరాయింపులను ప్రోత్సహించిన పార్టీలు కాలక్రమేణా భారీ మూల్యాన్ని చెల్లించుకున్న చరిత్ర మన కళ్లముందే ఉంది. ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్న ఈ విలువల లేని రాజకీయం భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉంది.

# కోర్టులపైనే గులాబీ ఆశలు

**హైదరాబాద్, మార్చి 12, పెన్ పవర్:** ఎట్టకేలకు..ఊహించని ట్విస్ట్ ఇచ్చారు స్పీకర్ గడ్డం ప్రసాద్. ఫిరాయింపు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి కూడా క్లీన్ చిట్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. పది మంది ఎమ్మెల్యేల ఎపిసోడ్‌లో మొదటి నుంచి దానం నాగేందర్, కడియం శ్రీహరి కేసులు మాత్రం సమ్‌థింగ్ స్పెషల్ అనే టాక్ ఉండేది. ఎందుకంటే దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లడమే కాదు..కాంగ్రెస్ బీఫామ్ మీద లోక్‌సభ ఎంపీగా కంటెస్ట్ చేశారు.ఇక తన కూతురు కడియం కావ్య కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా దాఖలు చేసిన నామినేషన్ పత్రంపై కడియం శ్రీహరి సంతకం చేసినట్లు అలిగేషన్స్ ఉన్నాయి. పైగా తన కూతురు గెలుపు కోసం కడియం ప్రచారం చేసినట్లు కూడా బీఆర్ఎస్ వీడియో ప్రూఫ్‌లు సబ్మిట్ చేసింది. ఈ కీలక ఆధారాలు ఉన్నాయని భావించి..ఈ ఇద్దరిపై స్పీకర్ వేటు వేస్తారని బలమైన ఒపీనియన్ కొనసాగింది. కడియంను సేవ్ చేసినా దానం నాగేందర్‌పై మాత్రం వేటు వేయడమో? రాజీనామానో? పక్కా అన్న టాక్ నడిచింది. ఇదేది జరగలేదు. ఎవరూ ఊహించనట్లు..కాంగ్రెస్ పెద్దలు కోరుకున్నట్లుగా స్పీకర్ తీర్పు ఇచ్చారని బీఆర్ఎస్ లీడర్లు మండిపడుతున్నారుపలుసార్లు కోర్టు స్పీకర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడం..సభాపతి కూడా విచారణకు సమయం కోరడంతో..వేటు వేస్తారని బీఆర్ఎస్ కూడా బలంగా నమ్మింది. ఒకానొక టైమ్‌లో ఖైరతాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ బై ఎలక్షన్స్‌కు కారు పార్టీ రెడీ అవుతున్నట్లు కూడా ప్రచారం జరిగింది. కానీ ఫిరాయింపు ఎపిసోడ్‌లో కథ మళ్లీ మొదటికి వచ్చినట్లు అయింది. నెక్ట్ బీఆర్ఎస్ స్టెప్ ఏంటన్నదే కీలకంగా మారింది. మొత్తం పది మంది ఎమ్మెల్యేలపై వేటు కోసం మళ్లీ సుప్రీంకోర్టు మెట్లెక్కనుందా? లేక కడియం, దానం విషయంలో మాత్రమే సీరియస్‌గా ఉందా? అసలు బీఆర్ఎస్ ఆలోచన ఏంటన్నది ఆసక్తికరంగా మారిందిఅయితే




ఇప్పటికే సుప్రీంకోర్టులో తాము వేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే..స్పీకర్ క్లీన్ చిట్ ఇస్తూ నిర్ణయం తీసుకోవడంతో..గులాబీ పార్టీ సరికొత్త వ్యూహాలను తెరలేపుతోందన్న చర్చ జరుగుతోంది. మరోసారి అత్యున్నత న్యాయస్థానం మెట్లెక్కేందుకు ప్రిపేర్ అవుతోందట. కచ్చితంగా దానం, కడియం శ్రీహరిపై వేటు పడుతుందని..దానం నాగేందర్ కాంగ్రెస్ బీఫామ్ మీద పోటీ చేసినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని చెబుతున్నారు బీఆర్ఎస్ లీడర్లు. గతంలో కోర్టులు అనర్హత వేటు వేసిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. న్యాయ స్థానాల ద్వారా..స్పీకర్ నిర్ణయం తప్పని ప్రూవ్ చేస్తామన్న ధీమాలో ఉన్నారు. జ్యుడీషియల్ రివ్యూ ద్వారా జంపింగ్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడేలా పోరాడి తీరుతామంటున్నారు గులాబీ నేతలు.అయితే స్పీకర్ నిర్ణయం తీసుకునే వరకు సుప్రీంకోర్టు ప్రెజర్ పెట్టగలిగింది. ఎట్టకేలకు సభాపతి ఓ డెసిషన్ తీసుకున్నారు. కానీ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పని చెప్పే అధికారం కోర్టులకు ఉందా అన్నదే పెద్ద ప్రశ్న. లెజిస్లేటివ్ అడ్మినిస్ట్రేషన్‌లో..స్పీకర్, ఛైర్మన్ నిర్ణయమే ఫైనల్ అన్నట్లుగా ఉంటుంది. అలాంటిది ఇప్పుడు తెలంగాణ స్పీకర్ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుబడుతుందా? బీఆర్ఎస్ సబ్‌మిట్ చేసిన ప్రూఫ్స్ ఆధారంగా..వేటు వేస్తుందా? అనేది డిస్కషన్ పాయింట్‌గా మారింది.బీఆర్ఎస్ లీడర్లు మాత్రం పలు కేసుల్లో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను గుర్తు చేస్తున్నారు. కాస్త సమయం పట్టినా జంపింగ్ ఎమ్మెల్యేలపై వేటు పడటం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. స్పీకర్ డెసిషన్‌ను తప్పుబడుతూ సుప్రీంకోర్టు వేటు వేస్తే మాత్రం దేశంలోనే సెన్సేషనల్ తీర్పు అయ్యే అవకాశం ఉంది. ఫిరాయింపు ఎమ్మెల్యేల ఎపిసోడ్‌లో దేశం మొత్తానికి తెలంగాణ ఎపిసోడ్ ఓ బెంచ్ మార్క్‌గా నిలవనుంది. కానీ సుప్రీంకోర్టు ఎలా రెస్పాండ్ కాబోతుందనేదే ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది. మరి అత్యున్నత న్యాయస్థానంలో బీఆర్ఎస్‌కు ఆశించిన తీర్పు వస్తుందా? రాదా? అనేది చూడాలి.

# జీవన్ రెడ్డి దారెటు...

**కరీంనగర్, మార్చి 12, పెన్ పవర్:** అసంతృప్తి, నిరసన తెలపడం అయిపోయింది. ఫ్రస్ట్రేషన్ పీక్ లెవల్ దాటి.. నెక్ట్ లెవల్‌కు కూడా వెళ్లింది. ఇక క్లైమాక్స్‌కు వచ్చేసింది జగిత్యాల పొలిటికల్ ఎపిసోడ్. అంతా క్లియర్ కట్..ఔట్ రైట్ డెసిషన్ మాత్రమే మిగిలింది అంటున్నారట మాజీమంత్రి జీవన్‌రెడ్డి. మంత్రుల ముందే నిరసన..గాంధీభవన్‌లో జరిగిన సమీక్షలోనూ ప్రొటెస్ట్ చేసి చేయాల్సిన రచ్చ అంతా చేసేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే రాకను ముందు నుంచి వ్యతిరేకిస్తూ వస్తున్న జీవన్‌రెడ్డి..మున్సిపల్ ఎన్నికల్లో హస్తం గుర్తును పక్కనబెట్టి మరీ వేరే ఏవేవో గుర్తులకు ఓటేయాలంటూ ప్రచారం చేశారు కూడా.ప్రజా పాలనలో మనం ఎలాగూ భాగస్వాములం కాదు. ఇక ప్రజల పక్షానే ఉందాం అంటున్నారట జగిత్యాల మాజీ ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్ లీడర్ జీవన్‌రెడ్డి. ఇక ఇదే లైన్‌లో ముందుకెళ్దామంటూ తన అనుచరులకు డైరెక్షన్స్ ఇచ్చేస్తున్నారట. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన సంజయ్..కాంగ్రెస్‌లో చేరడం..అప్పటి నుంచి అన్నింటా ఆయన మాటే చెల్లుబాటు అవుతుండటంపై ఎప్పటినుంచో తీవ్ర అసంతృప్తిగా ఉన్న జీవన్‌రెడ్డి..ఇక తాడోపేడో అనేందుకు సిద్ధమౌతున్నారనే టాక్ నడుస్తోందిఏడాదిన్నరగా ఆయన నిరసనలు, అసంతృప్తి రాగం కంటిన్యూ అవుతూనే ఉంది. జంపింగ్‌లను ప్రోత్సహించడంపై రాష్ట్ర నాయకత్వం తీరును నిరసిస్తూ ఇప్పటికే ఓసారి ఏఐసీసీకి లేఖ రాశారు. ఆ తర్వాత సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ రాసి చర్చకు దారితీశారు. ఇప్పుడు మరోసారి మేడిగడ్డ బ్యారేజీపై సీఎంకు ఓపెన్ లెటర్ రాశారు జీవన్‌రెడ్డి. కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణ పనులు చేపట్టి తుమ్మడి హట్టి దగ్గర బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని..ఇందుకోసం 10 కోట్లు కేటాయించాలని రేవంత్‌రెడ్డిని కోరారు.ప్రాజెక్ట్ ను పూర్తి చేస్తే తెలంగాణలోని సగం ప్రాంతానికి సాగు, తాగునీరు అందుతుందని..మూసీకి కూడా నీళ్లు అందించే అవకాశం ఉంటుందన్నారు. మేడిగడ్డ బ్యారేజీని కూడా బాగు చేయాలని ప్రతిపక్ష నేత పాత్రను పోషిస్తూ సీఎంకు లెటర్ రాసి చర్చకు దారితీశారాయన. కాళేశ్వరం అవినీతిపై తప్పితే..రిపేర్లపై పెద్దగా ఏ కాంగ్రెస్ నేత మాట్లాడటం లేదు. ఈ సమయంలో జీవన్‌రెడ్డి రాసిన లేఖ కలకలం రేపుతోంది.ప్రస్తుత పరిస్థితుల్లో తాను కాంగ్రెస్ పార్టీలో కొనసాగటంపై ఆలోచించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఓపెన్‌గానే ప్రకటించేశారు జీవన్‌రెడ్డి. అందరి ఆలోచనలు తీసుకోకుండా తాను ఇప్పుడే ఏ నిర్ణయం తీసుకోనని..అయితే అందరి ఆలోచనలకు అనుగుణంగానే తన నిర్ణయం ఉంటుందంటూ నర్మగర్భంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పాలని జీవన్‌రెడ్డి ఇప్పటికే డిసైడ్ అయినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో తన మనుషులకు టికెట్లు దక్కకపోవడం..ఎమ్మెల్యే వర్గానికి ఎక్కువ టికెట్లు ఇవ్వడం..సొంతంగా తన అభ్యర్థులను పోటీకి పెట్టి గెలిపించుకోవడం ఇవన్నీ జరిగిపోయాయి. చివరకు ఛైర్మన్ నియామకంలోనూ తన మాటకన్నా ఎమ్మెల్యే సంజయ్‌కే పార్టీ జైకొట్టిందంటూ అప్పుడే అసహనం వ్యక్తం చేశారు జీవన్ రెడ్డి.ఈ క్రమంలో తన అసంతృప్తిని గమనించి.. సీనియారిటీని గుర్తించి అధిష్టానం పెద్దలైనా తనను పిలిచి మాట్లాడుతారని భావించారట. కానీ ఆయన ఊహించినట్లుగా ఏం జరగట్లేదట. పైగా రాష్ట్ర నేతలు ఎవరైనా టచ్‌లోకి వచ్చి సర్ది చెప్తారేమోనని కూడా వెయిట్ చేస్తే అది కూడా జరుగకపోవడం జీవన్‌రెడ్డి వర్గాన్ని నైరాశ్యంలోకి నెట్టిందనే టాక్ నడుస్తోంది. గాంధీభవన్ వేదికగా రచ్చ చేయడం..మంత్రుల పర్యటనల్లో తన అసంతృప్తిని వినిపించడంతో..రాష్ట్ర కాంగ్రెస్ పెద్దలు ఆయన తీరుపై కాస్త సీరియస్‌గా ఉన్నారట. పైగా జీవన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కూడా భావించారట.కానీ సీనియర్ నేత..ఆయనపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటే తప్పుడు సంకేతాలు వెళ్తాయని..పైగా జీవన్‌రెడ్డికి సానుభూతి పెరిగే అవకాశం ఉంటుందని ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండిపోతున్నారట. అయితే అటు పార్టీ పెద్దలు పిలిచి మాట్లాడకపోవడం ఒక ఎత్తు అయితే..తన నిరసనలకు కూడా ఎలాంటి రెస్పాన్స్ లేకపోవడంతో జీవన్‌రెడ్డికి మరింత ఆగ్రహం తెప్పిస్తుందట.

# సర్వరోగ నివారిణి - నాణ్యమైన నిద్ర

**హైదరాబాద్ పెన్ పవర్:** నేటి అత్యాధునిక వేగవంతమైన డిజిటల్ యుగంలో ఒత్తిడి, టెక్నాలజీ, రోజుకు దాదాపు 10 గంటల విధి నిర్వహణ లాంటి సవాళ్ల నడుమ గాఢ నిద్ర ఒక అరుదైన అనుభవం అవుతున్నది. నిద్ర ఒక సాధారణ విశ్రాంతి మాత్రమే కాదు నాణ్యమైన నిద్రతో శారీరక, మానసిక, భావోద్వేగ ఆరోగ్యం సిద్ధిస్తుంది. నాణ్యమైన నిద్ర వల్ల జ్ఞాపక శక్తి, రోగ నిరోధకత, ఉత్పత్తి పెరుగుతాయి. మానవ శారీరక మానసిక ఎదుగుదలకు పునాదిగా మంచి నిద్ర ఉపకరిస్తున్నది. 2008 నుంచి ప్రతి ఏట వసంత కాలంలో సమరాత్రి (రాత్రి పగలు సమాన గంటలు) రోజు, అనగా మార్చి 10 – 20 తారీఖుల మధ్య వచ్చే శుక్రవారం రోజున, అనగా 13 మార్చి 2026 రోజున "ప్రపంచ నిద్ర దినోత్సవం(వరల్డ్ స్లీప్ డే)"పాటించడం జరుగుతోంది. ప్రపంచ నిద్ర దినోత్సవ వేదికగా ప్రజల్లో నిద్ర ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు నిద్ర లేమి ఫలితాల వివరణ, ఆరోగ్యకర నిద్ర అలవాట్లు, నిద్ర ప్రయోజనాలు లాంటివి చర్చించడం జరుగుతున్నది. మంచి నిద్ర ద్వారా వ్యక్తుల నిర్ణయం తీసుకునే సామర్థ్యం, పనిలో ఏకాగ్రత, ఉత్తమ ఉత్పత్తి లాంటి ప్రధాన ప్రయోజనాలు వస్తాయి. నాణ్యమైన నిద్రతో భావోద్వేగ నియంత్రణ, స్థిరమైన మానసిక స్థితి, ఒత్తిడి లేమి, సమస్యల పరిష్కార సామర్థ్యం, చురుకైన శారీరక కదలికలు, సరైన జీర్ణక్రియ, సక్రమ జీవక్రియలు, కండరాల రిపేర్, హార్మోన్ల ఉత్పత్తి, సరైన బీపీ, హృద్రోగాల కట్టడి లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. నిద్ర లేమి వల్ల మానసిక చంచలత్వం, చికాకు, ఒత్తిడి, ఆందోళన లాంటి పలు అనారోగ్యాలు కలుగుతాయి. 2026 ప్రపంచ నిద్ర దినోత్సవం ఇతివృత్తంగా "నాణ్యమైన నిద్ర పొండి, ఆరోగ్యంగా జీవించండి (స్లీప్ వెల్, లివ్ బెట్టర్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. నిద్ర వల్ల శరీర అవయవాలన్నీ విశ్కదరాంతి తీసుకుంటాయనే అభిప్రాయం సరైనది కాదు. వ్యక్తి నిద్రలో ఉన్నపుడు తన శరీర అవయవాలు, మెదడు చురుకుగా పని చేస్తూ మన సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఉత్పాదకత, భావోద్వేగ సమతాస్థితి ఒనగూడుతాయి. ఒక సాధారణ వయోజనుడు ప్రతి రోజు 7 – 9 గంటలు నిద్ర పోవడం జరుగుతుంది. పని ఒత్తిడిలో తరుచుగా నిద్రకు సరైన సమయం కేటాయించని యెడల నిద్రలేమి వల్ల ప్రాణాంతక వ్యాధులు కూడా అనుభవించాల్సి వస్తుందని తెలుసుకోవాలి.

ప్రపంచ నిద్ర దినోత్సవం వేదికగా నిద్ర ప్రాధాన్యతను ప్రచారం చేయడంతో పాటు నిద్రలేమి దుష్ఫలితాలను వివరించడం జరుగుతుంది. నిద్రతో ఆరోగ్యానికి ఉన్న ప్రత్యక్ష సంబంధాలను వివరించడం, నిద్ర కేంద్రంగా సెమినార్ల నిర్వహణ, నిద్ర పట్ల లోతైన పరిశోధనల అవసరం, నిద్ర లేమి సవాళ్లు, సడలింపు పద్ధతులు, ఉత్పాదకతకు చేయూత, నాణ్యమైన జీవనశైలి పాటించడం లాంటి అంశాలను చర్చించడం జరుగుతుంది. ఒక నిష్కల్మష నవ్వు, నాణ్యమైన నిద్ర అనేవి అనేక రోగాల నివారణకు ఉత్తమ ఔషధాలని భావించాలి. నిద్ర అనేది ఒక రకమైన ధ్యానం లాంటిది. మన భవిష్యత్తు మనం కనే కలల మీద ఆధారపడి ఉన్నందున, నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం మన కనీస అవసరం అని తెలుసుకోవాలి. నిరాశకు ఆశకు మధ్య వారధిగా నాణ్యమైన రాత్రి నిద్ర ఉపయోగపడుతుందని మరువరాదు.

# రాష్ట్రంలో ఆగమయిన వ్యవసాయం

**నల్గొండ: పెన్ పవర్:** దేవరకొండ లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సమక్షంలో,కాంగ్రెస్ మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య తో పాటు 400 కార్యకర్తలు బీఆర్ఎస్ లో చేరారు.

జగదీష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోంది.. కేవలం పోలీస్ శాఖ మాత్రమే పని చేస్తోంది. అది కుడా కాంగ్రెస్ నాయకులకు తొత్తులుగా పని చేస్తున్నది. జిల్లాలో ఇద్దరు మంత్రుల ఉన్న శుద్ధ దండగ. సాగర్ కింద, ఎస్ఎల్బీసీ కింద నీళ్లు ఇవ్వలేని చావ లేని ,సత్తా లేని మంత్రులు వీల్లు.. డిండి పాలమూరు రంగరెడ్డి ఎత్తిపోతల పథకంలో కూడా నల్గొండ కి నీళ్లు రాకుండా పెద్ద కుట్ర జరుగుతోంది.. అయినా ఈ ఇద్దరు మంత్రులు చేతకాని వారిలాగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు..వీల్ల భరతం పడతామ్.. విళ్ల చేతకాని తనాన్ని నిలదీస్తాం. జిల్లాలో మంత్రులు హెలికాప్టర్లలో తిరగడం తప్ప అభివృధి చేసింది ఎం లేదని అన్నారు.

రైతు బంధును మూడు సార్లు ఎగ్గొట్టిన మోసగాడు ఈ సీఎం రేవంత్. నీళ్లు ఇవ్వకుండా, యూరియా లేక కరంట్ ఇవ్వకుండా పంటలను ఎండబెడుతున్నది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. రాహుల్ గాంధీకి, కేరళ ఎన్నికలకు మాత్రం వందల కోట్లు తెలంగాణ సొమ్మును తరలిస్తున్నారు..కాంగ్రెస్ అధిష్టానం కి తెలంగాణా ఏటీఎంలా మారింది. .కేసీఆర్ అధికారంలో ఉన్నన్ని రోజులు రైతులకు ఓ స్వర్ణయుగం..ఏ విషయం లో కూడా అన్నదాతలు ఇబ్బందులు పడలేదు.. కాంగ్రెస్ వచ్చింది వ్యవసాయం అస్తవ్యస్తంగా మారింది..ఆగం అయిందని అన్నారు.



# ఇకపై ప్రభుత్వ శాఖలకు ఈవీ వాహనాలే



**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రభుత్వ శాఖలు ఇకనుంచి తప్పనిసరిగా ఎలక్ట్రిక్ వాహనాలను (జుఎ) మాత్రమే కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కాలుష్య రహిత రవాణా వ్యవస్థ లక్ష్యంగా పని చేయాలని చెప్పారు.

కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని ప్రభుత్వ శాఖలు అద్దెకు తీసుకునే వాహనాలు సైతం ఈవీలే ఉండాలని తెలిపారు. రవాణా శాఖలోని మాన్యువల్ విధానాలకు స్వస్తి చెప్పాలని, మొత్తం ఆన్లైన్లోనే కార్యకలాపాలు కొనసాగించాలని ఆదేశించారు.

ముఖ్యమంత్రి రవాణా శాఖ అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఆర్టీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని, వెంటనే సొంత భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచాలని, ప్రజల్లో చైతన్యం తేవడానికి షార్ట్ ఫిల్మ్లు ప్రదర్శించాలని సూచించారు. శంషాబాద్ సమీపంలో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో అధునాతన బస్ టెర్మినల్కు స్థలం కేటాయిస్తామని, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# రికార్డుల ర్యాపిడో... రోజుకు 10 లక్షల రైడ్లు

**హైదరాబాద్, మార్చి 12, పెన్ పవర్:**
భారతదేశంలో అతిపెద్ద, అందుబాటు ధరల మొబిలిటీ ప్లాట్‌ఫామ్‌గా ఎదిగిన ర్యాపిడో ఇప్పుడు హైదరాబాద్ నగరంలో మెట్రో ప్రయాణాలకు కీలక భాగస్వామిగా మారుతోంది. నగరంలో ప్రయాణించే ప్రజలు తమ రోజువారీ ప్రయాణాలను సులభంగా పూర్తి చేసుకునేందుకు రాపిడో మొదటి మైలు, చివరి మైలు ప్రయాణాలను కలిపే ముఖ్యమైన సేవగా నిలుస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో రోజుకు సుమారు 1.5 లక్షలకుపైగా రాపిడో రైడ్లు మెట్రో స్టేషన్లతో అనుసంధానమై జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ప్రయాణికులు తమ ఇంటి నుండి మెట్రో స్టేషన్‌కు చేరుకోవడానికి లేదా మెట్రో స్టేషన్ నుంచి తమ గమ్యస్థానానికి చేరుకోవడానికి రాపిడో బైక్‌లు, ఆటోలను విస్తృతంగా వినియోగిస్తున్నారని తేలింది. అంతేకాకుండా, రాపిడో యాప్ ద్వారా రోజుకు దాదాపు 30,000 మెట్రో టికెట్లు బుక్ అవుతున్నాయి. ఇది నగరంలో సమగ్ర పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్‌పై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తిని చూపిస్తోంది. రాపిడో కేవలం ఒక యాప్ మాత్రమే కాదు, హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థలో ఒక కీలక భాగమైపోయింది.రాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి మాట్లాడుతూ, నగర రవాణా వ్యవస్థ సజావుగా పనిచేయాలంటే ప్రయాణం సులభంగా, నిరంతరంగా ఉండాలని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రయాణికులు మెట్రో ప్రయాణాన్ని రాపిడో బైక్‌లు, ఆటోలతో కలిపి వేగంగా, సమయపాలనతో ప్రయాణిస్తున్నారని చెప్పారు. ఒకే ప్లాట్‌ఫామ్ ద్వారా బహుళ రవాణా విధానాలను సులభంగా వినియోగించుకునేలా చేయడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో మొత్తం కలిపి రోజుకు 10 లక్షలకు పైగా రాపిడో రైడ్లు నమోదవుతున్నాయట. దీంతో నగర పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్‌కు మద్దతు ఇస్తున్న ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో రాపిడో ఒకటిగా నిలుస్తోంది. ప్రయాణికులకు సౌకర్యం, సమయ ఆదా ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. ఇకపై ప్రయాణాన్ని ప్లాన్ చేయడానికి వేర్వేరు యాప్‌లను ఉపయోగించాల్సిన అవసరం లేకుండా, ఒకే యాప్‌లో టికెట్ బుకింగ్‌తో పాటు రైడ్ సదుపాయం అందుబాటులో ఉండటం మెట్రో ప్రయాణాన్ని మరింత అలవాటుగా మారుస్తోంది. దీనికి అనుగుణంగా రోజువారీ వినియోగ ధోరణులు కూడా మారుతున్నాయి. హైదరాబాద్‌లో జరిగే మొత్తం రాపిడో రైడ్లలో దాదాపు సగం రైడ్లు కార్యాలయాలు, కళాశాలల పీక్ అవర్స్‌లోనే జరుగుతున్నాయి. ఇది రాపిడో సేవలు సాధారణ రవాణా కంటే రోజువారీ ప్రయాణానికి అవసరమైన మౌలిక వసతులుగా మారుతున్నాయని సూచిస్తోంది. భవిష్యత్తులో హైదరాబాద్ మెట్రో విస్తరిస్తున్న నేపథ్యంలో రాపిడో నగరంలోని ఇళ్లు, వీధులు, మెట్రో స్టేషన్లను కలిపే కీలక కనెక్టివిటీ లేయర్‌గా మరింత ప్రాధాన్యం పొందే అవకాశముంది.

## రోడ్డెక్కిన ఆజం జాహి మిల్ కార్మికులు

**పరకాల, మార్చి 12 పెన్ పవర్:** సీఎం రేవంత్ రెడ్డి ఆజంజాహి మిల్లు కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కార్మికులు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. వెంకట్రామ జంక్షన్ వద్ద సీఎం మిల్లు కార్మికులకు ఇస్తామన్న 200 గజాల నివాస స్థలాన్ని వెంటనే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సీఎం పాదయాత్రలో ఇచ్చిన హామీని ఇప్పటికీ నెరవేర్చలేదని, 20 సంవత్సరాలుగా పోరాడుతున్నా 2021లో సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా వచ్చినా స్థలాలు ఇవ్వలేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

## భానుజీపేటలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహణ

**నర్సంపేట, మార్చి 12 పెన్ పవర్:** ఉమ్మడి వరంగల్ జిల్లా, నర్సంపేటలోని భానుజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా డాక్టర్ జూనెద్ ఖాన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులను పరీక్షించి, రక్త నమూనాలను సేకరించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 150 మందికి పరీక్షలు చేసినట్లు డాక్టర్ శ్రవణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యాధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై అవగాహన సదస్సు

**మహబూబాబాద్, మార్చి 12 పెన్ పవర్:** మహబూబాబాద్‌లోని పి.ఎస్.ఆర్ గార్డెన్‌లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికపై ప్రజా ప్రతినిధులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మురళీ నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, కలెక్టర్ స్నేహ శబరీష్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. పలు అభివృద్ధి పనులను ప్రజా ప్రతినిధులకు వివరించారు.

## అర్చకుల కుల ధ్రువీకరణ ప్రాంతాలపై విచారణ

**ములుగు, మార్చి 12 పెన్ పవర్:** ములుగు జిల్లా మంగపేట మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో అర్చకుల కుల ధ్రువీకరణ ప్రాంతాలపై తహశీల్దార్ తోట రవీందర్ గురువారం విచారణ చేపట్టారు. శ్రీ హేమాచల లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం పరిచారిక పోస్టుకు పొందేందుకు తప్పుడు ధృవపత్రాలను సమర్పించారని ఆలయ రిటైర్డ్ ప్రధాన అర్చకులు కైకర్యం రాఘవ చార్యులు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో కుల ధ్రువీకరణ పత్రాలపై కార్యాలయంలో విచారణ చేపట్టారు. నివేదికను కలెక్టర్ కు పంపిస్తామని తహశీల్దార్ తెలిపారు.

## నర్సంపేటలో ట్యాంకర్లతో నీటి సరఫరా

**జనగామ, మార్చి 12 పెన్ పవర్:** నర్సంపేటలో మిషన్ భగీరథ పైపుల లీకేజీతో ఐదు రోజులుగా ఇబ్బందులు పడుతున్న వార్డు ప్రజలకు స్థానిక కౌన్సిలర్ బాణాల ప్రసన్న శ్రీనివాస్ ట్యాంకర్ల ద్వారా గురువారం నీటిని అందించారు. పైపులైన్ లీకేజీని త్వరలోనే పరిష్కరిస్తామని, వార్డులో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సహకారంతో సర్వపురం ఎస్సీ కాలనీలో నీటి అవసరాల కోసం బోర్ వేయించామని, మరికొన్ని బోర్లు కూడా వేయిస్తామని హామీ ఇచ్చారు.

## గీసుకొండలో కూసం రాజమౌళికి ఘన నివాళి

**భూపాలపల్లి, మార్చి 12 పెన్ పవర్:** ఉమ్మడి వరంగల్ జిల్లా, పరకాలలోని గీసుకొండ మండలం గంగాదేవిపల్లి ఆదర్శ గ్రామంగా నిలిచింది. ఎల్గూర్ రంగంపేట్ గ్రామానికి చెందిన అభిమానులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు కలిసి విప్లవ భావజాలంతో గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేసిన అమరుడు కూసం రాజమౌళి మరణానికి ఐదవ రోజు ఘనంగా గురువారం నివాళులు అర్పించి పుష్పాంజలి ఘటించి జోహార్లు అర్పించారు. వారి మార్గాన్ని కొనసాగిస్తామని సంకల్పం వ్యక్తం చేశారు.

## పౌల్ట్రీ ఫారాల్లో అంతుచిక్కని వ్యాధి, వేల కోళ్లు మృతి

**సంగారెడ్డి, మార్చి 12 పెన్ పవర్:** వెల్దుర్తి మండలంలోని పౌల్ట్రీ ఫారాల్లో అంతుచిక్కని వ్యాధితో వేలాది కోళ్లు రాత్రికిరాత్రే మృత్యువాత పడుతున్నాయి. ఈ ఊహించని పరిణామంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యాధికి గల కారణాలు తెలియక ఆందోళన చెందుతున్న రైతులు, ప్రభుత్వం వెంటనే వైద్య బృందాలను పంపి సమస్యను పరిష్కరించాలని, నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## తీవ్ర విషాదం.. ప్రభుత్వ టీచర్ మృతి



**నారాయణఖేడ్, మార్చి 12 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం ఘనపూర్ పాఠశాల ఉపాధ్యాయుడు గుర్రం నరేందర్ రాత్రి నిజామాబాద్ బస్టాండ్ వద్ద ఛాతి నొప్పితో కుప్పకూలి, హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన స్వగ్రామం నిజామాబాద్ జిల్లా బోధన్ రాకాసి పేటలో మధ్యాహ్నం అంత్యక్రియలు జరగనున్నాయి. కంట్టి ఓఇూ, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

## 19 నుంచి చౌటకూరులో స్వామివారి జాతర ఉత్సవాలు

**ఆందోల్, మార్చి 12 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా, అందోల్ నియోజకవర్గం, చౌటకూర్ మండల కేంద్రంలో శ్రీ అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర స్వామి జాతర, రథోత్సవం ఈనెల 19 నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. ఏటా జరిగే ఈ వేడుకల కోసం రథాన్ని అందంగా అలంకరిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది.

## లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు... ఒకరు మృతి, పలువురికి గాయాలు

**జహీరాబాద్, మార్చి 12 పెన్ పవర్:** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్తున్న బస్సులో ప్రయాణిస్తున్న చిన్నకోడూరు మండలం లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన రంగు సత్యనారాయణ మృతి చెందాడు. పలువురు గాయపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్చార్జి వంటేరు ప్రతాపరెడ్డి, ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**మంచిర్యాల, మార్చి 12 పెన్ పవర్:** మంచిర్యాల, పెద్దంపేట రైల్వే స్టేషన్ల మధ్య రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అతని జేబులో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా, మృతుడిని అదిలాబాద్ జిల్లా ముల్కపల్లికి చెందిన పడిగల రజనీకాంత్ గా గుర్తించారు. అతను ఎరుపు రంగు గడుల చొక్కా, నలుపు రంగు జీన్స్ పాయింట్ ధరించి ఉన్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు.

## తీవ్ర విషాదం.. యువతి ఆత్మహత్య

**బెల్లంపల్లి, మార్చి 12 పెన్ పవర్:** ఖానాపూర్ మండలం బావాపూర్‌లో అమూల్య (18) అనే యువతి అనారోగ్యంతో మనస్థాపం చెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న ఆమెకు ఇటీవలే పెళ్లి నిశ్చయమైంది. తన అనారోగ్యం వల్ల కాబోయే భర్త ఇబ్బంది పడకూడదనే ఆందోళనతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజా పాలనపై ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు



**ఆసిఫాబాద్, మార్చి 12 పెన్ పవర్:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో "ప్రజా పాలన ? ప్రగతి పాలన" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు గురువారం జరిగింది. జిల్లా కలెక్టర్ కె. హరిత, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమమే తమ ప్రాధాన్యత అని, ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసి ప్రజలకు మేలు చేకూరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డేవిడ్ నాయక్, మున్సిపల్ చైర్మన్లు మెంగ్రే ఆకాష్, షాహిద్ సుల్తానా, వైస్ చైర్మన్ ఎం.డి. అహ్మద్, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టైరు పేలి బోలిరో వ్యాన్ బోల్తా, ఇద్దరు మృతి

**సిర్పూర్, మార్చి 12 పెన్ పవర్:** నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్ గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం సోంపల్లి గ్రామస్తులు గురువారం ఉదయం పెళ్లికి హాజరయ్యేందుకు బొలెరో వాహనంలో 21 మంది ఆర్మూర్ బయలుదేరారు. వాహనం కొండాపూర్ గ్రామ సమీపంలోకి చేరుకోగానే వెనుక టైరు పేలి అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించగా, 19 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

## ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ఇద్దరు అరెస్ట్

**చెన్నూరు, మార్చి 12 పెన్ పవర్:** గుడిహత్నూర్ మండల పరిధిలోని ఓ యువతిని ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి మోసం చేసిన ఆత్రం గణపతి, వరుణ్ అనే ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలి నుంచి రూ. 15 వేలు వసూలు చేసిన నిందితులు, మొత్తం 50 వేలు డిమాండ్ చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్ కు తరలించారు. ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి మోసగాళ్ల వివరాలను వెంటనే పోలీసులకు తెలపాలని ఎస్ఐ సూచించారు.

## పంట పొలాల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

**జగిత్యాల, మార్చి 12 పెన్ పవర్:** గురువారం ఉదయం ఇల్లంతకుంట మండలంలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. వెంకటాపూర్ నుంచి జంగంరెడ్డిపల్లెకు విద్యార్థులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పంట పొలంలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ఘటన జరిగింది. అదృష్టవశాత్తు బస్సులో ఉన్న విద్యార్థులెవరికీ గాయాలు కాలేదు. దీంతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు.

## గ్రామ పంచాయతీ ఆస్తి ధ్వంసం.. వ్యక్తిపై కేసు

**కోరుట్ల, మార్చి 12 పెన్ పవర్:** కొత్తపేట జీపీలో ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన ఇల్లందుల పరశురాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. గతంలో ఇక్కడే పనిచేసి, రాజీనామా చేసి దుబాయ్ వెళ్లిన పరశురాములు, తిరిగి వచ్చి ఉద్యోగం ఇప్పించాలని కోరగా సర్పంచ్ నిరాకరించారు. దీంతో ఆగ్రహించి కార్యాలయంలోని వైర్లు, మోటార్లు, స్టార్టర్లను ధ్వంసం చేశాడు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వెల్లడించారు.

## కేటీఆర్ వ్యాఖ్యలను ఖండించిన పెద్దపల్లి ఎంపీ

**పెద్దపల్లి, మార్చి 12 పెన్ పవర్:** పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీపై కేటీఆర్ చేసిన ఆరోపణలు వాస్తవ దూరం అని వంశీకృష్ణ అన్నారు. 2019లో అధికార దుర్వినియోగంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని, ఈ ఘటనలను ప్రజలు మరచిపోలేదని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి నాయకుడి బాధ్యత అని, ప్రజల తీర్పే అంతిమమని వంశీకృష్ణ స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**కొత్తగూడెం, మార్చి 12 పెన్ పవర్:** లక్ష్మీదేవిపల్లి మండలంలో గురువారం నాడు అనిశెట్టిపల్లి గ్రామ సమీపంలో ఓ లారీ బోల్తా పడింది. కొత్తగూడెం వైపు వెళుతున్న లారీ రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడి బోల్తా కొట్టింది. ఈ దుర్ఘటనలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి వారిని ఆసుపత్రికి తరలించారు.

## ఘోర ప్రమాదం.. ఇద్దరు దుర్మరణం

**భద్రాచలం, మార్చి 12 పెన్ పవర్:** గురువారం సత్తుపల్లి మండలం నారాయణపురం ఆంజనేయస్వామి ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. రేజర్లకు చెందిన సాలి నాగేశ్వరరావు (58), పెనుబల్లి మండలం చెందిన పానెం సులోమన్ (57) వేర్వేరు బైక్‌లపై సత్తుపల్లి వైపు వస్తుండగా, బేతుపల్లి నుంచి వస్తున్న లారీ టర్నింగ్ వద్ద వారిని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

## సీతారాముల కళ్యాణానికి రూ.50 వేల విగ్రహాలు అందజేత



**ధర్మపురి, మార్చి 12 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా, ధర్మపురి పరిధిలోని ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని సీతారాముల ఆలయంలో త్వరలో జరగనున్న సీతా రాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మద్దుల గోపాల్ రెడ్డి సుమారు రూ.50 వేల విలువైన సీతారాముల విగ్రహాలను ఆలయానికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ధార్మిక కార్యక్రమాలకు ఎల్లప్పుడూ సహకరిస్తానని గోపాల్ రెడ్డి తెలిపారు. గ్రామస్తులు కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రతిజ్ఞా పాలనలో లక్ష్యాన్ని ముద్దాడిన ఉద్ధం సింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులు బాసినవారెందరో.. అయితే అమర వీరుడు ఉద్ధంసింగ్ ఆత్మార్పణం ఒక ప్రత్యేకం. కళ్ళముందే అగణిత ప్రాణాలను కిరాతకంగా తుపాకీ గుళ్ళకు బలి చేసిన శ్వేత జాతి అధికారిని హతమార్చి పగ తీర్చుకున్న సందర్భం. దేశ చరిత్రలో చెరిగి పోలేని దేశభక్తికి పరాకాష్టగా నిలిచిన ముఖ్య ఘట్టం. జలియన్ వాలా బాగ్ మారణకాండలో ప్రాణాలతో బయట పడిన యువకుడు తాను చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చడానికి, పగ తీర్చకోవడానికి ఏళ్ళ తరబడి నిరీక్షించి, లక్ష్య సాధనలో దేశాన్ని వదిలి, విదేశానికి శ్రమకోర్చి వెళ్ళి, సమయం కోసం వేచి ఉండి, నర రూప రాక్షసుడైన డయ్యర్‌ను హతమార్చి, ఉరితాడును ముద్దాడిన దేశం గర్వించదగ్గ అమరుడు ఉద్దమ్ సింగ్ సాహసోపేత నేపథ్యం అనన్య సామాన్యం, అపూర్వం, అసమానం. ఈ చారిత్రక నేపథ్యం గురించి తెలుసు కోవాలంటే 102 ఏళ్లు వెనకకు వెళ్లాల్సిందే. పంజాబ్, బెంగాల్‌లో నానాటికీ పెచ్చరిల్లుతున్న విప్లవోద్యమం, భారత ప్రజల్లో నానాటికీ రగులుతున్న అసంతృప్తి (ముఖ్యంగా బాంబే మిల్ వర్కర్స్‌లో), మొదలైన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని బ్రిటిష్ ప్రభుత్వం 1918లో ఆంగ్లేయ న్యాయమూర్తి యైన సిడ్నీ రౌలట్ ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. దీనినే రౌలట్ కమిటీ అంటారు. రౌలట్ కమిటీ ప్రతిపాదనను అనుసరించి బ్రిటీష్ ప్రభుత్వం 1915లో ఏర్పాటు చేయబడ్డ భారతీయ రక్షణ చట్టానికి అదనంగా రౌలట్ చట్టాన్ని ప్రతిపాదించింది. ఈ చట్టం ద్వారా తిరుగుబాట్లను అణిచి వేయడానికి వైస్రాయ్‌లకు విశేష అధికారాలను కట్టబెట్టారు. ప్రెస్ నోళ్ళను కట్టేయడానికీ, విచారణ లేకుండా రాజకీయ నాయకులను నిర్బంధించడం, తిరుగుబాటు దారునిగా అనుమానితులైన వ్యక్తులను వారంటు లేకుండా అరెస్టు చేయడం మొదలైన నిరంకుశమైన అధికారాలు ఇందులో ఉన్నాయి. ఈ చట్టంపై దేశంలో సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. జలియన్ వాలాబాగ్ దురంతం భారత స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో జరిగిన అత్యంత దురదృష్టమైన సంఘటన. 1919, ఏప్రిల్ 13న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్ లోగల స్వర్ణ దేవాలయం పక్కనే ఉన్న జలియన్ వాలాబాగ్ తోట లో దాదాపు 20 వేలమంది ప్రజలు సమావేశ మైనారు. అది వైశాఖ మాసం, సిక్కులకు ఆధ్యాత్మిక నూతన సంవత్సరం. వారు అక్కడ సమావేశ మవడానికి ముఖ్య కారణం, ప్రముఖ నేతలు ఆంగ్లేయ పాలనకు వ్యతిరేకిస్తూ చేస్తున్న ఉపన్యాసాలను వినడం, అనేక విమర్శలకు గురైన రౌలట్ చట్టం క్రింద సత్యపాల్, సైఫుద్దీన్ కిచ్లూ లను అక్రమంగా నిర్బంధించడాన్ని వ్యతిరేకించడం. ఏప్రిల్ 13, 1919 న బ్రిటీష్ సైనికులు జనరల్ డయ్యర్ సారథ్యంలో ఈ తోటలో సమావేశమైన నిరాయుధులైన స్త్రీ, పురుషులు, పిల్లలపైన విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పులు పది నిమిషాల పాటు కొనసాగాయి. ఇరుకైన సందుల కారణంగా వాహనాలు బాగ్‌లోపలికి రాలేకపోయాయి. జలియన్ వాలా బాగ్ (పార్కు) అన్ని ప్రక్కలా ఇండ్లతోను, పెద్దభవనాలతోను చుట్టబడి ఉంది. ఉన్న కొద్దిపాటి ఇరుకైన సందుల దారుల్లో చాలా వాటికి తాళాలు వేసి ఉన్నాయి. కాల్పుల కారణంగా వందలమంది మరణించారు. 1650 రౌండ్లు కాల్పులు జరిగాయి. అప్పటి ఆంగ్ల ప్రభుత్వ లెక్కల ప్రకారం 379 (337 పురుషులు, 41 మంది బాలురు, 6 వారాల పసికందు) మరణించారు. కానీ ఇతర గణాంకాల ప్రకారం అక్కడ 1000 కి పైగా మరణించారు. 2000 మందికి పైగా గాయపడ్డారు. అక్కడ స్మారక చిహ్నంపైన వ్రాసిన సమాచారం ప్రకారం అక్కడి బావిలోంచి 120 శవాలను బయటకు తీశారు. నగరంలో కర్ఫ్యూ ఉన్నందున గాయపడిన వారిని ఆసుపత్రులకు తీసికొని వెళ్ళడం సాధ్యం కాలేదు. పంజాబ్ అమృత్‌సర్ లోని 1919 ఏప్రిల్ 13 న జలియన్ వాలాభాగ్‌లో శాంతియుతంగా వేల మంది సామన్య పౌరులు సమావేశం అయి ఉండగా పోలీసులతో చుట్టుముట్టి విచ్చలవిడిగా కాల్పులు జరిపి వేల మంది మరణానికి కారణం అయ్యాడు జనరల్ డైయర్. షేర్ సింగ్ (ఉధం సింగ్) 1899 డిసెంబర్ 26 న పంజాబ్ లో సంగ్రూర్ జిల్లా సునం అనే గ్రామంలో కాంబోజి సిక్ కుటుంబంలో జన్మించాడు. తండ్రి తెహల్ సింగ్ పొరుగు గ్రామమైన ఉపాల్ లో జమ్ము రైల్వే క్రాసింగ్ కాపలాదారుగా జీవనం సాగించేవారు. షేర్ సింగ్ (ఉధం సింగ్ ) వారి తల్లి తండ్రులు చనిపోయాక అన్న ముక్తా సింగ్ తో కలిసి అమృత్ సర్ లో సెంట్రల్ ఖల్సా అనాథ ఆశ్రమంలో చేరాడు. అక్కడ సిక్కులకి మతపరమైన దీక్ష చేసి అక్కడ వారి చేత ఉదం సింగ్ అనే పేరుని స్వీకరించాడు. మెట్రిక్యులేషన్ చదువు 1918లో పూర్తి చేసి 1919లో ఆ అనాథ ఆశ్రమం నుండి బయటకి వచ్చాడు. జలియాన్ వాలా బాగ్ సంఘటనలో యువకుడైన సింగ్ కూడా ఉన్నాడు. అమానుష దాడి తన కళ్ళ ముందే జరగడంతో హత్యాకాండకు సూత్రధారి అయిన డైయర్ను జెనరల్ మైకెల్ ఓ డయ్యర్ ను హతమార్చడానికి ప్రతీకారాన్ని ప్రతినబూనాడు. భగత్ సింగ్ విప్లవ భావాలకి ఆకర్షితుడై 1927న భగత్‌సింగ్ ఆదేశాల మేరకు విదేశాల నుండి తుపాకులు తెస్తూ పోలీసులకు దొరికి 1931 వరకు జైలు జీవితం గడిపాడు. విప్లవ వీరుడు భగత్ సింగ్ ను ఉరి తీయడం సింగ్ ను కలచి వేసింది. జైలు నుండి విడుదల అయిన తరువాత చదువు పేరుతో పేరు మార్చుకుని, పోలీసుల నిఘా నుండి తప్పించుకుని కాశ్మీర్, జర్మనీ మీదగా లండన్ చేరాడు. డయ్యర్‌ని హత్య చేయడానికి పగబట్టి 9 సంవత్సరాలు ఎదురు చూసి 21 సంవత్సరాల తరువాత "మార్చి 1940 మార్చి 13 న" లండన్ కాక్స్ టన్ హాల్ లో దయర్ ని అందరు చూస్తుండగానే తుపాకీతో కాల్చి హత్య చేసి ప్రతీకారం తీర్చుకుని పోలీసులకి స్వచ్ఛందంగా పట్టుబడి తను చంపిన కారణాన్ని నిర్భయంగా చెప్పాడు. దీంతో జూన్ 4, 1940 న, ఓల్డ్ బెయిలీలోని సెంట్రల్ క్రిమినల్ కోర్టులో, జస్టిస్ అట్కిన్సన్ , అతను మరణశిక్ష విధించాడు జూలై 31, 1940 న, ఉధమ్ సింగ్ ను లండన్ లోని పెంటన్ విల్లే జైలులో ఉరి తీసారు. అలా ఉధం సింగ్ ప్రతిజ్ఞను నెరవేర్చుకుని అమరుడైనాడు

# రాజకీయ సాహిత్య సవ్యసాచి బూర్గుల

**హైదరాబాద్ పెన్ పవర్:** అపర చాణక్యునిగా పేరెన్నిక గన్న దివంగత ప్రధాని పివి నరసింహారావుకు ఆయన గురువు. ఆయన న్యాయవాది, బహుభాషావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, రాజనీతిజ్ఞుడు. హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవస్థాపకుల్లో ఒకరు. సాహితీ వేత్త. బహు భాషా కోవిదులు. రెండు రాష్ట్రాలకు గవర్నరుగా పని చేసిన తొలితరం కాంగ్రెస్ నాయకులు. ఆయనే హైదరాబాద్ రాష్ట్రానికి ప్రజల ద్వారా ఎన్నికైన మొట్టమొదటి, చిట్టచివరి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ బూర్గుల రామకృష్ణారావుతో పీవీకి ప్రత్యేక అనుబంధం ఉండేది. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు గురువు ఆయన. బూర్గుల న్యాయవాదిగా పనిచేసే రోజుల్లో ఆయన వద్ద పి.వి. సహాయకునిగా పనిచేయడమే కాకుండా రాజకీయాల్లో ఆయన వారసునిగా ఎదిగారు. రామకృష్ణరావు విళంబి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ విదియ 1899 మార్చి 13 న నరసింగరావు, రంగనాయకమ్మ దంపతులకు కల్వకుర్తి తాలూకా పడకల్లు గ్రామంలో తమ మాతామహులైన వెల్దండ శేషారావు గారి ఇంట జన్మించారు. ఇంటి పేరు పుల్లం రాజు. అయితే స్వగ్రామమైన బూర్గుల నామమే ఇంటి పేరుగా మారింది. ధర్మపంత్ స్కూలు (హైదరాబాద్) లో ప్రాథమిక విద్యను అభ్యసించారు. 1915లో మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. పూణె లోని ఫెర్గూసన్ కళాశాలలో బీఏ (హానర్స్) డిగ్రీ చదివారు. బొంబాయి విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించి ఎల్.ఎల్.బి. పట్టాను పొందారు. న్యాయశాస్త్ర విద్యార్థిగా ఉన్నప్పుడు ఇండియన్ సోషల్ రీఫార్మర్ పత్రికలో వరకట్న దురాచారాన్ని ఖండిస్తూ ఆంగ్లంలో వ్యాసాలు రాసి పాఠకులు, సంపాదకుల మన్ననలు పొందారు. 1922లో ఆంగ్ల ప్రభుత్వం వారు బీరార్ ను నిజాంకు ఇచ్చివేయాలని కూడా పై పత్రికల్లోనూ, ఉర్దూ పత్రికల్లోనూ వ్యాసాలు రాశారు. బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ (లా డిగ్రీ) పూర్తిచేసి, హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. బూర్గుల దగ్గర పివి నరసింహారావు జూనియర్ లాయర్‌గా పనిచేశారు. 1923లో హైదరాబాదులో న్యాయవాద వృత్తి ప్రారంభించి అగ్రస్థాయికి చేరారు. న్యాయవాదిగా ఉంటూనే, రాజకీయాల్లో పాల్గొన్నారు. ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూదానోద్యమం మొదలైన వాటిలో పాల్గొన్నారు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారితో కలిసి పనిచేసారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంకు అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేసారు. హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు వ్యవస్థాపకుల్లో బూర్గుల ప్రముఖులు. పార్టీ తరపున ఆయన అనేక కార్యక్రమాలకు నేతృత్వం వహించాడు. 1931లో నల్గొండ జిల్లా దేవరకొండలో జరిగిన ఆంధ్రమహా సభకు బూర్గుల అధ్యక్షత వహించారు. శాసనోల్లంఘన ఉద్యమం లోను, క్విట్ ఇండియా ఉద్యమం లోను పాల్గొని కారాగార వాసం అనుభవించారు. 1948లో పోలీసు చర్య తరువాత హైదరాబాదు రాష్ట్రం ఏర్పాటు అయి, వెల్లోడి ముఖ్య మంత్రిగా సైనిక ప్రభుత్వం ఏర్పడినపుడు, ఆయన రెవిన్యూ, విద్యాశాఖల మంత్రి అయ్యారు. రెవెన్యూ మంత్రిగా వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి చట్టబద్ధత కల్పించారు. 1952లో మొదటిసారి హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికలు జరిగిపుడు, మహబూబ్ నగర్ జిల్లాలోని షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి హైదరాబాద్ శాసనసభకు ఎన్నికయ్యారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి అయ్యారు. పూర్తి మెజారిటీ లేకున్ననూ, మంత్రివర్గంలో సంపూర్ణ సహకారం లేకున్ననూ, పరిపాలన దక్షుడైన ముఖ్య మంత్రిగా పేరుగాంచారు. 1956లో హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు మాట్లాడే ప్రాంతాలను విడదీసి, కోస్తా, రాయలసీమ లతో

కలిపి ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు అయినపుడు, కొత్త రాష్ట్రానికి నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి కాగా, బూర్గుల, కేరళ రాష్ట్రానికి గవర్నరుగా నియుక్తులై, 1960 వరకు కేరళ గవర్నరుగా పనిచేసి, తరువాత 1962 వరకు ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా కొనసాగారు. 1948 జనవరిలో ప్రభుత్వ ఏజెంట్ జనరల్‌గా హైదరాబాద్ వచ్చిన కె.యం. మున్షీని నిజాం ఆజ్ఞలకు విరుద్ధంగా అందరికన్నా ముందే సందర్శించి పాలకుల ఆగ్రహానికి గురయ్యారు. ఆ సంవత్సరంలోనే హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకులై ప్రజా ఉద్యమానికి సారథ్యం వహించారు. హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం కావడానికి కృషి సల్పిన తీరు విశేషమైనది. రాజకీయ రంగంలోనే కాకుండా సాంఘిక సాంస్కృతిక రంగాల్లో ఆయన చేసిన సేవ ప్రత్యేకమైనది. ఖాదీ బోర్డు విచారణ సంఘం, మధ్యప్రదేశ్ విషయ పరిశీలన సంఘం, ఆంధ్రప్రదేశ్ భారత్ సేవక సమాజం అధ్యక్షులుగా ఉన్నారు. చరిత్ర, శాస్త్ర విజ్ఞానాల తెలుగు ఉర్దూ అకాడమీ, భారతీయ విద్యాభవన్, ప్రశాంతి విద్వత్ పరిషత్ అధ్యక్షులుగా విశేష సాంస్కృతిక సేవలందించారు. క్లాసికల్ లాంగ్వేజి కమిషన్ సభ్యులుగా, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, సంస్కృత పరిషత్‌ల ఉపాధ్యక్షులుగా భాషా సేవలు అందించారు. ఆయన అనేక భాషలలో నిష్ణాతులు. అవన్నీ ఆయన సొంతంగా, ఆసక్తితో నేర్చుకున్నవే. అర్ధరాత్రి వరకు ఫైళ్లలో నిమగ్నమై, తర్వాత బూర్గుల సంస్కృతంలో మునిగి తేలేవారు. బూర్గుల బహు భాషావేత్త, సాహితీవేత్త. తెలుగు, హిందీ, ఆంగ్లం, కన్నడ, మరాఠీ, ఉర్దూ, పారశీక, సంస్కృత భాషల్లో బూర్గులకు ప్రావీణ్యం ఉంది. మహారాష్ట్రలో చదివే రోజుల్లోనే ఆంగ్లంలో కవితలు, సానెట్లు, వ్యాసాలు రాసి కాలేజీ సంచికలో ప్రచురించారు. థామస్ గ్రే ఎలిజీని 'మృత సంస్మృతి' పేరుతో స్వతంత్ర రచన అనిపించే విధంగా అనువదించారు.ర

ఆంగ్ల భాషలో ఆయన స్వయంగా రచించిన భావగీతాలు 'ద డ్రీమ్ ఆఫ్ పొయెట్రీస్ అండ్ అదర్ పోయెమ్స్' పేరుతో వెలువడ్డాయి. పారశీక వాఙ్మయ చరిత్ర ఆయన రచనలలో పేరు పొందినది. జగన్నాథ పండితరాయల లహరీ పంచకమును, శంకరాచార్యుల సౌందర్య లహరి, కనకధారా స్తవమును తెలుగులోకి అనువదించారు. కృష్ణ శతకం, సంస్కృతంలో శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం, శారదస్తుతి, గౌరీస్తుతి, వాణీస్తుతి, లక్ష్మీస్తుతి, శ్రీకృష్ణాష్టకం, రెడ్డి రాజుల కాలం-మత సంస్కృతులు (పరిశోధనా వ్యాసం) మొదలైనవి ఆయన ఇతర రచనలు. అయన రచించిన వ్యాసాలు 'సారస్వత వ్యాస ముక్తావళి' పేరుతో అచ్చయింది. పండిత రాజ పంచామృతం, కృష్ణశతకం, వేంకటేశ్వర సుప్రభాతం, నర్మద్‌గీతాలు, పుష్పాంజలి, తొలిచుక్క (కవితలు), నివేదన (కవితలు), పారశీక వాఙ్మయ చరిత్ర మొదలైన గ్రంథాలు వెలువరించడమే కాకుండా ఎన్నో కావ్యాలకు పీఠికలు రాశారు. అనువాద రచనలు కూడా చేశారు. వానమామలై, కాళోజీ, దాశరథి, నారాయణరెడ్డి ప్రోత్సాహంతో 'తెలంగాణ రచయితల సంఘం' ఏర్పాటు చేసి సాహితీలోక ప్రసిద్ధులైనారు. ఆయనకు1953లో ఆంధ్ర విశ్వ విద్యాలయం అయనకు డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవపట్టాను ప్రదానం చేసింది. 1956లో ఉస్మానియా విశ్వ విద్యాలయం డాక్టర్ ఆఫ్ లాస్ అనే పట్టాను ఇచ్చింది. బూర్గుల 1967, సెప్టెంబర్ 14 న గుండె పోటుతో మరణించారు.

# వైసీపీకి జగనే బలం...సర్వం



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ అన్న ఒక ప్రాంతీయ పార్టీ పదిహేనేళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని పదహారవ ఏట అడుగుపెట్టబోతోంది. 2011 మార్చి 12న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో ఆనాడు వైసీపీ సీనియర్ నేతలు మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్ రావు, తోట గోపాల క్రిష్ణ వంటి వారి సమక్షంలో జగన్ వైసీపీని స్థాపిస్తున్నట్లుగా ఒక కీలక ప్రకటన చేశారు. అలా పుట్టిన వైసీపీ ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని ఈ రోజుకు ఈ స్థితిలో ఉంది. వైసీపీ పుడుతూనే కడప లోక్ సభ పులివెందుల అసెంబ్లీ ఉప ఎన్నికను ఎదుర్కొంది. పార్టీ స్థాపించిన తరువాత కేవలం రెండు నెలలలోనే మేలో జరిగిన ఉప ఎన్నికల్లో జగన్ ఏకంగా ఐదున్నర లక్షల ఓట్ల భారీ తేడాతో ఎంపీగా గెలిచారు. అలాగే పులివెందుల నుంచి వైఎస్ విజయమ్మ కూడా మంచి మెజారిటీతో అసెంబ్లీకి ఎన్నికయ్యారు.

**మినీ కురుక్షేత్రంగా :**
ఆ మరుసటి ఏడాది ఏకంగా 18 అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నికలు జరిగాయి. అలాగే నెల్లూరు ఎంపీ సీటుకు బై పోల్ వచ్చింది. అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో 18కి గానూ 16ని వైసీపీ గెలుచుకుని ఉమ్మడి ఏపీలో సంచలనం రేపింది. అదే విధంగా నెల్లూరు ఎంపీని భారీ మెజారిటీతో గెలిచింది. అలా పార్టీ పెట్టిన ఏడాదిలోనే ఇద్దరు ఎంపీలు 17 మంది ఎమ్మెల్యేలతో ఉమ్మడి ఏపీలో మూడవ అతి పెద్ద పార్టీగా వైసీపీ నిలిచింది. ఇక 2014లో జరిగిన భీకరమైన ఎన్నికల్లో ఏపీలో వైసీపీ 67 ఎమ్మెల్యే సీట్లను 8 ఎంపీ సీట్లను గెలుచుకుంది. అలాగే తెలంగాణ లో ఒక ఎంపీ మూడు ఎమ్మెల్యే సీట్లను గెలుచుకుంది. ఏపీలో 45 శాతం ఓటు షేర్ ని వైసీపీ సాధించడం గొప్ప విశేషంగా రాజకీయ విశ్లేషకులు చెబుతారు.

**అప్రతిహత విజయంతో :**
ఇక 2019లో వైసీపీకి లభించిన విజయం అప్రతిహతమైనదిగా అంతా చెబుతారు. ఒంటరిగా పోటీ చేసిన ఒక పార్టీ 151 సీట్లు దాదాపుగా 50 శాతం ఓటు షేర్ ని సాధించడం 22 ఎంపీ సీట్లను పొందడం అంటే అతి పెద్ద రికార్డుగా చూస్తారు. ఇలా వైసీపీ వరస విజయాలు ప్రతీ ఎన్నికకూ ఓట్ల పరంగా సీట్ల పరంగా ఎదుగుతూ పోయిన తీరు అయితే ఉమ్మడి ఏపీలో విభజన ఏపీలో సైతం సంచలనాలుగానే అంతా చూశారు. అదే తీరున వైసీపీ 2024 ఎన్నికల్లఒ ఘోర పరాభవాన్ని అంతా అదే విధంగా సంభ్రమాశ్చర్యంతో వీక్షించారు. వైసీపీ రాజకీయ చరిత్రలో ఇది అతి పెద్ద కుదుపుగా అంతా చెబుతారు. పీక్స్ కి చేరిన విజయాల నుంచి పాతాళానికి జారిన నేపథ్యం ఇది. అయినా సరే వైసీపీ ఓటు బ్యాంక్ మాత్రం 40 శాతానికి తగ్గకపోవడం అన్నది ఆ పార్టీ అసలైన బలాన్ని సూచిస్తోంది.

**కర్త కర్మ క్రియ :**
ఇక వైసీపీకి కర్త కర్మ క్రియ అన్నీ జగన్ అని వేరేగా చెప్పాల్సింది లేదు, 2009లో కాంగ్రెస్ ఎంపీగా ఉన్న జగన్ తండ్రి మరణాంతరం సొంత రాజకీయ పార్టీ పెట్టి ఒంటరి బాటనే ఎన్నుకున్నారు. ఈ రోజున దేశంలో ఏ రాజకీయ పార్టీతో పొత్తు లేకుండా పోటీ చేస్తూ వస్తున్న ఏకైక పార్టీగా వైసీపీకి రికార్డు ఉంది అంటే అది జగన్ రాజకీయంగా ఆయన వ్యూహంగానూ చూడాలని అంటారు.

**వ్యూహాలు అన్నీ అక్కడే :**
వైసీపీకి సంస్థాగతంగా బలం ఎంత, ఆ పార్టీకి ఉన్న ఇతర బలాలు బలగాలుఎంత అన్న చర్చకు వచ్చినపుడు కొన్ని విషయాలు ఆశ్చర్యంగా ఉంటాయి. మిగిలిన పార్టీల మాదిరిగా వైసీపీలో సభ్యత్వ నమోదు అన్నది పెద్ద కాంపెనియన్ గా చేయడం ఉండదు, పార్టీలో అంతా ఒక సైలెంట్ అది జరిగిపోతుంది. ఇక పదవులు ఎంపిక నియామకాలు అన్నీ అధినాయకుడు జగనే చూస్తారు. పార్టీ విధానాలు వ్యూహాలు అన్నీ కూడా ఆయనే. రెండవ మాట ఉండదు మరో ఆలోచన కూడా ఉండదని చెబుతారు. మరి ఇంతలా ఒక నాయకుడి చుట్టూ కేంద్రీకృతమైన పార్టీ దేశంలో మరొకటి ఉందో లేదో ఎవరికీ తెలియదు. కానీ వైసీపీ మాత్రం ఆ విషయంలో భిన్నమైన పార్టీగానే చూడాల్సి ఉంది.

**టీడీపీతో ఢీ కొడుతూ :**
టీడీపీ వయసు చూస్తే నాలుగున్నర దశాబ్దాలు. దాని అధి నాయకుడు చంద్రబాబు అనేక రాజకీయ యుద్ధాలలో ఆరి తేరిన నాయకుడు. సంస్థాగత బలంలో టీడీపీని కొట్టే వారు ఎవరూ లేరు. కానీ అలాంటి పార్టీతోనే వైసీపీ ఢీ కొడుతోంది అంటే అది రాజకీయంగా విశేషమే అని చెప్పాలి. చంద్రబాబు వ్యూహాలకు ధీటుగా ఆయన ఎత్తుగడలను తట్టుకుని ఆయనకు ఎదురు నిలిచి ఒక పార్టీని ఇన్నేళ్ల పాటు నడిపించడం అంటే మాటలు అసలు కాదు, కానీ జగన్ మాత్రం తానే అన్నీ అయి వైసీపీని నడిపిస్తున్నారు. ఇక్కడ ఒక మాట చెబుతారు. బాబు వ్యూహాలు బయటకు కనిపిస్తాయి, జగన్ వ్యూహాలు కనిపించవని, ఆయన సైలెంట్ గానే స్ట్రాటజీస్ డిజైన్ చేసి అమలు చేస్తారు అని అంటారు.

**అదే పార్టీకి శ్రీరామ రక్ష :**
ఇక మరో విషయం ఏంటి అంటే బాబు పొలిటికల్ స్టైల్ వేరు, జగన్ స్టైల్ వేరు. అయినా ఈ రెండు ప్రాంతీయ పార్టీలు ఏపీ రాజకీయాల్లో తమదైన శైలిలో జనాల్లో ఉన్నాయని అంటున్నారు. జగన్ జనాలను నమ్ముకుంటూ ముందుకు సాగుతారు. ఆయనకు నాయకులు తరువాత విషయంగా చెబుతారు. తనను నమ్మి నడిచే వారితోనే తన పయనం అని ఆయన కచ్చితంగా చెబుతారు. లేని వారితో పని లేదని అంటారు. ఇలా చూస్తే కనుక 16 ఏళ్ల వైసీపీ ప్రస్థానంలో తొలి నుంచి ఉన్న వారు ఎందరు ఉన్నారు అన్నది ఒక ప్రశ్న. అయితే ఎవరూ లేకున్నా వైసీపీ ఓటు బ్యాంక్ అలాగే ఉంది. జగన్ ఇమేజ్ అలాగే ఉంది. అందుకే అదే పార్టీకి శ్రీరామ రక్ష అని నమ్మిన క్యాడర్ వైసీపీలో నిండుగా మొండిగా ఉంటారు. వారికి జగన్ అంటే వీరాభిమానం. అలా హార్డ్ కోర్ ఫ్యాన్స్ అనదగిన వారితోనే వైసీపీ కంచుకోట లాంటి టీడీపీని ఢీ కొడుతూ వస్తోంది. భారీ ఓటమి నుంచి కూడా 2029 ఎన్నికల్లో గెలుపు నాదే అని గట్టిగా పిలుపు వినిపిస్తోంది.

# ఈ సారి వారసులకు షాక్ తప్పదా

**తిరుపతి, మార్చి 12, పెన్ పవర్:**
2024లో ఘోర పరాజయం. ఆల్‌మోస్ట్ వైసీపీ శూన్యం నుంచి తిరిగి బౌన్స్ బ్యాక్ కావాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రయోగాలు చేసే పరిస్థితి లేదంటున్నారట వైసీపీ అధినేత జగన్. నియోజకవర్గాలపై పట్టున్న నేతలు..రాజకీయంగా అనుభవం ఉన్న లీడర్లు, కుల బలం ఉన్న నేతలకే మళ్లీ టికెట్ ఇచ్చే యోచనలో ఉన్నారట. కానీ చాలామంది నేతలు..వయోభారమనో..తాము యాక్టీవ్‌గా ఉన్నప్పుడే వారసులను రాజకీయాల్లోకి తేవాలని ఆశపడుతున్నారట. అందుకే తమ కొడుకు, కూతురుకు టికెట్ కావాలని ఇప్పటినుంచే అర్జీలు పెట్టుకున్నారట. ఇలా వైసీపీలో చాలామంది లీడర్ల వారసులు రాబోయే ఎన్నికల్లో పోటీకి సిద్ధపడుతున్నారట. 2024లోనే టికెట్ ఆశించిగా కొందరికి తప్ప..మిగతా చోట్ల తండ్రులనే రంగంలోకి దించారు. కొన్ని చోట్ల అధినాయకత్వాన్ని మెప్పించి ఒప్పించి కొందరు లీడర్లు తమ వారసులకు టికెట్లు ఇప్పించుకున్నా పరాభావం తప్పలేదు. దాంతో వైసీపీ హైకమాండ్ ఆలోచనలు మారాయని అంటున్నారు. ఈసారి ఎన్నికలు 2024 కంటే ఎంతో ప్రతిష్టాత్మకమైనవి అని వైసీపీ పెద్దలు భావిస్తున్నారట. దాంతో వారసులకు నో చాన్స్ అన్న చర్చ అయితే ఫ్యాన్ పార్టీలో జోరుగా సాగుతోందని చెబుతున్నారు.గత ఎన్నికల్లో తిరుపతి నుంచి భూమన కరుణాకర్‌రెడ్డి తనయుడు భూమన అభినయ్ రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. అలాగే చంద్రగిరి నుంచి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టూ పోటీ చేసినా గెలవలేకపోయారు. దాంతో ఈసారి వీరి ప్లేస్ లో తండ్రులనే పోటీకి రెడీ కావాలని వైసీపీ హైకమాండ్ సూచించిందని అంటున్నారు. ఈ క్రమంలోనే తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తిరిగి యాక్టివ్ అయ్యారని చర్చించుకుంటున్నారు. భూమన పార్టీ నేతలతో కూడా ఎక్కువగా సమావేశాలు జరుపుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని కూడా సంకేతాలు ఇస్తున్నారట.తన కుమారుడికి రాజకీయంగా ఎంతో భవిష్యత్తు ఉందని వైసీపీకి రాబోయే ఎన్నికలు కీలకం కావడంతో తానే పోటీకి సిద్ధమవుతున్నానని చెబుతున్నారట. ఇక మాజీ మంత్రి పేర్ని నాని అయితే మచిలీపట్నంలో తన కుమారుడినే పోటీకి పెట్టాలని చూస్తున్నారట. చెవిరెడ్డి భాస్కరరెడ్డి అదే ఆలోచనలో ఉన్నారని..మరోసారి మోహిత్‌రెడ్డినే బరిలోకి దించబోతున్నారట.వీళ్లు ఆల్రెడీ పోటీ చేసి ఓడిన నేతలు. వాళ్లకు టికెట్ ఇచ్చేందుకు వైసీపీ అధిష్టానం సుముఖంగా లేదంటున్నారు. అలాంటిది మరికొందరు నేతలు రాబోయే ఎన్నికల్లో తమ కూతురు, లేదా కొడుకును బరిలోకి దింపాలనుకుంటున్నారు. అయితే కీలక స్థానాలలో తండ్రులే పోటీ పడితే మంచి రిజల్ట్స్ వస్తాయన్నది వైసీపీ హైకమాండ్ ఆలోచనగా చెబుతున్నారు. ఉత్తరాంధ్రలో బొత్స సత్యనారాయణ తన కుమారుడు బొత్స సందీప్‌ను చీపురుపల్లి నుంచి దించాలని అనుకుంటున్నారట. అలాగే మాజీ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి తన కుమార్తెకి టికెట్ కోరబోతున్నారట. శ్రీకాకుళంలో ధర్మాన సోదరులు తమ కుమారులనే పోటీకి దించే యోచనలో ఉన్నారని తెలుస్తోంది.అయితే జగన్ వీరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారా లేదా అన్నది సస్పెన్స్‌గా మారింది. వారసులకు టికెట్ ఇవ్వడం పక్కన పెట్టి..సీనియర్ లీడర్లను ఎంపీలుగా బరిలోకి దించాలనేది జగన్ ఆలోచనగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికే పోటీ చేసి ఓడిన వారసులకు మళ్లీ టికెట్ దక్కేనా? కొత్తగా వారసులకు సీటు ఇచ్చేందుకు జగన్ ఓకే చెప్తారా? అనేది ఇప్పటికైతే తేలని అంశంగా ఉంది. అయితే అధికారంలో ఉన్న టీడీపీ నెమ్మదిగా సీనియర్లను సైడ్ చేస్తూ యంగ్ లీడర్లకు అవకాశాలు ఇస్తుంటే.. వైసీపీ మాత్రం సీనియర్లను వదలకూడదని పట్టుదలగా ఉండటం ఆసక్తికరంగా మారింది.

# ఏపీకి గుడ్ న్యూస్ చెప్పిన కేంద్రం

**విజయవాడ, మార్చి 12, పెన్ పవర్:**
కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంతో ఏపీకి రిలీఫ్ దక్కింది. జల్‌జీవన్ మిషన్ పథకం అమలు కాలపరిమితిని పెంచడంతో లక్షలాది ఇళ్లకు ప్రయోజనం కలగనుంది. కేంద్రం జలజీవన్ మిషన్ పథకం ద్వారా రాష్ట్రంలోని గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి సౌకర్యం కల్పించి సురక్షితమైన నీటిని అందించాలని టార్గెట్ పెట్టుకుంది. ఏపీలో కూడా ఈ పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని సరిగా అమలు చేయలేదనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫు నుంచి వాటా నిధులు సరిగా ఇవ్వకపోవడంతో జలజీవన్ మిషన్ పనుల్లో ఆలస్యంకాగా.. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ పథకం గడువు 2024కే ముగిసింది. దీంతో జలజీవన్ మిషన్ పథకాన్ని రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు చేయలేని పరిస్థితి ఏర్పడింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు ఈ పథకంపై ఫోకస్ పెట్టారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సమయంలో జలజీవన్ మిషన్ పథకం కాలపరిమితిని 2028 వరకు పెంచాలని కోరారు. తాజాగా కేంద్ర కేబినెట్ ఈ జలజీవన్ మిషన్ పథకం గడువును 2028 వరకు పొడిగించింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది ఇళ్లకు ప్రయోజనం కలగనుంది.2019లో కేంద్రం ఈ జలజీవన్ మిషన్ పథకాన్ని తీసుకొచ్చింది. ఆ సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 95లక్షల 53వేల 169 కుటుంబాలు ఉంటే.. ఏపీలో 32.18శాతం ఇళ్లకు కుళాయి సౌకర్యం ఉంది. అయితే గత ఐదేళ్ల పథకాన్ని సరిగా అమలు చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. కేంద్రం 2019-20 నుంచి 2024-25 వరకు ఈ పథకాన్నిఅమలు చేసేందుకు మొత్తం రూ.16,855 కోట్లు కేటాయించారు.




ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.2,324 కోట్లు డ్రా చేసి రూ.2,316 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత.. ఈ ఏడాది ఫిబ్రవరి 6 వరకు ఏకంగా 71లక్షల 52వేల 326 ఇళ్లకు కుళాయి సౌకర్యం కల్పించారని చెబుతున్నారు.. అంటే దాదాపు 75శాతం వరకు ఇళ్లకు కుళాయిలు అందుబాటులోకి వచ్చినట్లు లెక్క.తాజాగా కేంద్రం జలజీవన్ మిషన్ పథకం కాలపరిమితిని పెంచడంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 24,00,843 ఇళ్లకు ప్రయోజకనం కలగనుంది. ఈ ఇళ్లకు కూడా కుళాయి సౌకర్యం కల్పించే అవకాశం వచ్చింది. ఇప్పుడు ఈ పథకానికి సంబంధించి మిగిలిన నిధులతో.. మిగిలిపోయిన ఇళ్లకు కుళాయి సౌకర్యం కల్పించనున్నారు. దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాలు మాత్రమే 100శాతం గ్రామాల్లో ఇళ్లకు కుళాయి సౌకర్యం కల్పించాయి.. మిగిలిన రాష్ట్రాల్లో పనులు జరుగుతున్నాయి.. దేశవ్యాప్తంగా చూస్తే ఏపీ 29వ స్థానంలో ఉంది. ఇప్పుడు పథకం కాలపరిమితి పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకోవడంతో.. ఈ పనుల్ని మరింత వేగవంతం చేయనున్నారు.

## ఆస్పత్రులలో ఏఐ సాయంతో వైద్య సేవలు

**గుంటూరు మార్చి 12, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం ఏఐ సాయంతో వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. 18 ప్రభుత్వాసుపత్రుల్లో సుమారు 40 పరికరాల ద్వారా పైలట్ ప్రాజెక్టు కింద సరికొత్త ఆవిష్కరణల ద్వారా వైద్య సేవల్లో కీలకమైన స్క్రీనింగ్, కన్ఫర్మేషన్ పరీక్షలు చేస్తున్నారు. ఈ మేరకు తక్కువ సమయంలో వ్యాధులు ఖరారు చేయడం, అత్యుత్తమ వైద్యం అందిచొచ్చని చెబుతున్నారు అధికారులు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏఐ సేవల్ని అందుబాటులోకి తీసుకురావాని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో 18 స్టార్టప్ సంస్థలతో కలిసి వైద్య పరీక్షలు, ఇతర సేవల్ని ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏఐ సేవలతో అతి తక్కువ సమయంలో వ్యాధి నిర్ధారణ, రోగులకు చికిత్స అందించే సమయం కూడా ఆదా అవుతుందంటున్నారు. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రులు.. పార్వతీపురం, రాజానగరం, సిద్ధార్థ మెడికల్ కాలేజీ, సత్తెనపల్లి ప్రాంతీయ ఆసుపత్రి, తెనాలిలోని జిల్లా ఆస్పత్రి, ఇతర చోట్ల పైలట్ ప్రాజెక్టు విధానంలో ఈ సేవల్ని ప్రారంభించారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ ద్వారా వీటి ఫలితాలను విశ్లేషించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదక ఇస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు.వ్యాధుల్ని ప్రాథమిక పరీక్షలతో గుర్తించి.. తక్కువ సమయంలో మెరుగైన వైద్యసేవలు అందించొచ్చు. డాక్టర్లు, పేషెంట్ల మధ్య సంభాషణ రికార్డు చేస్తారు ఏఐ అప్లికేషన్ల సాయంతో పరీక్షలు చేసి ప్రాథమిక దశలోనే సమస్యల్ని గుర్తిస్తున్నారు. ఆయా ఆస్పత్రుల్లో క్యాన్సర్ గుర్తింపు, క్షయను గుర్తించడానికి, షుగర్, కిడ్నీ, థైరాయిడ్, రక్తపరీక్షలు కూడా ఏఐ ఆధారిత పరికరాలతో చేస్తున్నారు. గుండె సమస్యలు, ఐసీయూలో ఉన్నవారికి బీపీ, పల్స్, టెంపరేచర్, ఆరోగ్య పరిస్థితి పర్యవేక్షణ లాంటి మరికొన్ని చోట్లో అందుబాటులో ఉన్నాయి. ఏఐ సాయంతో ఏపీ ప్రభుత్వం వైద్య సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు మంత్రి సత్యకుమార్. రాష్ట్రంలో ఎంపి క చేసిన 18 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒకేసారి 40 పరికరాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు.

విశాఖపట్నంలో 'పింక్ సఖి శారీ వాక్' నిర్వహించారు.. క్యాన్సర్‌పై అవగాహన కలిగించడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ వాక్‌ను రాహుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు బీచ్ రోడ్డులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ వాక్‌కు సినీ నటి, లైఫ్ ఎగైన్ సంస్థ వ్యవస్థాపకురాలు గౌతమి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఈ అవగాహన ర్యాలీలో నగరానికి చెందిన మహిళలు భారీగా పాల్గొన్నారు.

## ఏపీలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు





**నెల్లూరురు మార్చి 12, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే రోజుల్లో పౌర సేవల్ని త్వరగా అందించేందుకు, సంక్షేమ పథకాల అమలుకు ఫ్యామిలీ కార్డు (ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) విధానం అమలు చేయనున్నారు. అమరావతిలో నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులో త్వరలోనే ఫ్యామిలీ కార్డు (స్మార్ట్ కార్డ్) విధానం తీసుకొస్తున్నామన్నారు ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్. ఈ కార్డుతో సంక్షేమ పథకాలను అనుసంధానం చేస్తారని.. ఈ మేరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ కార్డుతో సూపర్ సిక్స్ పథకాలను కనెక్ట్ చేస్తామంటున్నారు. అలాగే రాష్ట్రంలో 20 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శకులకు అనుసంధానం చేశామన్నారు పీయూష్ కుమార్.ఏపీ ప్రభుత్వం ప్రతి కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎఫ్‌బీఎంఎస్)ను తీసుకొస్తోంది.. ఫ్యామిలీ స్మార్ట్ కార్డును జారీ చేయాలని నిర్ణయించింది. ఈ కార్డులో 26 అంశాలతో (ఫ్యామిలీ ఐడీ, ఆధార్ నెంబర్, రైస్ కార్డ్ ఐడీ, విద్యార్హతలు, వృత్తి, మొబైల్ నంబర్, చిరునామా, వ్యవసాయ భూమి, అర్బన్-రూరల్ ప్రాపర్టీ వంటి వివరాలు) డేటాబేస్ రూపొందించనున్నారు. ఇప్పటికే 82 శాతం సమాచారం ఉండగా.. ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటా బేస్ సిద్ధం చేస్తామంటున్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ కార్డు అందించేలా ప్లాన్ చేశారు అధికారులు. ఈ ఫ్యామిలీ కార్డును క్యూఆర్ కోడ్‌తో రూపొందించనున్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన ఆ కుటుంబానికి సంబంధించిన సమాచారం తెలుస్తుంది.. కుటుంబానికి సంబంధించిన పత్రాలను తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు అంటున్నారు.ఏపీ ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలనలో భాగంగా ఈ ఫ్యామిలీ కార్డు ద్వారా అర్హులైన వారందరికీ పథకాలు అందించేందుకు, పౌర సేవలు కూడా సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొన్ని పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఎదురవుతున్న ఇబ్బందులు కూడా ఈ విధానం ద్వారా పరిష్కారం అవుతాయి అంటున్నారు. అంతేకాదు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ ద్వారా కుటుంబ వివరాలు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యేలా ప్లాన్ చేస్తారు. ఈ ఒక్క కార్డు ద్వారానే అన్ని వివరాలూ తెలిసేలా ప్రభుత్వం రూపొందించింది.

## పాదయాత్రకు పక్కా ప్లాన్

**విజయవాడ, మార్చి 12, పెన్ పవర్:** దయాత్రకు గట్టిగానే ప్లాన్ చేస్తున్నారు. గతంలో ఆయన 16 నెలల పాటు పాదయాత్ర చేశారు. ఈసారి మాత్రం 18 నుంచి 20 నెలల సమయం పట్టే అవకాశం ఉంది ఆయన పాదయాత్రకు. అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రారంభించారు. అయితే ఈ పాదయాత్ర మునుపటి మాదిరిగా కొనసాగే అవకాశం లేదు. ఎందుకంటే పాదయాత్ర అంటేనే ఖర్చుతో కూడుకున్న పని. అందుకే ఈసారి ఒక ప్లాన్ చేస్తున్నారట. ముందుగానే అభ్యర్థులను ప్రకటించాలన్న ఆలోచనతో ఉన్నారట. నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందన్న సమాచారం ఉంది. పాదయాత్ర చేసే సమయానికి పునర్విభజన అనేది ఒక కొలిక్కి రానుంది. తద్వారా పెరిగిన నియోజకవర్గాలతో కలిపి అభ్యర్థులను ప్రకటించనున్నారు జగన్మోహన్ రెడ్డి. తద్వారా పాదయాత్ర బాధ్యతలను వారికి కట్టబెట్టనున్నట్లు తెలుస్తోంది.2017లో పాదయాత్ర ప్రారంభించారు జగన్మోహన్ రెడ్డి. పార్టీ ప్లీనరీ నిర్వహించి పాదయాత్ర మొదలు పెడుతున్నట్లు ప్రకటన చేశారు. నవరత్నాలు ప్రకటించారు. పనిలో పనిగా వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ను పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. కానీ ఈసారి మాత్రం ఎటువంటి ప్రకటనలు ఉండవని తెలుస్తోంది. నేరుగా పెరిగిన నియోజకవర్గాలతో కలిపి అభ్యర్థులను ప్రకటించి పాదయాత్ర మొదలు పెడతారని తెలుస్తోంది. తద్వారా ముందుగానే టికెట్ల విషయంలో క్లారిటీ ఇస్తే నేతలు బాగా కష్టపడుతారు అనేది ఒక అంచనాగా తెలుస్తోంది. అభ్యర్థులను ముందుగా ప్రకటించడం ద్వారా ఒక ఊపు తేవాలని చూస్తున్నారు. పైగా పాదయాత్రకు ఎటువంటి అడ్డంకులు ఉండకుండా చేయాలని భావిస్తున్నారు.2023లో లోకేష్ పాదయాత్ర కొనసాగింది. ఆ వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలో ఉంది. లోకేష్ పాదయాత్రకు ఎన్ని అడ్డంకులు సృష్టించాలో అన్ని సృష్టించారు. అడ్డుకునే ప్రయత్నం చేశారు. చివరకు పాదయాత్రలో మైకులను సైతం తీసుకుపోయారు. వాహనాలను సైతం పట్టుకుపోయారు. పోలీసుల రక్షణ లేకుండా పోయింది. చివరకు లోకేష్ పాదయాత్రను మరింత డామేజ్ చేసేందుకు సోషల్ మీడియా సైన్యం కూడా రంగంలోకి దిగింది. ఎవరు టిడిపి నేతలు తెలుసుకోలేని పరిస్థితి అప్పట్లో పాదయాత్ర లో ఉండేది. దానిని తట్టుకొని పాదయాత్రను పూర్తి చేయగలిగారు లోకేష్. ఇప్పుడు కచ్చితంగా ఆ పరిస్థితి జగన్మోహన్ రెడ్డికి సైతం ఉంటుంది. మరి ఆయన తట్టుకొని నిలబడగలరా అన్నది చూడాలి.కళ్ళముందు బలమైన అధికారపక్షం ఉంది. గతంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి విడివిడిగా ఉండేవి. తెలుగుదేశం ప్రభుత్వం సైతం జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర విషయంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. దారి పొడవునా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చెట్లు, విద్యుత్ స్తంభాలు, ప్రభుత్వ ఆస్తులకు పార్టీ రంగులు వేసేసారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రకు గుర్తుగా వైసీపీ రంగులు వీరవిహారం చేశాయి. అయితే ఈసారి అది వర్కౌట్ కాదు. ఎందుకంటే ప్రభుత్వం ఖచ్చితంగా దృష్టి పెడుతుంది. కేంద్ర ప్రభుత్వం సైతం కలుగజేసుకుంటుంది. అటువంటి చర్యలను మూడు పార్టీలు అడ్డుకుంటాయి కూడా. అందుకే ఈసారి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర పై అనేక రకాల సందేహాలు ఉన్నాయి. వీటికి తోడు అనేక పాత కేసులు తెరపైకి వస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ చాలా ఇబ్బందికరమే. మరి జగన్మోహన్ రెడ్డి ఎలా అధిగమిస్తారో చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## జమ్మూ కాశ్మీర్ మాజీ సీఎంపై హత్యాయత్నం



కశ్మీర్: జమ్మూ కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాపై బుధవారం రాత్రి జమ్మూలోని రాయల్ పార్క్‌లో జరిగిన ఒక వివాహ వేడుకలో హత్యాయత్నం జరిగింది. కమల్ సింగ్ జామ్వాల్ అనే 65 ఏళ్ల వ్యక్తి, ఫరూక్ అబ్దుల్లాను సమీపం నుంచి గన్‌తో కాల్చేందుకు ప్రయత్నించాడు. అయితే, చివరి నిమిషంలో ఆయన భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, అతను గత 20 ఏళ్లుగా ఈ క్షణం కోసం ఎదురుచూస్తున్నానని చెప్పినట్లు తెలిపారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది.

## ముందు నిపుణుల కమిటీ వేయండి



న్యూఢిల్లీ : కేవలం 8వ తరగతి కాకుండా అన్ని తరగతుల పాఠ్యపుస్తకాలను సమీక్షించాలని ఎన్‌సీఈఆర్‌టీని ఆదేశించామన్న కేంద్రం వివరణపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పాఠ్యపుస్తకాలను సమీక్షించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి వుండాల్సిందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పంచోలిలతో కూడిన ధర్మాసనం బుధవారం వ్యాఖ్యానించింది. పాఠ్య పుస్తకాలను సమీక్షించాలని ఎన్‌సిఇఆర్‌టిని ఆదేశించడానికి బదులుగా నిపుణుల కమిటీని నియమించే వుండాల్సిందని కేంద్రాన్ని ఉద్దేశించి ధర్మాసనం పేర్కొంది. 'న్యాయవ్యవస్థలో అవినీతి' అనే శీర్షికతో ఎనిమిదో తరగతి సాంఘికశాస్త్రంలో ఒక అధ్యాయాన్ని ముద్రించడం పట్ల సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. సవరించిన అధ్యాయం తిరిగి రాయబడిందని ఎన్‌సిఇఆర్‌టి తన అఫిడవిట్‌లో పేర్కొనడం పట్ల బెంచ్ స్పందిస్తూ, ఆ అధ్యాయాన్ని ఎవరు రాశారని ప్రశ్నించింది. ఫ్యాకల్టీ సభ్యుల్లో తమకు నిపుణులు వున్నారని, వారు రాశారని చెబుతున్నారు, అంటే ఇది ఇప్పటికే పూర్తయింది, కానీ ఆ సవరించిన అధ్యాయాన్ని నిపుణుల కమిటీ సమీక్షించనిదే దాన్ని ప్రచురించవద్దని కోర్టు ఆదేశించింది. 'అసలు మీరు చెబుతున్న నిపుణులు ఎవరు? ఆ అధ్యాయాన్ని ఎవరు, ఎలా రూపొందించారు? మేం ఇంతలా ఆందోళన వ్యక్తం చేసిన తర్వాత కూడా ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ఇంత సంక్షిప్త ప్రకటనతో ఇలా కోర్టు ముందుకు వచ్చిన పద్ధతి సరైనదేనా?' అని జస్టిస్ జోమాల్యా బాగ్చి ప్రశ్నించారు. మాజీ సీనియర్ న్యాయమూర్తి, ప్రముఖ విద్యావేత్త, లీగల్ ప్రాక్టిషనర్‌లతో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి వారితో ఈ సమీక్ష జరపాల్సిందిగా కోర్టు ఈ సందర్భంగా ఆదేశించింది.

## 'నిష్పాక్షిక' ధర్మాసనానికి ఎక్సైజ్ పాలసీ కేసును బదిలీ చేయండి



న్యూఢిల్లీ : ఎక్సైజ్ పాలసీ కేసును నిష్పాక్షిక ధర్మాసనానికి బదిలీ చేయాలని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అరవింద్ కేజ్రీవాల్, ఈ కేసులోని మరికొంత మంది నిందితులు లేఖ రాసారు. ఈ విషయాన్ని ఆప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ధర్మాసనం నుంచి ఈ కేసు బదిలీ చేయాలని కేజ్రీవాల్, మనీష్ సిసోడియా తదితర నేతలు ఈ లేఖలో కోరినట్లు తెలిపింది. జస్టిస్ శర్మ పక్షపాతంతో వ్యవరిస్తున్నారని ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయకు రాసిన లేఖలో ఆప్ నాయకులు విమర్శించారు. ఎక్సైజ్ పాలసీ కేసులో కేజ్రీవాల్‌తో సహా 22 మందిని సిబిఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే దీన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టును సిబిఐ ఆశ్రయించింది. ఈ నెల 9న పిటిషన్ విచారణను ప్రారంభించిన ఢిల్లీ హైకోర్టు దీనిపై కేజ్రీవాల్, ఇతరుల స్పందనను కోరింది. తదుపరి విచారణను ఈ నెల 16కు వాయిదా వేసింది. దీంతో ఈ కేసు విచారణ చేసిన సిబిఐ అధికారులపై దిగువ కోర్టు చేసిన పరిశీలనను కూడా జస్టిస్ శర్మ పక్కన పెట్టారు.

## గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్నవాళ్లను రక్షించేందుకు మృత్యువుతో పోరాడిన దీపికా అధానా

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఎగిసిపడుతున్న వేళ.. తన ప్రాణాలకు తెగించి మాతృభూమి కోసం నిలబడింది ఒక 23 ఏళ్ల పైలెట్. అగ్రరాజ్యం అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు చేస్తుండగా...గగనతలం ప్రమాదకరంగా మారింది. ఈక్రమంలోనే యూఏఈలో చిక్కుకుపోయిన 169 మంది భారతీయులను సురక్షితంగా స్వదేశానికి చేర్చి వార్తల్లో నిలిచారు ఫరీదాబాద్‌కు చెందిన పైలట్ దీపికా అధానా. అయితే ఆమె ఈ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టడానికి ముందు తన తల్లికి చేసిన మెసేజ్ ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది.ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లో పైలట్‌గా పని చేస్తున్న 23 ఏళ్ల దీపికకు మార్చి 6వ తేదీ ఉదయం 10.15 గంటలకు హఠాత్తుగా ఒక పిలుపు వచ్చింది. యూఏఈలోని రాస్ అల్ ఖైమాకు వెళ్లి అక్కడ చిక్కుకున్న 169 మంది భారతీయులను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని పైఅధికారులు సూచించారు. అయితే నిజానికి ఆ విమానాన్ని ఆమె స్నేహితురాలు నడపాల్సి ఉంది. కానీ చివరి నిమిషంలో ఆ బాధ్యత దీపికపై పడింది. యుద్ధం భీకరంగా సాగుతున్న ప్రాంతం కావడంతో.. బయలుదేరే ముందు ఆమె తన తల్లితో అన్న మాటలు గుండెల్ని పిండేస్తున్నాయి. "అమ్మా.. బై బై. నేను తిరిగి వస్తానో లేదో కూడా నాకు తెలియదు" అని చెప్పి ఆమె విమానం ఎక్కారు. కెప్టెన్ జస్విందర్ కౌర్ నేతృత్వంలోని ఆరుగురు మహిళా సిబ్బందితో ఈ విమానం రాస్ అల్ ఖైమా చేరుకుంది. అయితే తిరుగు ప్రయాణంలో ఒక భయంకరమైన క్షణం ఎదురైంది. టేకాఫ్ అయిన కొద్ది సేపటికే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో విమానానికి సంబంధాలు తెగిపోయాయి. నెట్‌వర్క్ వైఫల్యంతో ఏం జరుగుతుందో అర్థం కాని స్థితిలో కూడా ధైర్యం కోల్పోకుండా దీపికా బృందం విమానాన్ని నడిపింది. కొద్ది నిమిషాల తర్వాత మళ్లీ కమ్యూనికేషన్ పునరుద్ధరించబడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# కిమ్ జోంగ్ ఉన్ అమెరికాకు కఠిన హెచ్చరిక



పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు ప్రపంచ రాజకీయాల్లో కొత్త ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తర కొరియా తన వైఖరిని స్పష్టంగా ప్రకటించింది. అమెరికా, దక్షిణ కొరియా కలిసి నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలను ఉత్తర కొరియా తీవ్రంగా ఆందోళనతో గమనిస్తోంది. అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఈ విన్యాసాలు తమపై దాడికి సిద్ధమవ్వడానికి కాదని, అయినప్పటికీ అమెరికా ఇలాగే దూకుడుగా కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు.ఇరాన్‌లో సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత మొజ్తబా ఖమేనీ సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఉత్తర కొరియా ఈ నిర్ణయానికి మద్దతు తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్ చర్యలను కఠినంగా విమర్శిస్తూ, ఇరాన్ ప్రజల నిర్ణయాన్ని గౌరవిస్తున్నట్టు ప్రకటించింది.తాజాగా ఉత్తర కొరియా తన సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శించింది. 'చో హ్యోన్' యుద్ధ నౌక నుంచి క్రూయిజ్ మిస్సైల్ విజయవంతంగా ప్రయోగించబడింది. ఈ ప్రయోగాన్ని కిమ్ జోంగ్ ఉన్ తన కుమార్తె జు ఏతో కలిసి ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ క్రూయిజ్ మిస్సైల్ సముద్రం నుంచి ఉపరితల లక్ష్యాలను ధ్వంసం చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. మూడు గంటల పాటు నిరంతర లక్ష్యాలపై దాడి చేయగల సామర్థ్యం కూడా ఉంది.ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైన్యాలలో ఉత్తర కొరియా ఒకటి. ఈ దేశానికి 50-100 వరకు అణ్వాయుధాలు ఉన్నాయి. అదనంగా, అమెరికాను నేరుగా లక్ష్యంగా చేసుకునే ఊలిజీబనీనిణ-18 ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్ కూడా దొరుకుతుంది. అలాగే, రాడార్‌లకు కనిపించని హైపర్‌సోనిక్ మిస్సైల్ సాంకేతికత కూడా ఉత్తర కొరియాకు ఉంది. రష్యా, చైనా వంటి దేశాల మద్దతు కూడా ఉత్తర కొరియాకు ఉన్నట్టు అంతర్జాతీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# గూగుల్, ఐబీఎం సహా వాటన్నింటిని టార్గెట్ చేస్తాం





పశ్చిమాసియాలో యుద్ధం మరింత తీవ్రమవుతున్న వేళ అమెరికా, ఇజ్రాయెల్ ఆర్థిక మూలాలపై ఇరాన్ దాడులు చేస్తోంది. ఇవి మరింత తీవ్ర చేస్తామని హెచ్చరికలు కూడా చేస్తోంది.ఇదిలావుంటే అమెరికా-ఇజ్రాయెల్ దాడులు.. ఇరాన్ ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ మరో బాంబు పేల్చింది. అమెరికా, ఇజ్రాయెల్‌తో సంబంధం ఉన్న ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, ఐటీ కంపెనీలను లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. కీలక అమెరికా సంస్థలతో సంబంధం ఉన్న బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, ఐటీ కంపెనీల జాబితాను ప్రచురించిన ఇరాన్ అనుబంధ మీడియా తస్నిమ్ న్యూస్ ఏజెన్సీ... వీటికి ఇజ్రాయెల్‌తో సంబంధాలు ఉన్నాయని, సైనిక ప్రయోజనాల కోసం సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించకుంటున్నాయని ఆరోపించింది. ఈ కంపెనీలకు చెందిన కార్యాలయాలు, మౌలిక సదుపాయాలను ఇరాన్ కొత్త లక్ష్యాలుగా అభివర్ణించింది. ప్రాంతీయ సంఘర్షణ 'మౌలిక సదుపాయాల యుద్ధం'గా విస్తరిస్తున్న కొద్దీ, ఇరాన్ చట్టబద్ధంగా భావించే లక్ష్యాల పరిధి కూడా పెరుగుతుందని తస్నిమ్ తెలిపింది. గూగుల్, మైక్రోసాఫ్ట్, పలాంటిర్, ఐబీఎం, ఎన్విడియా, ఒరాకిల్ వంటి కంపెనీల

పేర్లు ఈ నివేదికలో ఉన్నాయి. ఈ సంస్థలకు అనుబంధంగా కార్యాలయాలు, క్లౌడ్-సర్వీస్ మౌలిక సదుపాయాలు ఇజ్రాయెల్ నగరాలు, కొన్ని గల్ఫ్ దేశాలలో ఉన్నాయని పేర్కొంది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా ఆయతుల్లా అలీ ఖమేనీ కుమారుడు మొజ్తాబా ఖమేనీని ఎన్నుకున్న విషయం తెలిసిందే. ఆయన ఎంపికపై డొనాల్డ్ ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు, ఇరాన్ డ్రోన్ దాడులను తీవ్రతరం చేసింది. తాజాగా దుబాయి ఇంటర్నేషన్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో

డ్రోన్ దాడి జరిగినట్టు స్థానిక అధికారులు తెలిపారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇజ్రాయెల్‌పైపు ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు దూసుకొస్తున్నాయి. అయితే భారీ వార్‌హెడ్‌లతో ఉన్న క్షిపణులను ఇరాన్ ప్రయోగిస్తోంది. క్లస్టర్ బాంబులు గాల్లోనే పేలిపోయి.. దాదాపు కొన్ని కిలోమీటర్ల వ్యాసార్థంలో చెల్లాచెదురుగా పడిపోతున్నాయి. ఈ బాంబులను అడ్డుకోవడం ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలకు పెను సవాలుగా మారాయి. గతేడాది జూన్‌లో 12 రోజుల జరిగిన యుద్ధంలోనూ ఈ క్లస్టర్ బాంబులను ఇరాన్ వినియోగించిందనే ఆరోపణలు వచ్చాయి. కనీసం మూడుసార్లు ఇజ్రాయెల్‌పైకి ఇరాన్ ప్రయోగించిందని మానవహక్కుల సంస్థ అమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది. ఫొటోలు, వీడియోల ఆధారంగా ఈ విషయాన్ని వెల్లడించింది.

# భారత్‌కు వస్తున్న ఆయిల్ ట్యాంకర్‌పై క్షిపణి దాడి



ఇరాన్ అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ జలమార్గంలో దాడులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే హర్మూజ్ జలసంధిలో భారత్‌కు వస్తున్న థాయ్‌లాండ్ ఆయిల్ ట్యాంకర్‌పై దాడి జరిగింది. ఒమన్ తీర సమీపంలో థాయ్ నౌక మయూరీ నారీ బ్యాంకాక్‌ను ఇరాన్ క్షిపణులు ఢీకొన్నాయి. ఈ ఘటనతో థాయ్‌లాండ్ నౌకదళం, అంతర్జాతీయ తీరప్రాంత అధికారులు అప్రమత్తమయ్యారు. తక్షణమే అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షిపణి దాడితో నౌక మంటల్లో చిక్కుకుని, సగం కాలిపోయింది. 20 మంది సిబ్బందిని కాపాడమని, మరో ముగ్గురు గల్లంతయ్యారని అధికారులు తెలిపారు. హర్మూజ్ జల సంధిలో థాయ్‌లాండ్ నౌకపై తామే క్షిపణితో దాడిచేసినట్టు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తాజాగా ప్రకటించింది. మయూరీ నారీ బ్యాంకాక్ ట్యాంకర్ గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు వస్తుండగా ఘటన చోటుచేసుకుంది. మరో రెండు నౌకలు కూడా భద్రతా కారణాలతో హర్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయాయి. ఇజ్రాయెల్-అమెరికా దాడులతో హర్మూజ్ జల సంధిను మూసివేసిన ఇరాన్.. ఆయిల్ సరఫరాను అడ్డుకుంటోంది. దీంతో చమురు, గ్యాస్ రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడి.. అంతర్జాతీయ మార్కెట్‌లను తీవ్రంగా ప్రభావితం చేసింది. ఈ నేపథ్యంలో థాయ్‌లాండ్ కార్గో నౌకపై దాడి మరింత భయాందోళనకు గురిచేస్తోంది.థాయ్ కంపెనీ ప్రీసియస్ షిప్పింగ్‌కు చెందిన మయూరీ నారీ బ్యాంకక్ నౌక.. యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్‌లో ఖలీఫా ఓడ రేవులో క్రూడాయిల్ నింపుకుని.. గుజరాత్‌లో కాండ్లా రేవుకు హర్మూజ్ జల సంధి గుండా బుధవారం బయలుదేరింది. అక్కడ నుంచి ప్రయాణం మొదలైన కాసేపటికే ఇరాన్ దాడి చేసింది. ఈ దాడిలో నౌక ధ్వంసమైన ఫోటోలను రాయల్ థాయ్‌లాండ్ నేవీ షేర్ చేసింది.

# కేంద్ర ఎన్నికల కమిషన్, బెంగాల్ సీఎం మధ్య వివాదం.. సుప్రీంకోర్టు వార్నింగ్

న్యూఢిల్లీ: పశ్చిమ్ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తొలగించిన పేర్ల నిర్ధారణకు నియమించిన న్యాయ అధికారులను 'అనుమానించవద్దని' బెంగాల్ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం, వ్యక్తిగత పిటిషనర్లను సుప్రీం కోర్టు మంగళవారం తీవ్రంగా హెచ్చరించింది.ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించిన ఓటర్ల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు పరిశీలన కోసం న్యాయాధికారులను నియమించామని, ఇప్పటికే విధుల్లో ఉన్న వారిని ఇబ్బందులకు గురిచేయవద్దని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎస్ఐఆర్‌పై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేస్తూ.. ఈసీపై యుద్ధం ప్రకటించిన సంగతి తెలిసిందే. స్వయంగా సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ వాదనలు వినిపించారు. ''న్యాయాధికారుల పనితీరును ప్రశ్నించే ధైర్యం చేయొద్దు... వారి నుంచి మీరు ఇంకా ఎలాంటి త్యాగాలను కోరుకుంటున్నారు.. పశ్చిమ్ బెంగాల్‌లో డిలీట్ చేసిన ఓటర్లకు సంబంధించిన అంశాలపై పనిచేస్తున్నారు.. దీనిని నేను ఏమాత్రం సహించను" అని విచారణ సందర్భంగా పిటిషనర్లపై ప్రధాన న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సవరణ ప్రక్రియకు సంబంధించి కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని ఎన్నికల సంఘాన్ని కూడా ధర్మాసనం ఆదేశించింది. కోర్టు నియమించిన న్యాయ అధికారుల నిర్ణయాలపై సందేహాలు లేవనెత్తిన పిటిషన్‌పై తీవ్రంగా స్పందిస్తూ.. వారి నిర్ణయాలను గౌరవించాలని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పష్టం చేశారు. అప్పీళ్లను నిర్వహించే న్యాయ అధికారులకు తగిన సహాయం, రవాణా సౌకర్యాలను కల్పించాలని ఎన్నికల సంఘం, మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.

విచారణ సందర్భంగా, ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాజ్యంలో ఇరుపక్షాల ప్రవర్తనపై ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇరుపక్షాల నిజాయితీని మేం అనుమానిస్తున్నాం' అని ఆయన అన్నారు. న్యాయ అధికారులల ప్రశ్నిస్తూ తాజా పిటిషన్‌ను ఎవరు దాఖలు చేశారో స్పష్టం చేయాలని పార్టీలను కోరారు. పిటిషనర్ల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ-న్యాయవాది కళ్యాణ్ బెనర్జీ ఇలాంటి ప్రశ్నలు లేవనెత్తిన కొత్త పిటిషన్ గురించి తమకు తెలియదని చెప్పడంతో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. పశ్చిమ్ బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియలో తొలగింపులకు వ్యతిరేకంగా వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, ద

మాజీ న్యాయమూర్తులతో అప్పిలేట్ ట్రైబ్యునల్స్ ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. జ్యుడీషియల్ అధికారులు ద్వారా తిరస్కరణకు గురైన ఓటర్లు.. ఈ ట్రైబ్యునల్స్‌ను కూడా ఆశ్రయించవచ్చు. ఎస్ఐఆర్ ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం, ఈసీ మధ్య వివాదం నేపథ్యంలో బెంగాల్, పొరుగున ఉన్న ఒడిశా, ఝార్ఖండ్‌లోని న్యాయ అధికారులను నియమించాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే.

# అమెరికాలో రిలయన్స్ భారీ పెట్టుబడి




దేశీయ అతిపెద్ద సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ అమెరికాలో భారీ పెట్టుబడి పెట్టనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ టెక్సాస్‌లోని బ్రౌన్స్‌విల్లే పోర్ట్‌లో 50 ఏళ్లలోనే మొట్టమొదటి కొత్త చమురు శుద్ధి కర్మాగారాన్ని నిర్మించడంలో భాగస్వామిగా ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం 300 బిలియన్ డాలర్ల ఒప్పందం ఖరారైనట్టు ఆయన స్పష్టం చేశారు. కొత్త శుద్ధి కర్మాగారం ద్వారా అమెరికాలో ఇంధన ఉత్పత్తి పెరగడంతో పాటు జాతీయ భద్రతను పటిష్టం చేస్తుందని ట్రంప్ చెప్పారు. ఇందులో భారత్‌కు చెందిన రిలయన్స్ సంస్థ పెట్టుబడులు పెట్టినందుకు ధన్యవాదాలు చెబుతున్నట్టు వెల్లడించారు. కొత్త రిఫైనరీ ఏర్పాటు ద్వారా వేలాది ఉద్యోగాల సృష్టి జరుగుతుంది. ఆర్థికవ్యవస్థకు భారీ లాభాలు వస్తాయి. ముఖ్యంగా అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు తక్కువ పన్నులు ఆఫర్ లాంటి అమెరికా ఫస్ట్ విధానాలతోనే సాధ్యమైందని ట్రంప్ వివరించారు. అంతేకాకుండా ఈ చమురు శుద్ధి కర్మాగారం ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్రమైన రిఫైనరీగా ఉంటుందని, ఇతర దేశాలకు ఎగుమతులు చేసేందుకు కూడా ఉపయోగపడుతుందని ట్రంప్ పేర్కొన్నారు.

## ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి విలువ.. డాలర్‌తో పోలిస్తే రూ.92.35కు పతనం



పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా భారత ఆర్థిక వ్యవస్థకు కోలుకోలేని దెబ్బ తగిలింది. అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రూపాయి విలువ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఇవాళ ఫారెక్స్ మార్కెట్ ప్రారంభం నుండే ఒత్తిడికి లోనైన రూపాయి, అమెరికన్ డాలర్‌తో పోలిస్తే ఏకంగా రూ. 92.35 వద్దకు చేరుకుని రికార్డు స్థాయి పతనాన్ని నమోదు చేసింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న చమురు సంక్షోభం (రాతిశ్రీ అతీతిబతిబ) రూపాయి పతనానికి ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతుండటంతో, భారత్ తన దిగుమతుల కోసం భారీగా డాలర్లను వెచ్చించాల్సి వస్తోంది. దీనివల్ల డాలర్‌కు డిమాండ్ పెరిగి, రూపాయి విలువ భారీగా క్షీణించింది. చమురుతో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు, యంత్రాలు, ఇతర దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు గణనీయంగా పెరగనున్నాయి. మరోవైపు రూపాయి బలహీనపడటంతో రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంది. ఈ తాజా పరిణామం సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టనుంది.

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు



గోల్డ్ లవర్స్‌కు భారీ ఊరట లభించింది. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా కిందికి దిగివచ్చాయి. ఈ మేరకు ఇవాళ హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నేడు 24 క్యారెట్ల స్వచ్ఛమైన మేలిమి బంగారం ధర 10 గ్రాములపై రూ. 1,090 తగ్గింది. దీంతో ప్రస్తుతం ధర రూ. 1,62,220 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా, సాధారణంగా ఆభరణాల తయారీకి వాడే 22 క్యారెట్ల బంగారం ధర కూడా భారీగా పడిపోయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారంపై రూ. 1,000 తగ్గి, ప్రస్తుతం రూ. 1,48,700 వద్ద ట్రేడ్ అవుతోంది. బంగారం కంటే వెండి ధరలో భారీ మార్పు కనిపించింది. కేజీ వెండిపై ఏకంగా రూ. 10 వేల మేర ధర తగ్గడం విశేషం. దీంతో మార్కెట్‌లో కిలో వెండి ధర రూ. 2,90,000 కి చేరింది. హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నం, వరంగల్ వంటి ప్రాంతాల్లో కూడా ఇవే ధరలు దాదాపుగా అమల్లో ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, రూపాయి విలువలో మార్పుల కారణంగానే బంగారం, వెండి ధరలు భారీగా తగ్గినట్లుగా మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## పిల్లల కోసం వాట్సాప్ కొత్త ఫీచర్





వాట్సాప్.. ప్రపంచంలోని నలుమూలల ఈ యాప్ పాకేసింది. మొబైల్ వాడే ప్రతి ఒక్కరు ఈ వాట్సాప్ వాడుతున్నారు. ఎలాంటి సమాచారం అయినా, వీడియో సందేశాలు అబ్బో ఇలా చెప్పుకుంటూ పోతే చాలా వాటిని క్షణాల్లోనే ఇతరులకు పంపిస్తున్నారు. అవతలి వ్యక్తి విదేశాల్లో ఉన్న కూడా క్షణాల్లోనే పంపిన సమాచారం వాళ్లకు అందుతోంది. దీంతో వాట్సాప్ కు ఆదరణ విపరీతంగా పెరిగింది. దానికి తగ్గట్టుగానే రకరకాల ఫీచర్స్ తీసుకువస్తుంది వాట్సాప్. జనాలకు అవసరమైన అన్ని ఫీచర్స్ ఇప్పటికే తీసుకువచ్చింది. చిన్న పిల్లల కోసం అదిరిపోయే ఫీచర్ తీసుకువచ్చింది వాట్సాప్. 13 సంవత్సరాల లోపు పిల్లలకు యాడ్స్ లేకుండా కేవలం ఫోన్స్, మెసేజ్లు యాక్సిస్ ఉండేలా పేరెంటు లింక్డ్ అకౌంట్ ఫీచర్ తీసుకువచ్చింది వాట్సాప్. ఈ అకౌంటు సెటప్ చేసేటప్పుడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత పిల్లల ఫోన్ తో పేరెంట్స్ అకౌంట్ లింక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. వాళ్లు కాంటాక్ట్స్ ను యాడ్, బ్లాక్ లేదా రిపోర్ట్ చేసినా పేరెంట్స్ కు నోటిఫికేషన్ వస్తుంది. ఆరు డిజిట్ పిన్ తో పిల్లలు అకౌంట్ సెట్టింగ్స్ మార్చే యాక్సిస్ తల్లిదండ్రులకు మాత్రమే కల్పించింది వాట్సాప్.

## భారం కానున్న కెనరా బ్యాంక్ రుణాలు




ప్రభుత్వ రంగ కెనరా బ్యాంకు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్స్(ఎంసీఎల్ఆర్)ను పెంచుతున్నట్టు ప్రకటించింది. ముఖ్యంగా రెండు నుంచి మూడేళ్ల కాలానికి సంబంధించి రుణాల రేట్లను 10 బేసిస్ పాయింట్లు పెంచాలని నిర్ణయించినట్టు బ్యాంకు తెలిపింది. బ్యాంకు స్టాక్ ఎక్స్ఛేంజీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొన్న దాని ప్రకారం, 2 ఏళ్ల ఎంసీఎల్ఆర్‌ను గురువారం నుంచి 8.95 శాతానికి సవరించింది. గతంలో ఇది 8.85 శాతంగా ఉండేది. అలాగే, మూడేళ్ల కాలానికి సంబంధించి ఎంసీఎల్ఆర్‌ను 8.90 శాతం నుంచి 9 శాతానికి పెంచినట్టు వెల్లడించింది. బ్యాంకు రుణాల పోర్ట్‌ఫోలియోలో దాదాపు సగం రుణాలు ఎంసీఎల్ఆర్‌తో అనుసంధానం చేశారు. దీనివల్ల కస్టమర్లు తీసుకునే వాహన, వ్యక్తిగత, గృహ వంటి రిటైల్ రుణాలపై ప్రభావం ఉంటుంది. కాగా, గతేడాది డిసెంబర్ నాటికి కెనరా బ్యాంక్ రుణ పోర్ట్‌ఫోలియో రూ. 11.92 లక్షల కోట్లుగా ఉంది.

# ఏఐ మౌలిక వసతులకు లక్షల కోట్ల డాలర్లు!



మానవ చరిత్రలోనే అతిపెద్ద మౌలిక సదుపాయాల నిర్మాణానికి కృత్రిమ మేధ (ఏఐ) నాంది పలుకుతోందని, ఇందుకు లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరమని, నైపుణ్యం కలిగిన బ్లూకాలర్ సిబ్బందికి (కార్మికుల) భారీ డిమాండ్ ఏర్పడుతుందని ఎన్‌విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ అన్నారు. ఏఐ అనేది ఒక అప్లికేషన్ లేదా మోడల్‌గా ఉండే స్థాయిని దాటి.. విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఒక తప్పనిసరి మౌలిక సదుపాయంగా పరిగణించాలని ఆయన పేర్కొన్నారు. 'మనం ఈ నిర్మాణాన్ని ఇప్పుడే ప్రారంభించాం. ఇప్పటికి కొన్ని వందల బిలియన్ డాలర్లు మాత్రమే ఈ రంగంలోకి వచ్చాయి. ఇంకా లక్షల కోట్ల డాలర్లతో మౌలిక సదుపాయాలు నిర్మించాల్సి ఉంది. ప్రపంచవ్యాప్తంగా చిప్ ఫ్యాక్టరీలు, కంప్యూటర్ అసెంబ్లీ ప్లాంట్లు, ఏఐ ఫ్యాక్టరీల నిర్మాణాన్ని మనం చూస్తున్నాం' అని హువాంగ్ తెలిపారు. ఏఐను ఇంధనం, చిప్స్, మౌలిక సదుపాయాలు, మోడల్స్, అప్లికేషన్స్‌తో కూడిన 'ఫైవ్ లేయర్ కేక్'గా హువాంగ్ అభివర్ణించారు. సంప్రదాయ సాంకేతిక రంగానికి వెలుపల ఈ భారీ పారిశ్రామిక మార్పు, గణనీయ సంఖ్యలో ఉపాధి అవకాశాలు సృష్టిస్తుందని హువాంగ్ స్పష్టం చేశారు. ఏఐ ఫ్యాక్టరీలకు ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, పైప్ ఫిట్టర్లు, స్టీల్ వర్కర్లు, నెట్‌వర్క్ టెక్నీషియన్లు, ఇన్‌స్టాలర్‌లు, ఆపరేటర్లు అవసరమని తెలిపారు. ఇవి నైపుణ్యం కలిగిన, మంచి వేతనం ఇచ్చే ఉద్యోగాలని, వీటికి ఎంతో కొరత ఉందన్నారు. ఈ మార్పుల్లో భాగస్వామ్యం కావడానికి కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

# యుద్ధం ఆపేందుకు షరతులు విధించిన ఇరాన్



అమెరికా, ఇజ్రాయెల్‌తో జరుగుతున్న ఘర్షణకు ముగింపు పలకడానికి ఇరాన్ మూడు కీలక షరతులను ముందుకు తెచ్చింది. ఒకవైపు శాంతి కోసం ప్రతిపాదనలు చేస్తూనే, మరోవైపు తమపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని ఆ దేశ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఈ షరతులను ప్రకటించారు. రష్యా, పాకిస్థాన్ దేశాధినేతలతో మాట్లాడిన తర్వాత ఆయన ఈ పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్, అమెరికా ప్రారంభించిన ఈ యుద్ధాన్ని ముగించాలంటే ఇరాన్ చట్టబద్ధమైన హక్కులను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా యుద్ధం వల్ల జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని, భవిష్యత్తులో తమ దేశంపై మళ్లీ దాడులు జరగకుండా కఠినమైన అంతర్జాతీయ హామీలు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మూడు షరతులకు అంగీకరిస్తేనే శాంతి సాధ్యమని ఆయన తేల్చిచెప్పారు.

## ఇతర దేశాలను యుద్ధంలోకి లాగే ఉద్దేశం లేదు

ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా మధ్య సాగుతున్న యుద్ధంతో పశ్చిమాసియా మొత్తం అల్లకల్లోలం అవుతుంది. ఇజ్రాయెల్-అమెరికా సంయుక్త దాడులు, ఇరాన్ ప్రతీకారంతో గల్ఫ్ దేశాల్లో పరిస్థితి రోజు రోజుకూ దిగజారుతున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్.. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇరువురు ప్రస్తుత పరిణామాలు, ఉద్రిక్తతలపై చర్చించినట్టు ఇరాన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఈ ప్రాంతంలోని దేశాలతో వివాదంలోకి దిగే ఉద్దేశం తమకు లేదని పాకిస్థాన్ ప్రధానికి అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ చెప్పినట్టు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. యుద్ధానికి బాధ్యులను జవాబుదారీగా ఉంచడంలో అంతర్జాతీయ సమాజం విఫలమైతే ప్రపంచ క్రమం, భద్రత ప్రమాదంలో పడతాయని కూడా ఆయన హెచ్చరించారు. ఈ యుద్దానికి దారితీసిన ఇరాన్‌పై వైమానిక దాడులకు మూల కారణం ఎవరో అంతర్జాతీయ సమాజం నిగ్గుతేల్చాలని పెజిష్కియాన్ డిమాండ్ చేశారు. అంతేకాదు, పొరుగు దేశాలపై దాడులు లేదా సరిహద్దుల్లో ఘర్షణ పడే ఉద్దేశం తమకు లేదని పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్‌కి తేల్చిచెప్పినట్టు రాయిటర్స్ నివేదించింది. ఇదిలా ఉండగా, ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా ఘర్షణల్లో చిక్కుకున్న సౌదీ అరేబియాకు అవసరమైతే సహాయం అందజేయడానికి సిద్ధంగా ఉన్నట్టు పాకిస్థాన్ ప్రకటన చేయడం గమనార్హం. గతేడాది ఇరు దేశాల మధ్య సైనిక సహకార ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే.ఇదిలా ఉండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్.. యుద్ధంపై పూటకో మాట మాట్లాడుతున్నారు. ఒకసారి యుద్ధం త్వరలోనే ఆగిపోతుందని, ఇంకోసారి పూర్తిగా యుద్ధంలో విజయం సాధించాల్సి ఉందని భిన్నమైన ప్రకటనలు చేస్తున్నారు. తాజాగా, మరోసారి ఆయన యుద్ధం ముగింపుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అన్ని టార్గెట్లను ఛేదించామని, అక్కడ ఇంకేమీ మిగల్లేదని చెప్పారు. ఇరాన్‌లో భీకర యుద్ధం జరుగుతోందని, అమెరికా సేనలు ఊహించిన దానికన్నా ఎక్కువ విధ్వంసం సృష్టించాయని అన్నారు. అంతేకాదు, తాను ఎప్పుడు అనుకుంటే అప్పుడు యుద్ధం ఆగిపోతుందని అన్నారు. ఆరు వారాల్లో సాధించాల్సింది పది రోజుల్లోనే పూర్తిచేశారని చెప్పడం గమనార్హం. ఇరాన్ సామర్థ్యాన్ని పూర్తిగా దెబ్బతీశామని ట్రంప్ చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో వాస్తవాలు భిన్నంగా ఉన్నాయనేది ప్రస్తుత పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. దుబాయ్ విమానాశ్రయంపై బుధవారం మరోసారి దాడికి ప్రయత్నించింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలైనట్టు స్థానిక అధికారులు తెలిపారు. వీరిలో ఒకరు భారత సంతతికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ పరిణామాలతో ప్రయాణికులు, విమానాశ్రయ సిబ్బందికి సేఫ్టీ నోటీసు జారీచేశారు. హర్మూజ్ జల సంధిలో భారత్‌కు వస్తున్న థాయ్‌లాండ్ ఆయిల్ ట్యాంకర్ నౌన మయూరీ నారీ బ్యాంకాక్‌పై దాడి చేసింది. ఈ ఘటనలో ముగ్గురు నావికులు గల్లంతయ్యారు.

## యుద్ధ నేపథ్యంలో సైతం చైనాకు చమురును తరలిస్తున్న ఇరాన్

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధము జరుగుతున్నప్పటికీ, ప్రపంచం చమురు లోటుతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ, ఇరాన్ తన ఆర్థిక మూలాలను కాపాడుకునే దిశగా వ్యూహాత్మక అడుగులు వేస్తోంది అనే చెప్పవచ్చు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్ సుమారు 11.7 మిలియన్ బారెళ్ల ముడి చమురును హర్మూజ్ జలసంధి ద్వారా చైనాకు విజయవంతంగా తరలించింది. అంతర్జాతీయంగా అమెరికా విధించిన కఠినమైన ఆర్థిక ఆంక్షలను ధిక్కరిస్తూ ఇరాన్ ఈ స్థాయిలో ఎగుమతులు చేయడం గమనార్హం.ప్రస్తుతం ప్రపంచ చమురు సరఫరాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో ఉండటం దానికి కలిసొచ్చే అంశంగా మారింది. ఇజ్రాయెల్, అమెరికా లతో యుద్ధ వాతావరణం నెలకొన్నప్పటికీ, తన నౌకల ద్వారా చైనాకు నిరంతరాయంగా చమురును సరఫరా చేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే ఇరాన్ చమురును అందిస్తుండటంతో చైనా తన ఓఇంధన అవసరాల కోసం ఆ దేశంతో వాణిజ్యాన్ని మరింత పెంచుకుంది.

## ఇరాన్ సైనిక శక్తిని, నౌకాదళం, వాయుసేనలను తుడిసిపెట్టేసాం



ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము తలచుకుంటే కేవలం గంట వ్యవధిలోనే ఇరాన్ విద్యుత్ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేయగలమని తీవ్రంగా హెచ్చరించారు. అలానే కాలిఫోర్నియా తీరంలో ఒక పడవ నుంచి డ్రోన్‌లతో దాడి చేసేందుకు ఇరాన్ పన్నుతున్న కుట్రపై తమ అధికారులు దర్యాప్తు చేస్తున్నారని ఆయన వెల్లడించారు.తాజాగా విలేకరులతో మాట్లాడిన ట్రంప్ ఇరాన్‌తో యుద్ధంపై కీలక విషయాలు తెలిపారు. "మేం తలచుకుంటే గంటలో వారి విద్యుత్ సామర్థ్యాన్ని కూల్చివేయగలం. దాన్ని మళ్లీ నిర్మించుకోవడానికి వారికి 25 ఏళ్లు పడుతుంది. కానీ మేం అలా చేయాలనుకోవడం లేదు" అని అన్నారు. ఇరాన్ సైనిక శక్తిని ఇప్పటికే తాము నిర్వీర్యం చేశామని, వారి నౌకాదళం, వాయుసేనలను తుడిచిపెట్టేశామని చెప్పారు.అమెరికా చేపడుతున్న సైనిక చర్యకు ఇతర శక్తిమంతమైన దేశాల నుంచి ప్రైవేట్‌గా మద్దతు లభిస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. తమ సైనిక చర్యల ఫలితంగా ఇరాన్ తీవ్రంగా నష్టపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలోని సరిహద్దు విధానాల వల్ల ఇరాన్‌కు చెందిన స్లీపర్ సెల్స్ అమెరికాలోకి ప్రవేశించాయని ట్రంప్ ఆరోపించారు.


# నల్లశనగలతో అద్భుతమైన ఆరోగ్యం..!

మన రోజువారీ ఆహారంలో పప్పుదినుసులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అందులో ముఖ్యంగా నల్ల శనగలు (కల చనా) ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. పోషకాలు సమృద్ధిగా ఉండటం వల్ల నల్ల శనగలను సూపర్ ఫుడ్‌గా కూడా పరిగణిస్తారు. ఇవి శరీరానికి శక్తిని ఇవ్వడంతో పాటు అనేక రకాల వ్యాధులను దూరం చేయడంలో సహాయపడతాయి. నానబెట్టిన నల్లశనగలు రోజు ఒక వంద గ్రాములు తిన్నారంటే శక్తి పెరిగి జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. కండరాలు బలంగా మారుతాయి. ఆ రోజంతా మంచి ఎనర్జీతో ఉత్సాహంగా ఉంటారు. అంతేకాదు, మీ శరీరానికి కావలసిన అన్ని రకాల ప్రోటీన్లు ఈ నల్ల శనగలలో పుష్కలంగా ఉండటం వలన అలసట రాదు. శరీరానికి కావాల్సిన పోషకాలు: నల్ల శనగల్లో ప్రోటీన్, ఫైబర్, ఐరన్, కాల్షియం, మాగ్నీషియం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించి కండరాల పెరుగుదలకి సహాయపడతాయి. ముఖ్యంగా శాకాహారులు ప్రోటీన్ కోసం నల్ల శనగలను ఎక్కువగా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. నల్ల శనగల్లో ఉన్న విటమిన్లు, ఖనిజాలు శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచుతాయి. దీని వల్ల చిన్నపాటి ఇన్ఫెక్షన్లు, జలుబు వంటి సమస్యల నుండి రక్షణ లభిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపరుస్తాయి: నల్ల శనగల్లో ఉన్న ఫైబర్ జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. మలబద్ధకం సమస్యను తగ్గించి జీర్ణక్రియను సక్రమంగా జరగేలా చేస్తుంది. కడుపు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. రక్తహీనత నివారణ: నల్ల శనగల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయిలను పెంచడంలో సహాయపడుతుంది. రక్తహీనత సమస్య ఉన్నవారు నల్ల శనగలను ఆహారంలో చేర్చుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. గుండె ఆరోగ్యం మెరుగుదల: నల్ల శనగల్లో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల గుండె



ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించి గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. బరువు తగ్గడంలో సహాయం: నల్ల శనగల్లో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల తిన్న తర్వాత ఎక్కువసేపు ఆకలి వేయదు. దీంతో అధికంగా తినే అలవాటు తగ్గి బరువు నియంత్రణలో ఉంటుంది. అందుకే డైట్ ఫాలో అయ్యే వారు నల్ల శనగలను తమ ఆహారంలో చేర్చుకుంటారు. నల్ల శనగలను రాత్రి నీటిలో నానబెట్టి ఉదయం తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అలాగే కూరలు, సలాడ్లు, స్నాక్స్ రూపంలో కూడా తీసుకోవచ్చు. క్రమం తప్పకుండా వీటిని ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. పోషకాలు సమృద్ధిగా ఉన్న నల్ల శనగలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన ఆహారం. రోజూ పరిమిత మోతాదులో వీటిని తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడి, గుండె ఆరోగ్యం బాగుండి, శరీరానికి శక్తి లభిస్తుంది. అందుకే నల్ల శనగలను ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా చేసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.


# పుచ్చకాయ గింజలు తింటున్నారా..?



వేసవిలో పుచ్చకాయకు అధిక ప్రాధాన్యత ఉంది. 100 గ్రాముల పుచ్చకాయలో కేవలం 16 శాతం కేలరీలు, 96 శాతం నీరు ఉంటాయి. ఇది కేలరీలు తక్కువగా ఉండే, మంచి నీటిని అందించే పండు.. సాయంత్రం వేళల్లో లేదా భోజనానికి ముందు తీసుకోవడం ద్వారా ఆకలిని పెంచుతుంది.. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మధుమేహులు, పిల్లలు కూడా నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. వేసవికాలం వచ్చిందంటే చాలామందికి ముందుగా గుర్తుకువచ్చేది పుచ్చకాయ. శరీరానికి చల్లదనాన్ని అందించడానికి, వేడిని తగ్గించడానికి ఇది ఒక అద్భుతమైన పండు.. పుచ్చకాయ 90శాతానికి పైగా నీటిని కలిగి ఉండి, శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో, బరువు తగ్గడంలో, గుండె ఆరోగ్యానికి (లైకోపీన్ వల్ల) చాలా మేలు చేస్తుంది. ఇందులో విటమిన్లు ం, అ, పొటాషియం, సిట్రులిన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడం, రక్తపోటును అదుపు చేయడం, కండరాల నొప్పులను తగ్గించడంలో సహాయపడతాయి.పుచ్చకాయలో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. 100 గ్రాముల ఎర్రటి పుచ్చకాయ ముక్కల్లో కేవలం 16 కేలరీల శక్తి మాత్రమే ఉంటుంది. దీనిని అర్థం చేసుకోవడానికి, అర కిలో పుచ్చకాయ తిన్నా, అది ఒక బజ్జీ లేదా సమోసాకు సమానమైన కేలరీలను మాత్రమే ఇస్తుంది. అంటే, అధిక కేలరీలుండే వేరే ఆహార పదార్థాలతో పోలిస్తే, పుచ్చకాయ ద్వారా శరీరానికి తక్కువ శక్తి లభిస్తుంది.పుచ్చకాయలో 96 శాతం నీరు ఉంటుంది. ఇది శరీరానికి కావాల్సిన హైడ్రేషన్‌ను అందిస్తుంది. ఖర్బూజా వంటి పండ్లతో పోలిస్తే పుచ్చకాయలో విటమిన్లు, మినరల్స్, సాల్ట్స్ తక్కువగా ఉంటాయి. అయినప్పటికీ, దాని తియ్యని రుచి, చల్లదనం, ఎర్రటి రంగు కారణంగా వేసవిలో పుచ్చకాయ ప్రజలలో బాగా ప్రాచుర్యం పొందింది. ఇది ఎంప్టీ కేలరీలు అందించే ఒక మంచి పండు. పుచ్చకాయను సరైన సమయాల్లో తీసుకోవడం చాలా ముఖ్యం. సాయంత్రం 5 నుండి 5:30 గంటల మధ్య ఒక గ్లాసు పుచ్చకాయ రసం తాగడం లేదా ముక్కలు తినడం మంచిది. పిల్లలు పాఠశాల నుండి ఇంటికి వచ్చినప్పుడు, ఆడుకోవడానికి వెళ్లే ముందు దీనిని అందించడం వల్ల వారికి మంచి ఆకలి పుడుతుంది. భోజనానికి, రాత్రి భోజనానికి అరగంట నుండి గంట ముందు పుచ్చకాయ ముక్కలు లేదా రసం తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది ఆకలిని పెంచుతుంది, పొట్టలో చల్లగా, హాయిగా అనిపిస్తుంది. ఎసిడిటీ వంటి సమస్యలు ఉన్నవారికి కూడా ఉపశమనం లభిస్తుంది.


పుచ్చకాయను కడుపు నిండా తినవచ్చు. తక్కువ కేలరీలతో సంతృప్తి లభిస్తుంది. షుగర్ ఉన్నవారు కూడా పుచ్చకాయను భయం లేకుండా తీసుకోవచ్చు.. ఎందుకంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచదు. వృద్ధులు, పిల్లలు, పసి పిల్లలకు కూడా పుచ్చకాయ ముక్కలు లేదా రసం చాలా మంచిది.

# మనిషి శరీరంలో క్యాన్సర్ ఎలా పుడుతుంది..?



క్యాన్సర్ అంటే ఏమిటి, అది ఎలా పుడుతుంది, ఎన్ని రకాలు అనే భయం చాలా మందిలో ఉంటుంది. కణాల అనియంత్రిత పెరుగుదలతో శరీరంలో క్యాన్సర్ మొదలవుతుంది. దీనికి చరిత్ర, వివిధ వ్యాప్తి మార్గాలు, అవయవాలు, కణాల ఆధారంగా వర్గీకరణలు ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలు ఈ వ్యాధిపై కొత్త ఆశను రేకెత్తిస్తున్నాయి. క్యాన్సర్ అనే పేరు వినగానే చాలా మందికి మదిలో భయం మొదలవుతుంది. అసలు క్యాన్సర్ అంటే ఏంటి? అది మానవ శరీరంలో ఎలా పుడుతుంది? ఎన్ని రకాల క్యాన్సర్లు ఉన్నాయి? వాటిలో ఏది అత్యంత ప్రమాదకరమైనది? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. . క్యాన్సర్ ప్రస్తావన గ్రీకు, రోమన్ పుస్తకాల్లో ఉంది. క్రీస్తు పూర్వం 470, 370 మధ్యలో గ్రీకు వైద్యానికి పితామహుడిగా భావించే హిప్పోక్రటిస్ తొలుత క్యాన్సర్‌కు సంబంధించి కార్సినోస్ లేదా కార్సినోమా అనే పదాలను వాడారు. కార్సినోస్ అంటే గ్రీకు భాషలో పీత అని అర్థం. క్యాన్సర్ రోగులలో కనిపించే గట్టి గడ్డలు, అవి ఒక భాగం నుంచి మరో భాగానికి వ్యాపించడం, తుదిదశలో భరించలేని నొప్పి వంటి లక్షణాలను పీత గట్టి వెనుక భాగం, కాటుతో వచ్చే నొప్పికి పోల్చడం ద్వారా ఈ పేరు వచ్చింది. గ్రీకు ఫిజిషియన్ గాలెన్ అంకోస్ (గ్రీకులో ఉబ్బడం) అనే పదాన్ని ప్రసిద్ధం చేశారు. రోమన్ ఫిజిషియన్ సెల్సస్ తొలుత లాటిన్ పదం క్యాన్సర్‌ను వాడారు. 17వ శతాబ్దంలో మైక్రోస్కోప్‌ను కనుగొన్న తర్వాతే క్యాన్సర్‌పై పరిశోధనలు మొదలయ్యాయి. 19వ శతాబ్దంలో వైద్య పురోగతితో క్యాన్సర్ రహస్యం మరింత బయటపడటం మొదలైంది. మానవ శరీరం కోట్లకొద్దీ కణాలతో రూపొందుతుంది. కొత్త కణాలు పుట్టడం, వాటి పనులు నిర్వర్తించడం, వాటి పని పూర్తయిన తర్వాత నశించడం, మళ్ళీ కొత్త కణాలు పుట్టడం అనేది శరీరంలో జరిగే ఒక నియంత్రిత ప్రక్రియ. కణాలలోని జన్యువులు ఈ ప్రక్రియను నియంత్రిస్తాయి. అయితే, కార్సినోజెన్ ఎక్స్‌పోజర్, ఇన్ఫెక్షన్లు (వైరల్ ఇన్ఫెక్షన్లు), లేదా వంశపారంపర్యం వంటి కారణాల వల్ల ఈ జన్యువులలో మ్యుటేషన్ సంభవిస్తే, కణాలు నియంత్రణ కోల్పోయి అనియంత్రిత స్థాయిలో పెరుగుతాయి. వాటి పరిమాణం, సహజత్వంలో మార్పులు సంభవిస్తాయి. దీన్నే క్యాన్సర్ అంటారు. క్యాన్సర్ కణాలు నశించవు, వ్యాధి నిరోధక వ్యవస్థ నుంచి తప్పించుకుంటూ శరీరంలో ఒక భాగం నుంచి మరో భాగానికి విస్తరించి, ఇతర కణాలను, అవయవాలను దెబ్బతీస్తాయి. సాధారణ గడ్డలకు భిన్నంగా క్యాన్సర్ కణితులు శరీరంలోని ఏ భాగానికైనా విస్తరించగలవు.

# తిన్న కాసేపటికే మళ్లీ ఆకలిగా అనిపిస్తుందా?




ఒంట్లో ఇన్సులిన్ సరిగ్గా పనిచేయడం లేదని చెప్పే సూచిక ఇది. ఇది డయాబెటిస్‌కు సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ ప్రకారం తరచుగా ఆకలిగా ఉండటం అనేది శరీరంలోని చక్కెర స్థాయిలలో తేడాల కారణంగా ఇన్సులిన్ పనితీరు బలహీనపడుతుందని సూచిస్తుంది. చాలా మందికి భోజనం చేసిన కాసేపటికే ఆకలిగా అనిపిస్తుంటుంది. దీంతో స్వీట్లు వంటి ఇంట్లో ఉన్న డిజర్ట్స్ లాగించేస్తుంటారు. అసలు ఇలా ఎందుకు అనిపిస్తుందో మీరెప్పుడైనా ఆలోచించారా? నిజానికి.. మీ ఒంట్లో ఇన్సులిన్ సరిగ్గా పనిచేయడం లేదని చెప్పే సూచిక ఇది. ఇది డయాబెటిస్‌కు సంకేతమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ ప్రకారం తరచుగా ఆకలిగా ఉండటం అనేది శరీరంలోని చక్కెర స్థాయిలలో తేడాల కారణంగా ఇన్సులిన్ పనితీరు బలహీనపడుతుందని సూచిస్తుంది. దీని అర్థం శరీరంలోని ఇన్సులిన్ హార్మోన్ రక్తం నుంచి కణాలకు గ్లూకోజ్‌ను సరిగ్గా అందించలేకపోతుంది. దీని కారణంగా, శరీరానికి సరైన శక్తి లభించదు. దీని వల్ల మెదడు పదే పదే ఆకలిని సూచిస్తుంది. వైద్య పరిభాషలో దీనిని పాలీఫాగియా అంటారు. శరీరంలో డయాబెటిస్ మొదలయ్యే ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. చాలా మంది వీటిని సాధారణమైనదిగా విస్మరిస్తారు. కానీ ఇలా చేయడం మంచిది కాదు. ప్రారంభ దశలోనే ఆహారంలో మార్పులు చేసుకోవడం ద్వారా ఇటువంటి వ్యాధులను నివారించవచ్చు. లేకపోతే డయాబెటిస్ మీ జీవితాన్ని నాశనం చేస్తుంది. దీనికి చికిత్స లేనందున దానిని నియంత్రణలో ఉంచడం చాలా అవసరం.

## ప్రెగ్నెన్సీ టైంలో టీ తాగొచ్చా..?




చాలా మంది టీతో తమ రోజును ప్రారంభిస్తుంటారు. కానీ గర్భధారణ సమయంలో టీ తాగే అలవాటు పట్ల జాగ్రత్తగా ఉంటాలి. టీలోని కెఫిన్, పాలు, చక్కెర శరీరాన్ని వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. గర్భధారణ సమయంలో ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఎందుకంటే ఈ కాలంలో గర్భిణీ తనకు మాత్రమే కాకుండా గర్భంలో ఉన్న బిడ్డకు కూడా పోషకాలను అందించాలి. బలహీనత, అలసట, తలతిరగడం, రక్తహీనత, ఆమ్లత్వం, జీర్ణ సమస్యలను కలిగిస్తుంది. పోషకాల లోపం శిశువు అభివృద్ధిని కూడా ప్రభావితం చేస్తుంది. అందువల్ల గర్భధారణ సమయంలో ఏమి తినాలో, ఏమి నివారించాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. చాలా మంది టీతో తమ రోజును ప్రారంభిస్తుంటారు. కానీ గర్భధారణ సమయంలో టీ తాగే అలవాటు పట్ల జాగ్రత్తగా ఉంటాలి. టీలోని కెఫిన్, పాలు, చక్కెర శరీరాన్ని వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. గర్భధారణ సమయంలో టీని మితంగా తాగడం సాధారణంగా సురక్షితమైనదిగా భావిస్తారని డాక్టర్ అనామిక గౌర్ అంటున్నారు. అయితే దీని అధిక వినియోగం హానికరం. టీలోని కెఫిన్ శరీరంలోని ఐరన్ శాతాన్ని తగ్గిస్తుంది. ఇది రక్తహీనత ప్రమాదాన్ని పెంచుతుంది. అంతేకాదు, ఎక్కువ టీ తాగడం వల్ల ఆమ్లత్వం, గ్యాస్, గుండెల్లో మంట వస్తుంది. గర్భధారణ సమయంలో ఇటువంటి సమస్యలు సర్వసాధారణం కాబట్టి, అవి పెరిగే అవకాశం ఉంది. కొంతమంది స్త్రీలలో టీ వినియోగం నిద్రలేమి, వేగవంతమైన హృదయ స్పందనకు కారణమవుతుంది. అందువల్ల రోజుకు ఒకటి కంటే ఎక్కువ కప్పుల టీ తాగకూడదు. ఆమ్లత్వం లేదా వాంతులు సమస్యలు ఉంటే టీని నివారించడం మంచిది. నిజానికి వైద్యుల సలహా మేరకు మాత్రమే టీ తాగడం సురక్షితం. గర్భిణీలకు టీకి బదులుగా ఆరోగ్యకరమైన ఎంపికలు చాలానే ఉన్నాయి. వేడిగా పాలు తాగవచ్చు. ఇది కాల్షియంను అందిస్తుంది. ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. నీళ్ల శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. అలసటను కూడా తగ్గిస్తుంది. నిమ్మకాయ నీళ్ల జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది కాబట్టి ఇవి తాగవచ్చు. బదులుగా అల్లం టీ తాగే అలవాటు ఉంటే దానిని కూడా తాగవచ్చు. ఇది వాంతుల అనుభూతిని తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాదు సుగంధ ద్రవ్యాల పానీయాలను కూడా తాగవచ్చు. కానీ వీటిని తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఈ ప్రత్యామ్నాయాలు శరీరానికి పోషకాలను అందిస్తాయి, ఆమ్లత ప్రమాదాన్నీ తగ్గిస్తాయి.

## యాపిల్ కట్ చేసిన కాసేపటికే నల్లగా మారుతాయి ఎందుకు?



పండ్లు, కూరగాయలు కోసిన తర్వాత వాటి రంగు మారడం సహజమైన ప్రక్రియ అయినప్పటికీ దీని వల్ల వంట ప్రక్రియ ఆలస్యమవుతుంటుంది. ముఖ్యంగా బంగాళాదుంపలు, యాపిల్ కోసిన తర్వాత తక్కువ సమయంలోనే నల్లగా మారుతాయి. బంగాళాదుంపలు, యాపిల్‌లలో నల్లగా మారే ప్రక్రియను శాస్త్రీయంగా ఎంజైమాటిక్ బ్రౌనింగ్ అంటారు. బంగాళాదుంపలు, యాపిల్ పండ్లలో 'పాలీఫినాల్ ఆక్సిడేస్' అనే ఎంజైమ్ ఉంటుంది. ఈ ఎంజైమ్ కోసే వరకు కణాల లోపల సురక్షితంగా ఉంటుంది. అయితే కోసిన తర్వాత, ఈ కణాలు గాలిలోని ఆక్సిజన్‌తో సంబంధంలోకి వస్తాయి. ఆక్సిజన్, ఎంజైమ్‌ల మధ్య రసాయన ప్రతిచర్య మెలనిన్ అనే వర్ణద్రవ్యాన్ని ఉత్పత్తి చేస్తుంది. దీని వలన కోసిన ప్రాంతం నల్లగా లేదా గోధుమ రంగులో కనిపిస్తుంది. కట్ చేసిన బంగాళాదుంపలు, యాపిల్‌లు తాజాగా ఉంచడానికి మీరు ఖచ్చితంగా ఇంట్లో కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. బంగాళాదుంపలను కోసిన వెంటనే చల్లటి నీటిలో నానబెట్టాలి. ఇది గాలితో వాటి సంబంధాన్ని తెంచుకుంటుంది. దీంతో నల్లగా మారకుండా నిరోధిస్తుంది. ఇది సులభమైన చిట్కా. యాపిల్ కోసి తర్వాత తినాలనుకుంటే ముక్కలపై కొంచెం నిమ్మరసం రాయాలి. నిమ్మకాయలోని విటమిన్ సి (యాంటీఆక్సిడెంట్) ఆక్సీకరణ ప్రక్రియను నెమ్మదిస్తుంది. అలాగే, ఒక గిన్నెలో నీళ్లు తీసుకుని దానికి చిటికెడు ఉప్పు వేయాలి. అందులో బంగాళాదుంప లేదా యాపిల్ ముక్కలను ఉంచాలి. దీనివల్ల రంగు మారదు. యాపిల్ఎక్కువసేపు తాజాగా ఉంచాలనుకుంటే, రెండు కప్పుల నీటిలో రెండు టేబుల్ స్పూన్ల తేనె కలిపి అందులో యాపిల్ ముక్కలను ఉంచాలి. దాదాపు 3-5 నిమిషాల తర్వాత ముక్కలను తొలగించాలి. అలాగే కోసిన పండ్లను వెంటనే ఉపయోగించకూడదనుకుంటే, వాటిని క్లాంగ్ ఫిల్మ్‌తో గట్టిగా చుట్టండి లేదా రిఫ్రిజిరేటర్‌లో గాలి చొరబడని కంటైనర్‌లో నిల్వ చేయండి. దీనితో పాటు బంగాళాదుంపలు లేదా యాపిల్ నల్లబడకుండా ఆపాలనుకుంటే ఒక గిన్నెలో నీరు తీసుకొని దానికి ఒక చెంచా వెనిగర్ కలపండి. కట్ చేసిన బంగాళాదుంపలు లేదా యాపిల్ ముక్కలను ఈ నీటిలో 2-3 నిమిషాలు ముంచండి. ఇది వాటి రంగును తెల్లగా, చాలా కాలం పాటు తాజాగా ఉంచుతుంది. కానీ తినడానికి లేదా వంట చేయడానికి ముందు వాటిని ఒకసారి సాధారణ నీటితో శుభ్రం చేసుకోవడం మంచిది.

## గర్భిణుల పాలిట శాపంగా మారుతున్న 'వంట పొగ'..

భారతదేశంలోని గ్రామీణ మరియు పేద వర్గాల మహిళల ఆరోగ్యంపై వంట గదిలోని పొగ పెను ప్రభావం చూపుతోందని తాజా అధ్యయనాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సాంప్రదాయ పద్ధతుల్లో కట్టెలు, పిడకలు మంటపెట్టి వంట చేయడం వల్ల వెలువడే వాయు కాలుష్యం గర్భిణీ స్త్రీలలో రక్తహీనత ముప్పును ఏకంగా 43 శాతం మేర పెంచుతోంది. ఈ పరిస్థితి కేవలం తల్లి ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా, పుట్టబోయే బిడ్డ ఎదుగుదలను కూడా ప్రమాదంలోకి నెడుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వంట సమయంలో వెలువడే విషవాయువులు నేరుగా రక్తంలోని హిమోగ్లోబిన్ ఉత్పత్తిపై దాడి చేస్తున్నాయని పరిశోధకులు వెల్లడించారు. ఈ కలుషిత గాలిని పీల్చడం వల్ల శరీరంలో ఆక్సిజన్‌ను సరఫరా చేసే సామర్థ్యం తగ్గిపోయి, మహిళలు తీవ్రమైన నీరసానికి మరియు రక్తహీనతకు గురవుతున్నారు. ముఖ్యంగా సరైన వెంటిలేషన్ లేని ఇళ్లలో వంట చేసే మహిళలు ఈ విషపూరిత కణాల బారిన పడి దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నట్లు ఈ అధ్యయనం స్పష్టం చేసింది. దేశంలో ఇప్పటికీ కోట్లాది మంది మహిళలు ఆర్థిక పరిస్థితుల వల్ల లేదా అవగాహన లేక కట్టెల పొయ్యినే ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా గర్భిణీ దశలో ఉండాల్సిన కనీస హిమోగ్లోబిన్ స్థాయిలు పడిపోయి, ప్రసవ సమయంలో సంక్లిష్టతలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ సమస్యను కేవలం పోషకాహార లోపంగా మాత్రమే చూడలేమని, వాతావరణ కాలుష్యం కూడా ప్రధాన కారణమని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తల్లీబిడ్డల క్షేమాన్ని కాపాడాలంటే కట్టెలు, పిడకల వాడకాన్ని తగ్గించి, స్వచ్ఛమైన ఇంధనాన్ని అందుబాటులోకి తీసుకురావడం అత్యవసరం. ప్రభుత్వం మరియు సామాజిక సంస్థలు కలిసి గ్రామీణ ప్రాంతాల్లో ఇంధన మార్పుపై మరింత అవగాహన కల్పించాలి.

# బ్యాటింగ్ లెజెండ్ ద్రవిడ్‌కు లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ పురస్కారం!

**రాహుల్ ద్రవిడ్‌కు సీకే నాయుడు జీవిత సాఫల్య పురస్కారం**

**క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపిక**

**టీ20 ప్రపంచకప్ విజేతలతో పాటు పలు జట్లకు సత్కారం**

**దేశవాళీ క్రికెట్‌లో ఉత్తమ సంఘంగా ముంబై క్రికెట్ అసోసియేషన్**

**మార్చి 15న ఢిల్లీలో బీసీసీఐ 'నమన్' అవార్డుల ప్రదానం**



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వార్షిక అవార్డుల ప్రదానోత్సవానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 15న దేశ రాజధాని ఢిల్లీలో 'నమన్' పేరుతో జరగనున్న ఈ కార్యక్రమంలో భారత బ్యాటింగ్ దిగ్గజం, మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు ప్రతిష్ఠాత్మక కల్నల్ సీకే నాయుడు జీవిత సాఫల్య పురస్కారం లభించనుంది. అదేవిధంగా, భారత టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను 'ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్' (పాలి ఉమ్రిగర్ అవార్డు) విభాగంలో ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. భారత క్రికెట్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా ద్రవిడ్‌ను లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ పురస్కారానికి ఎంపిక చేశారు. ఆయన మార్గనిర్దేశంలోనే భారత్ 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన సంగతి తెలిసిందే. మరోవైపు, 2025లో టెస్టుల్లో 983 పరుగులు, వన్డేల్లో 490 పరుగులతో అద్భుత ప్రదర్శన కనబరిచిన శుభ్‌మన్ గిల్‌కు 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' గౌరవం దక్కనుంది. టీ20 ప్రపంచకప్ జట్టులో గిల్ సభ్యుడు కానప్పటికీ, టెస్టులు, వన్డేల్లో నిలకడైన ప్రదర్శనతో ఈ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ వేడుకలో... ఇటీవల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత పురుషుల జట్టు, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, 2025 మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్లతో పాటు అండర్-19 ప్రపంచకప్ విజేతలను కూడా బీసీసీఐ సత్కరించనుంది. అయితే, ఇదే రోజున దేశవాళీ టోర్నీల ఫైనల్స్ ఉండటంతో కొంతమంది మహిళా క్రికెటర్లు ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోవచ్చని సమాచారం. దేశవాళీ క్రికెట్‌లో ఉత్తమ పనితీరు కనబరిచిన అసోసియేషన్ గా ముంబై క్రికెట్ అసోసియేషన్ వరుసగా మూడోసారి అవార్డు అందుకోనుంది. వీరితో పాటు రంజీ ట్రోఫీలో అత్యధిక పరుగులు, వికెట్లు తీసిన యశ్ రాథోడ్, యశ్ దూబేలకు మాధవరావు సింధియా అవార్డులు, ఉత్తమ అంపైర్‌గా ఉల్హాస్ గాంధే తదితరులకు కూడా పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

# ఆర్సీబీకి బిగ్ షాక్.. ఐపీఎల్ 2026కి ముందు స్టార్ బౌలర్ దూరం?



**హైదరాబాద్ పెన్ పవర్:** మార్చి 28 నుంచి ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)2026 19వ సీజన్ ప్రారంభం కానుంది. ఈ మెగా టోర్నమెంట్ కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్నారు. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బరిలోకి దిగబోతుంది. ఆ టోర్నీ ప్రారంభానికి ముందే ఆర్‌సీబీకి సంబంధించిన ఒక ఆందోళన కలిగించే న్యూస్ బయటకు వచ్చింది. ఆ జట్టు స్టార్ పేసర్ జాష్ హేజిల్‌వుడ్ ఇంకా పూర్తిగా గాయం నుంచి కోలుకోలేదని తెలుస్తుంది. ఎన్నో ఏళ్లుగా ఐపీఎల్ ట్రోఫీని దక్కించుకోవాలనే కోరికతో బరిలోకి దిగిన ఆర్‌సీబీ 2025లో చివరికి దాన్ని కైవసం చేసుకుంది. ఆ విజయంలో ఆస్ట్రేలియా పేసర్ జోష్ హేజిల్‌వుడ్ కీలక పాత్ర పోషించాడు. గత సీజన్‌లో ఆర్‌సీబీ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా జోష్ నిలిచాడు. ముఖ్యంగా ఫైనల్ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు బ్యాటర్లను ఇబ్బంది పెట్టి మ్యాచ్ ని తమ వైపుకు మార్చడంలో కీలకంగా వ్యవహరించాడు.గాయపడిన హేజిల్‌వుడ్ ప్రతిష్టాత్మకమైన ది యాషెస్ సిరీస్‌తో పాటు భారత్‌లో జరిగిన టీ20 సిరీస్ నుంచి తప్పుకున్నాడు. తాజా సమాచారం ప్రకారం అతడు ఇంకా పూర్తిగా కోలుకోలేదని సమాచారం. ప్రస్తుతం ఫిజియో పర్యవేక్షణలో ఫిట్‌నెస్ సాధించే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో జోష్ ఐపీఎల్ 2026లో ఆడతాడా లేదా అన్నది ప్రస్తుతం సందేహంగా మారింది. అయితే మార్చి 28వ తేదీలోపు అతడు పూర్తిగా ఫిట్ అయ్యే ఛాన్సులు 50-- -50గా ఉన్నాయని టాక్. ఒకవేళ జోష్ హేజిల్‌వుడ్ ఐపీఎల్ కి దూరమైతే.. ఆర్‌సీబీకి బిగ్ షాకే అని చెప్పాలి.

# జస్‌ప్రీత్ బుమ్రా సంచలన నిర్ణయం.. టీ20లకి గుడ్ బై?



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ లో అద్భుతమైన బౌలింగ్ తో ప్రత్యర్థి బ్యాటర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన బౌలర్ జస్ప్రీత్ బుమ్రా.. తన యార్కర్లు, పదునైనా బంతులతో ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తున్న బుమ్రా.. తాజాగా సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. బుమ్రా నిర్ణయంపై ఫ్యాన్స్ షాక్ అయినట్లు తెలుస్తుంది. టీమిండియా భవిష్యత్తు ప్రణాళికలను చూస్తే ఇది ఒక మాస్టర్ ప్లాన్‌లా కనిపిస్తుంది. వచ్చే 18 నెలల పాటు బుమ్రా టీ20 ఫార్మాట్‌కు దూరంగా ఉండే ఛాన్స్ ఉందని బీసీసీఐ వర్గాలను నుంచి సమాచారం అందుతుంది. ఇది రిటైర్మెంట్ కాదు, కేవలం వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా తీసుకున్న ఒక నిర్ణయం మాత్రమేనని పేర్కొంటున్నారు.

2027లో జరగనున్న వన్డే వరల్డ్ కప్‌పైనే ఇప్పుడు టీమిండియా పూర్తిగా దృష్టి పెట్టింది. ఈ మెగా టోర్నమెంట్‌లో జస్ ప్రీత్ బుమ్రా సేవలు అత్యంత కీలకం కావడంతో.. అతడిని శారీరకంగా, మానసికంగా రెడీ చేసేందుకే బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. దాదాపు ఏడాదిన్నర తర్వాత జరగబోయే ఈ ప్రపంచ కప్‌ను దక్షిణాఫ్రికా, జింబాబ్వే , నమీబియా దేశాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. మొత్తం 14 జట్లు ఈ టోర్నీలో పోటీ పడనున్నాయి. 54 మ్యాచ్‌లు జరగనుండగా, అందులో 44 మ్యాచ్‌లకు సౌతాఫ్రికా ఆతిథ్యం ఇవ్వనుండగా.. మిగిలిన 10 మ్యాచ్‌లను జింబాబ్వే, నమీబియా వేదికలుగా కొనసాగుతాయి. ఇది 2003 ప్రపంచ కప్ తరహాలో జరిగే ఛాన్స్ ఉంది. ఇందులో రెండు గ్రూపులుగా టీమ్స్ విడిపోయి, సూపర్ సిక్స్, సెమీ ఫైనల్స్, ఫైనల్లో పోటీ పడుతాయి. జస్‌ప్రీత్ బుమ్రా వయస్సు, ఫిట్‌నెస్ ని పరిగణనలోకి తీసుకుని.. అన్ని ఫార్మాట్లలో అతడు ఆడి అలసిపోవడం జట్టుకు పెద్ద నష్టం కలుగజేస్తుంది. కాబట్టి, బుమ్రాను వన్డేలు, టెస్టులకే పరిమితం చేసి, వన్డే ప్రపంచ కప్ 2027 కోసం పదును పెట్టాలని టీమిండియా మేనేజ్‌మెంట్ చూస్తుంది. బుమ్రా కూడా ఈ నిర్ణయానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఏదేమైనా, బుమ్రా టీ20 ఫార్మాట్లో కనిపించకపోవడం క్రికెట్ అభిమానులకు లోటుగానే అనిపిస్తుంది. కానీ, 2027లో వరల్డ్ కప్ ట్రోఫీని దక్కించుకోవాలంటే మన బుమ్రా అప్పటి వరకు అద్భుతమైన ఫామ్, ఫిట్‌గా ఉండటం చాలా ముఖ్యం.

# ఐకాన్ స్టార్ నుంచి గ్లోబల్ ఐకాన్ గా!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కెరీర్‌లో అత్యంత కీలకమైన దశలో ఉన్నారు. రాబోయే ఐదేళ్లలో ఆయన లైనప్‌లో ఉన్న సినిమాలన్నీ అనుకున్నట్లుగా విడుదలై బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తే టాలీవుడ్ స్టార్‌గానే కాకుండా, భారతీయ చిత్ర పరిశ్రమలోనే అజేయమైన గ్లోబల్ ఐకాన్ గా ఎదిగే అవకాశం ఉంది. -పుష్ప-తో ఇప్పటికే పాన్-ఇండియా మార్కెట్‌ను శాసించిన బన్నీ, రాబోయే చిత్రాలతో తన ప్రభావాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది.వచ్చే ఐదేళ్లలో ఆయన లోకేష్ కనగరాజ్, సుకుమార్, త్రివిక్రమ్, సందీప్ రెడ్డి వంగా వంటి అగ్ర దర్శకులతో చేయబోయే సినిమాలు బాక్సాఫీస్ వద్ద వేల కోట్ల వరకు వసూళ్లను సాధించే అవకాశం ఉంది. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే గనుక భారతీయ సినిమా చరిత్రలో అత్యధిక కమర్షియల్ స్టామినా ఉన్న హీరోగా బన్నీ నిలుస్తారు. ముఖ్యంగా హిందీ మార్కెట్‌లో బన్నీకి ఉన్న క్రేజ్ అమీర్ ఖాన్, షారుఖ్ ఖాన్ రేంజ్‌కు చేరుకోవడమే కాకుండా, సౌత్ నుంచి నార్త్ వరకు ఏకఛత్రాధిపత్యం వహించే మెగా పాన్-ఇండియా సూపర్ స్టార్ గా బన్నీ అవతరిస్తారు. సాంకేతికంగా , నటన పరంగా కూడా బన్నీ సరి కొత్త శిఖరాలను అధిరోహిస్తారు. త్రివిక్రమ్ సినిమాతో విజువల్ వండర్స్, సందీప్ వంగాతో రా అండ్ రస్టిక్ యాక్షన్ వంటి వైవిధ్యమైన జోనర్లు చేయడం వల్ల, ఆయన నటనలో ఉన్న అన్ని కోణాలు ప్రపంచానికి పరిచయమవుతాయి. ఇది కేవలం బాక్సాఫీస్ నంబర్లకే పరిమితం కాకుండా, గ్లోబల్ బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు ,అంతర్జాతీయ చలనచిత్ర వేదికలపై భారతీయ సినిమాకు ప్రతినిధిగా అల్లు అర్జున్‌ని నిలబెడుతుంది. రాజమౌళి సినిమాల తర్వాత ఆ స్థాయి ప్రభావాన్ని చూపగల సత్తా ఉన్న హీరోగా బన్నీ పేరు మారుమోగిపోతుంది.

ఈ ఐదేళ్ల విజయ పరంపర అల్లు అర్జున్‌ను టాలీవుడ్ నెంబర్ వన్ స్థానంలో తిరుగులేని వ్యక్తిగా మార్చేస్తుంది. రికార్డులే కాకుండా, తనకంటూ ఒక సొంత సామ్రాజ్యాన్ని సృష్టించుకుని, భవిష్యత్ తరాల నటులకు ఒక రోల్ మోడల్‌గా నిలిచే అవకాశాలున్నాయి. 2030 నాటికి భారతీయ చిత్ర పరిశ్రమ గురించి ఎక్కడ చర్చ జరిగినా? అల్లు అర్జున్ పేరు మొదటి వరుసలో ఉండటం ఖాయం. ఆ విజయం ఆయనను కేవలం ఒక నటుడిగానే కాకుండా, సినిమా మార్కెట్‌ను శాసించే ఒక మహోన్నత శక్తిగా తీర్చిదిద్దుతుంది. ప్రస్తుతం బన్నీ తమిళ దర్శకుడు అట్లీతో కలిసి ఓ గ్లోబల్ సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో బన్నీ మూడు-నాలుగు గెటప్స్ లో కనిపించ నున్నాడు? అన్న ప్రచారం సినిమాకు అంతకంతకు హైప్ తీసుకొస్తుంది. పాన్ వరల్డ్ లో ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.





**కృతి శెట్టి: బేబీ పింక్‌లో బాడీ - గ్లామ్ ఫోటోషూట్ & రైజింగ్ ఫిల్మ్ కెరీర్**



**శివంగి వర్మ సొగసైన లుక్స్**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965